


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 312

శుక్రవారం 2-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 107 | 71,645 |
| నిఫ్టీ ▽ | 28 | 21,698 |

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 15,290 | △ | 125 |
| డోజోన్స్ | 38,372 | △ | 223 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,622 | ▽ | 8 |
| డాక్స్ | 16,859 | ▽ | 45 |
| షాంఘై | 2,771 | ▽ | 18 |
| నికాయ్ | 36,011 | ▽ | 275 |

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 82.63 | 83.65 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 104.21 | 106.79 |
| € | యూరో | ఎస్‌బీఐ | 88.73 | 91.10 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 56.04 | 57.32 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 53.66 | 55.58 |
| S$ | సింగపూర్ డాలర్ | థామస్‌కుక్ | 59.53 | 62.85 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.17 | 22.79 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.69 | 23.48 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.43 | 12.50 |

## బులియన్ రూ.లలో

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) 62,599 | ▽ | 86 |
| బంగారం (99.5 స్వచ్ఛత) 62,348 | ▽ | 86 |
| వెండి (కిలో) 70,834 | ▽ | 834 |

## బల్క్‌డ్రగ్ పార్క్‌లకు 'ప్రోత్సాహం'

బల్క్‌డ్రగ్‌ల ప్రోత్సాహకానికి 2024-25 సంవత్సరం బడ్జెట్లో కేంద్రం రూ.1,000 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ కేటాయింపులు రూ.900 కోట్లు కేటాయించినప్పటికీ, సవరించిన తాజా అంచనాల ప్రకారం ఇది రూ.85 కోట్లకే పరిమితమైంది. ఈ ప్రకారం చూస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో అయినా వాస్తవ కేటాయింపులు రూ.1,000 కోట్లను పూర్తి స్థాయిలో ఖర్చు చేస్తుందా? అన్నది చూడాల్సి ఉంది.



## జనవరిలో 'తయారీ'కి కొత్త ఆర్డర్ల బూస్ట్



**న్యూఢిల్లీ:** భారత్ మొత్తం పారిశ్రామికరంగంలో దాదాపు 70 శాతం వాటా కలిగిన తయారీ రంగం జనవరిలో సానుకూల ఫలితాన్ని నమోదుచేసుకుంది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జనవరిలో 56.5కి ఎగసింది. ఇది నాలుగు నెలల గరిష్ట స్థాయి. డిసెంబర్‌లో ఈ సూచీ 54.9గా (18 నెలల కనిష్ఠం) నమోదయ్యింది. ద్రవ్యోల్బణం భయాల ఉపశమనం, డిమాండ్ బాగుండడం, కొత్త ఆర్డర్లలో పురోగతి ఇందుకు ప్రధాన కారణంగా నిలిచినట్లు నెలవారీ సర్వే పేర్కొంది. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే పేర్కొంటారు. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు.

## 97.5% రూ.2,000 నోట్లు వచ్చేశాయ్..!




**ముంబై:** బ్యాంకింగ్ వ్యవస్థలోకి 97.5 శాతం రూ.2,000 బ్యాంక్ నోట్లు తిరిగి వచ్చేసినట్లు బ్యాంకింగ్ రెగ్యులేటర్– రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పేర్కొంది. ఇంకా ప్రజాబాహుళ్యంలో రూ.8,897 కోట్ల విలువైన రూ.2,000 నోట్లు ఉన్నట్లు పేర్కొంది. ''రూ. 2,000 బ్యాంకు నోట్ల ఉపసంహరణ ప్రకటించిన 2024 మే 19న వ్యాపారం ముగిసే సమయానికి చెలామణిలో ఉన్న రూ. 2,000 బ్యాంకు నోట్ల మొత్తం విలువ రూ. 3.56 లక్షల కోట్లు. 2024 జనవరి 31వ తేదీన వ్యాపారం ముగిసే సమయానికి ఈ విలువ రూ. రూ.8,897 కోట్లకు తగ్గింది'' అని ఆర్‌బీఐ తాజా ప్రకటన వివరించింది.

## 2024లో ఆటో సూపర్‌స్టార్ట్

**జనవరిలో దూసుకుపోయిన విక్రయాలు**

**ముంబై:** దేశ ఆటోమొబైల్ పరిశ్రమకు కొత్త సంవత్సరం శుభారంభం ఇచ్చింది. పలు ఆటో సంస్థలు 2024 జనవరిలో గత సంవత్సరం ఇదే నెలతో పోల్చితే గణనీయమైన అమ్మకాలు జరిపాయి. మారుతీ సుజుకి ఇండియా, టాటా మోటార్స్, హ్యుందాయ్ మోటార్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఆటో, హోండా మోటార్‌సైకిల్, స్కూటర్ ఇండియా జనవరి అమ్మకాల్లో మంచి వృద్ధిని నమోదు చేశాయి. మొత్తం అమ్మకాలలో దేశీయ పరిమాణం జనవరిలో 2,78,155 నుండి 3,82,512 యూనిట్లకు పెరిగింది. ఇక ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 102 శాతం పెరిగి 36,883 యూనిట్లుగా ఉన్నాయి.



## అయిదేళ్లలో లక్ష ఎలక్ట్రిక్ ఆటోలు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** రెన్యువబుల్ ఎనర్జీ సొల్యూషన్స్ సంస్థ జీరో21 తాజాగా ప్రాజెక్ట్ గగన్‌ను ప్రారంభించింది. దీని కింద వచ్చే అయిదేళ్లలో 1 లక్ష ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలను ఆవిష్కరించాలని నిర్దేశించుకుంది. సంప్రదాయ ఇంధనాలతో నడిచే వాహనాలను రెట్రో ఫిట్టింగ్ ప్రక్రియ ద్వారా ఎలక్ట్రిక్‌కి మార్చడం లేదా కొత్త ఎలక్ట్రిక్ వాహనాలకు ఎక్స్ఛేంజ్ చేయడం ద్వారా దీన్ని సాధించాలని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా కన్వర్షన్ కిట్‌ను రూపొందించినట్లు సంస్థ వ్యవస్థాపకులు రాణి శ్రీనివాస్ తెలిపారు. దీనితో ఏదైనా ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌తో (ఐసీఈ) నడిచే త్రీ–వీలర్లను కేవలం నాలుగు గంటల్లోనే ఎలక్ట్రిక్ వాహనంగా మార్చవచ్చని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల నిర్వహణ ఖర్చులు తగ్గి, డ్రైవర్లకు దీర్ఘకాలికంగా ఆర్థిక ప్రయోజనం లభించగలవని శ్రీనివాస్ వివరించారు. ప్రధానంగా ఆటో రిక్షా యజమానులు, ఫ్లీట్ ఆపరేటర్లను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్ట్ గగన్‌ను చేపట్టినట్లు ఆయన చెప్పారు. రోడ్‌సైడ్ అసిస్టెన్స్ (ఆర్‌ఎస్‌ఏ)ని కూడా ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాలతో వాయు, ధ్వని కాలుష్యం తగ్గగలదని శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే జీరో21 సంస్థ ప్యాసింజర్, లోడ్ క్యారియర్ సెగ్మెంట్లలో ఎలక్ట్రిక్ త్రీ వీలర్లను తయారు చేస్తోంది. అలాగే రెట్రోఫిట్ కిట్‌లను కూడా అందిస్తోంది.



## ద్రవ్యలోటు కట్టడిలో తగ్గేదేలే..!

### 4.5 శాతం లక్ష్యం బాటలో పురోగతి

ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం–ద్రవ్యలోటు కట్టడిలో తన చిత్తశుద్ధిని కేంద్రం తాజా బడ్జెట్ ద్వారా ఉద్ఘాటించింది. ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే 2024–2025 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 5.1 శాతానికి తగ్గుతుందని మధ్యంతర బడ్జెట్ అంచనావేసింది. 2025–26 నాటికి ఈ లోటును 4.5 శాతానికి తగ్గాలన్నది ప్రభుత్వ రోడ్‌మ్యాప్ అన్న సంగతి తెలిసిందే. గడచిన ఆర్థిక సంవత్సరం (2022–23) ద్రవ్యలోటు 6.4 శాతం. మార్చితో ముగిసే ప్రస్తుత (2023–24) ఆర్థిక సంవత్సరంలో ఈ లక్ష్యాన్ని 5.9 శాతంగా గత ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన సమర్పించిన బడ్జెట్ నిర్దేశించుకుంది. అయితే ఇది 5.8 శాతానికే పరిమితమవుతుందని 2024–25 మధ్యంతర బడ్జెట్ పేర్కొంది. భారీ పన్ను ఆదాయాలు ద్రవ్యలోటు అంచనా సానుకూలంగా 5.9 శాతం నుంచి 5.8 శాతానికి తగ్గడానికి కారణంగా వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు విలువలో రూ.17,34,773 కోట్లు ఉంటే, 2024–25 రూ.16,85,494 కోట్లకు తగ్గుతుందని మధ్యంతర బడ్జెట్ పేర్కొంది. ఇక స్థూల, నికర మార్కెట్ రుణాలు 2024–25లో వరుసగా రూ.14.13 లక్షల కోట్లు, రూ.11.75 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్ తెలిపింది. ఈ రెండు సంఖ్యలూ 2023–24తో పోల్చితే తక్కువే కావడం గమనార్హం. ప్రభుత్వం తక్కువ రుణాలను తీసుకోవడం వల్ల ప్రైవేట్ రంగానికి పెద్ద ఎత్తున రుణాల లభ్యత సులభతరం అవుతుందని ఆర్థికమంత్రి వ్యాఖ్యానించారు.




ద్రవ్యలోటును తగ్గించడానికి భారతదేశం నిర్దేశించిన లక్ష్యాలను మెరుగుపరిచిందనే సందేశాన్ని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు విస్తృత స్థాయిలో పరిగణనలోకి తీసుకోవాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బడ్జెట్ అనంతర సమావేశంలో అడిగిన ఒక ప్రశ్నకు ఆమె సమాధానం చెబుతూ, ''మేము ఇంతకుముందు ఇచ్చిన ద్రవ్యలోటు రోడ్‌మ్యాప్‌ను అనుసరించడంలో, మెరుగుపరచడంలో ఎంతో పురోగతి సాధిస్తున్నాం. ఇది ప్రతి రేటింగ్ సంస్థకు సూటిగా పంపుతున్న ఒక స్పష్టమైన సందేశం. ఏజెన్సీలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి'' అని అన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి భారీ డివిడెండ్లు, పన్ను సమీకరణలో మెరుగుదల ద్రవ్యలోటు కట్టడిలో లక్ష్య సాధనకు దోహదపడుతున్న అంశాలు. గ్లోబల్ రేటింగ్ దిగ్గజ సంస్థలు– ఫిచ్, ఎస్‌అండ్‌పీ, మూడీస్‌లు దేశానికి అతి దిగువస్థాయి ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ రేటింగ్‌ను ఇస్తున్నాయి. చెత్త స్థాయికి ఈ రేటింగ్ కేవలం ఒకమెట్టు ఎక్కువ. అధిక రేటింగ్ కోసం కేంద్రం పలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, అంతగా ఫలితం ఇవ్వడంలేదు. ఒకదేశంలో పెట్టుబడులను పెట్టడానికి అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, ఆయా సంస్థలు ఈ రేటింగ్‌లనే ప్రాతిపదికగా తీసుకుంటాయి.

**రేటింగ్ ఏజెన్సీలూ... గుర్తించండి!**




## మహీంద్రా ఎక్స్‌యూవీ400 ఈఎల్ ప్రో..

వాహన తయారీ సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా హైదరాబాద్ మార్కెట్లో ఎలక్ట్రిక్ ఎక్స్‌యూవీ400 ఈఎల్ ప్రో ప్రవేశపెట్టింది. 34.5తోపాటు 39.4 కిలోవాట్ అవర్ ప్యాక్‌లలో ఇది లభిస్తుంది. పరిచయ ఆఫర్ ధర రూ.16.7 లక్షల నుంచి ప్రారంభం. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)



| 2-2-2024 | |
|---|---|
| విశాఖ | 545-00 |
| చిత్తూరు | 573-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 525-00 |
| విజయవాడ | 525-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **1-2-2024 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 520-00 |
| వరంగల్ | 522-00 |
| రిటైల్ ధర | 5.80 |

### ఆర్థిక వృద్ధికి దారితీస్తుంది..



నాలుగేళ్లలో మూలధన వ్యయం మూడు రెట్లు పెరిగినప్పటికీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి జీడీపీలో 3.4 శాతం కేటాయించడం ద్వారా ఈ వేగాన్ని స్థిరంగా ఉంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆధునిక, స్థిర మౌలిక సదుపాయాలను నిర్మించడానికి రూ.11.1 లక్షల కోట్లు వెచ్చించనున్నారు. ఇది ఉపాధి అవకాశాలు, ఆదాయ ఆర్జన పరంగా అద్భుత ఆర్థిక వృద్ధికి దారితీస్తుంది.

– నంద కిషోర్, ఎండీ, రామ్‌కీ ఎస్టేట్స్, ఫామ్స్

### సమగ్ర రోడ్ మ్యాప్..



2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన ఆర్థిక స్థితిని సాధించేందుకు వీలు కల్పించే సుస్థిర ఆర్థిక వృద్ధికి సమగ్ర రోడ్ మ్యాప్‌ను ఆర్థిక మంత్రి వివరించారు. పరిశోధన, ఆవిష్కరణ, బయో మానుఫ్యాక్చరింగ్, బలమైన అవస్థాపన అభివృద్ధి, సాంకేతికతతో నడిచే డిజిటల్ పరివర్తనపై సీతారామన్ నొక్కి చెప్పడం ప్రజలు కేంద్రీకృతంగా భారత్ సమ్మిళిత అభివృద్ధిని అందించడానికి శుభపరిణామం.

– కిరణ్ మజుందార్ షా, చైర్‌పర్సన్, బయోకాన్

### సమతూక బడ్జెట్



ఇటు సామాజిక అటు ఆర్థిక అవసరాల మధ్య సమతూకం పాటించే విధంగా బడ్జెట్ ఉంది. అలాగే వృద్ధిని వేగవంతం చేసేలా, వర్ధమాన పరిశ్రమలకు తోడ్పాటు అందించేదిగా ఉంది.

– కృష్ణ బోదనపు, ఎండీ, సైయంట్

### సౌర, పవన విద్యుత్‌కి ఊతం..



రూఫ్‌టాప్ సోలార్, పవన విద్యుత్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టడం స్వాగతించతగ్గ పరిణామం. అలాగే సీఎన్‌జీ, పీఎన్‌జీలో దశలవారీగా సీబీజీని కలపడాన్ని తప్పనిసరి చేయడం, నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు కేటాయింపులు పెంచడంపై హర్షణీయం. –మసూద్ మలిక్, రీ సస్టెయినబిలిటీ సీఈవో



## అయోధ్యకు 11 రోజుల్లో 25 లక్షల మంది

**అయోధ్య:** ఈ నెల 22వ తేదీన ప్రాణప్రతిష్ట జరిగినప్పటి నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు 11 రోజుల్లో అయోధ్యలోని రామాలయాన్ని 25 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. అదే సమయంలో విరాళాలు, కానుకల రూపంలో ఆలయానికి రూ.11 కోట్ల ఆదాయం సమకూరింది. ఆలయ ట్రస్ట్ ఆఫీస్ ఇన్‌చార్జి ప్రకాశ్ గుప్తా ఈ వివరాలు వెల్లడించారు. గత 11 రోజుల్లో చెక్కులు, ఆన్‌లైన్ ద్వారా రూ.3.50 కోట్లు, ఆలయం లోపల ఏర్పాటు చేసిన నాలుగు హుండీల్లో రూ.8 కోట్లు సమకూరినట్లు వివరించారు.

## పాక్‌లో 21 మంది ఉగ్రవాదులు హతం

**కరాచీ:** నిషేధిత బలోచ్ లిబరేషన్ ఆర్మీ ముజాహిద్ బ్రిగేడ్‌కు చెందిన 21 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు పాకిస్తాన్ సైన్యం ప్రకటించింది. బలోచిస్తాన్‌లోని మచ్ పట్టణం, కొల్పూర్ ప్రాంతాల్లో చేపట్టిన ఆపరేషన్‌లో సుమారు 21 మంది ఉగ్రవాదులు మృతి చెందారని సైన్యం తెలిపింది. నలుగురు సైనికులు, మరో ఇద్దరు పౌరులు కూడా ఈ సందర్భంగా ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. బుధవారం ఉగ్రవాదులు తమ వారిని విడిపించుకునే లక్ష్యంతో సెంట్రల్ మచ్ జైలుపైకి ఒక్కసారిగా దాడికి తెగబడ్డారు. బలగాలు దీటుగా స్పందించడంతో చీకటిమాటున కొందరు సమీప కొండ ప్రాంతంలోకి పరారైనట్లు సైన్యం వివరించింది.

## 31 డ్రోన్ల విక్రయానికి అమెరికా ఆమోదం

**వాషింగ్టన్:** భారత్‌కు సుమారు రూ.33 వేల కోట్ల విలువైన 31 ఎంక్యూ–9బీ అనే అత్యాధునిక డ్రోన్ల విక్రయానికి అమెరికా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గత ఏడాది జూన్‌లో భారత ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో కుదిరిన భారీ ఒప్పందంలో భాగమని అమెరికా రక్షణ శాఖ తెలిపింది. 31 ఎంక్యూ–9బీ రిమోట్లీ పైలటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ మరియు సంబంధ పరికరాలను విక్రయించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ధ్రువీకరణను గురువారం కాంగ్రెస్‌కు అందించినట్లు వెల్లడించింది.

## జైపూర్ లిటరేచర్ ఫెస్ట్ ప్రారంభం

**జైపూర్ నుంచి ప్రత్యేక ప్రతినిధి:** జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌తో రాజస్తాన్ పర్యాటకానికి గణనీయమైన మేలు జరగడమే కాకుండా నగరానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దియా కుమారి అన్నారు. గురువారం జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌ను ఆమె ప్రారంభించారు. ముగ్గురు బుకర్, ఐదుగురు పులిట్జర్ విజేతలతో పాటు ప్రపంచవ్యాప్తంగా 500 మంది సాహితీవేత్తలు ఈ వేడుకకు వచ్చారు.

# జార్ఖండ్‌లో ఉత్కంఠకు తెర

## కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై వీడిన సందిగ్ధత

- ముఖ్యమంత్రిగా నేడే చంపయ్ సోరెన్ ప్రమాణం
- గవర్నర్ నుంచి అందిన ఆహ్వానం
- 10 రోజుల్లోగా బలనిరూపణ చేసుకోవాలని ఆదేశం
- తొలుత గవర్నర్ నుంచి పిలుపు రాకపోవడంతో ఆందోళనకు గురైన జేఎంఎం కూటమి నేతలు
- 43 మంది ఎమ్మెల్యేలను హైదరాబాద్‌కు తరలించేందుకు యత్నం
- చివరి నిమిషంలో విమానాల టేకాఫ్‌కు అనుమతి నిరాకరణ
- ఎయిర్‌పోర్టు నుంచి వెనక్కి వెళ్లిపోయిన ఎమ్మెల్యేలు



రాంచీలోని ప్రత్యేక కోర్టు వద్ద సోరెన్‌ను కస్టడీలోకి తీసుకున్న ఈడీ అధికారులు



గవర్నర్‌ను కలిసి వస్తున్న చంపయ్ సోరెన్

**రాంచీ:** జార్ఖండ్‌లో ఉత్కంఠకు తెరపడింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాజీనామా చేసి 24 గంటలు గడిచిపోయిన తర్వాత కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని జేఎంఎం శాసనసభాపక్ష నేత చంపయ్ సోరెన్‌ను జార్ఖండ్ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ గురువారం రాత్రి ఆహ్వానించారు. ప్రమాణ స్వీకారం అనంతరం అసెంబ్లీలో 10 రోజుల్లోగా బలనిరూపణ చేసుకోవాలని ఆదేశించారు. జార్ఖండ్ కొత్త ముఖ్యమంత్రిగా చంపయ్ సోరెన్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై తొలుత సందిగ్ధత నెలకొంది. గవర్నర్ నుంచి పిలుపు రాకపోవడంతో జేఎంఎం–కాంగ్రెస్–ఆర్జేడీ కూటమి నేతలు ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నట్లు చంపయ్ సోరెన్ మరోసారి స్పష్టం చేశారు. ఆయన గురువారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. తమకు మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉందని, ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ(ఎంఎల్) ఎమ్మెల్యేలు ఉన్నారు. గవర్నర్‌తో భేటీ అనంతరం చంపయ్ సోరెన్ మీడియాతో మాట్లాడారు. కొత్త ప్రభుత్వాన్ని కొలువుదీర్చే విషయంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ చెప్పారని వెల్లడించారు. గవర్నర్‌ను చంపయ్ సోరెన్ కలవడానికి కంటే ముందు జేఎంఎం–కాంగ్రెస్–ఆర్జేడీ కూటమి ఓ వీడియోను విడుదల చేసింది. చంపయ్‌కి మద్దతిస్తున్న 43 మంది ఎమ్మెల్యేలు ఈ వీడియోలో కనిపించారు. మరోవైపు, బీజేపీ బారి నుంచి తమ ఎమ్మెల్యేలను కాపాడుకోవడంపై దృష్టి పెట్టారు. 43 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పాలిత తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు గురువారం రెండు ప్రత్యేక విమానాల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వారిని గచ్చిబౌలీలోని ఎల్లా హోటల్‌కు చేర్చాలని నిర్ణయించారు. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా చివరి నిమిషంలో రాంచీ నుంచి ప్రత్యేక విమానాల టేకాఫ్‌కు ఎయిర్‌పోర్టు అధికారుల నుంచి అనుమతి లభించలేదు. రెండు గంటలపాటు విమానాల్లోనే కూర్చుండిపోయిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు చేసేది లేక సర్క్యూట్ హౌజ్‌కు తిరిగి వచ్చారు. వీరిలో హేమంత్ సోరెన్ సోదరుడు, ఎమ్మెల్యే బసంత్ సోరెన్ కూడా ఉన్నారు. నూతన ప్రభుత్వ ఏర్పాటులకు ఎట్టకేలకు గవర్నర్ నుంచి ఆహ్వానం రావడంతో ఊహాగానాలకు తెరపడింది.

### రాంచీ జైలుకు హేమంత్ సోరెన్

మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) నేత, మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను అధికారులు రాంచీలోని హొత్వార్ జైలుకు తరలించారు. ఈడీ అధికారులు ఆయనను బుధవారం 7 గంటల సుదీర్ఘ విచారణ తర్వాత అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. గురువారం రాంచీలోని 'ప్రత్యేక మనీ లాండరింగ్ నిరోధక చట్టం కోర్టు'లో సోరెన్‌ను ప్రవేశపెట్టారు. తదుపరి విచారణ నిమిత్తం 10 రోజులపాటు ఆయనను తమ కస్టడీకి అప్పగించాలని కోరారు. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశారు. రాంచీలో 8.5 ఎకరాల భూములు అక్రమంగా సోరెన్ ఆధీనంలో ఉన్నాయని, అందుకే మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద దర్యాప్తు ప్రారంభించామని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై న్యాయస్థానం తమ తీర్పును శుక్రవారానికి రిజర్వ్ చేసింది. సోరెన్‌ను ఒకరోజుపాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దాంతో అధికారులు ఆయనను జైలుకు తరలించారు. గురువారం రాత్రంతా సోరెన్ జైలులో గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### సుప్రీంకోర్టులో సోరెన్ పిటిషన్

తన అరెస్టు అక్రమమంటూ సోరెన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టనుంది.

## జ్ఞానవాపి మసీదులో పూజలు ప్రారంభం

- సెల్లార్‌లో లక్ష్మీదేవి, వినాయకుడికి హారతులు
- 31 సంవత్సరాల తర్వాత మొదలైన పూజలు

**వారణాసి:** కాశీలోని జ్ఞానవాపి మసీదు సెల్లార్‌లో బుధవారం అర్ధరాత్రి పూజలు ప్రారంభమయ్యాయి. ఇక్కడున్న హిందూ దేవతల విగ్రహాలకు అర్చకులు హారతులు ఇచ్చారు. ఈ మసీదులో హిందూ దేవతలకు పూజలు జరగడం 31 సంవత్సరాల తర్వాత మొదటిసారి అని కాశీ విశ్వనాథ్ ఆలయ ట్రస్టు అధ్యక్షుడు నరేంద్ర పాండే చెప్పారు. పూజల కోసం వ్యాసుడి సెల్లార్ 31 ఏళ్ల తర్వాత తెరుచుకుందని అన్నారు. దక్షిణ సెల్లార్‌ను బుధవారం రాత్రి 10.30 గంటలకు తెరిచినట్లు వెల్లడించారు. అనంతరం కోర్టు ఉత్తర్వులను పాటిస్తూ పూజలు నిర్వహించామని, ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. కాశీ విశ్వనాథ ఆలయ సమీపంలోనే ఉన్న జ్ఞానవాపీ మసీదు భూగర్భ గృహంలో హిందూ దేవతలకు పూజలు చేసుకోవడానికి వారణాసి జిల్లా కోర్టు బుధవారం అంగీకరించిన సంగతి తెలిసిందే. కోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడిన కొన్ని గంటల వ్యవధిలోనే పూజలు ప్రారంభం కావడం గమనార్హం. పూజల విషయంలో కోర్టు ఉత్తర్వుల ప్రకారమే నడుచుకున్నామని వారణాసి జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.రాజలింగం చెప్పారు. మసీదు ప్రాంగణంలోని సెల్లార్‌ను శుభ్రం చేసిన తర్వాత లక్ష్మీదేవికి, వినాయకుడికి హారతి ఇచ్చినట్లు స్థానికులు చెప్పారు.



జ్ఞానవాపి మసీదు బేస్‌మెంట్‌లో పూజలు...

## అమెరికాలో మరో భారతీయ విద్యార్థి మృతి

**వాషింగ్టన్:** అమెరికాలోని సిన్సినాటిలో భారతీయ విద్యార్థి ఒకరు చనిపోయారు. అతడి మరణానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఇండియానా రాష్ట్రంలోని పర్డ్యూ యూనివర్సిటీలో చదువుకుంటున్న నీల్ ఆచార్య ఆదివారం నుంచి కనిపించకుండా పోయాడు. ఇతడు మృతి చెందినట్లు పోలీసులు సోమవారం ధ్రువీకరించారు. వారం రోజుల వ్యవధిలో ఇలాంటి ఘటన ఇది రెండోది కావడం గమనార్హం. మూడు రోజుల క్రితం ఎంబీఏ చదువుకుంటున్న వివేక్ సైనీ(25) అనే భారతీయ విద్యార్థిని జూలియన్ ఫాక్నర్ అనే డ్రగ్స్ బానిస సుత్తితో కొట్టి దారుణంగా పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే.

## వీసా ఫీజులు పెంచిన అమెరికా

**వాషింగ్టన్:** అమెరికా ప్రభుత్వం హెచ్–1బీ, ఎల్–1, ఈబీ–5 తదితర నాన్ ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తుల ఫీజులను పెంచుతున్నట్లు ప్రకటించింది. తాజా పెంపు ప్రకారం..భారతీయ టెక్కీలు ఎక్కువగా దరఖాస్తు చేసుకునే హెచ్–1బీ వీసా ఫీజు ప్రస్తుతమున్న 460 డాలర్ల నుంచి ఏకంగా 780 డాలర్లకు పెరిగింది. హెచ్–1బీ రిజిస్ట్రేషన్ ఫీజు కూడా 10 అమెరికన్ డాలర్ల నుంచి 215 డాలర్లకు పెరగనుంది. రిజిస్ట్రేషన్ ఫీజు పెంపు వచ్చే ఏడాది నుంచి అమల్లోకి రానుంది. అదే విధంగా, ఎల్–1 వీసా ఫీజు 460 డాలర్ల నుంచి 1,385 డాలర్లకు, ఇన్వెస్టర్ల వీసాగా పిలిచే ఈబీ–5 కేటగిరీ వీసా ఫీజును ప్రస్తుతమున్న 3,675 డాలర్ల నుంచి ఏకంగా 11,160 డాలర్లకు పెంచుతున్నట్లు ఫెడరల్ ప్రభుత్వం బుధవారం ఒక నోటిఫికేషన్లో వివరించింది. 2016 తర్వాత మొదటిసారిగా చేపట్టిన వీసా ఫీజుల పెంపు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు కానుంది.

## ఇరాన్‌లో మరో 4 అణు విద్యుత్ ప్లాంట్లు

**టెహ్రాన్:** ఇరాన్ ప్రభుత్వం మొత్తం 5 వేల మెగావాట్ల సామర్థ్యముండే నాలుగు అణు విద్యుత్‌ప్లాంట్ల నిర్మాణం చేపట్టింది. దేశ తూర్పు తీర పట్టణం సిరిక్ సమీపంలో వీటి నిర్మాణం మొదలైందని ఇరాన్ అణు విభాగం అధిపతి మహ్మద్ ఎస్లామి తెలిపినట్లు అధికార వార్తా సంస్థ ఇర్నా పేర్కొంది. సుమారు 20 బిలియన్ డాలర్ల(సుమారు రూ.1.64 లక్షల కోట్లు) వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టుతో 4 వేల మందికి ఉద్యోగాలు దొరుకుతాయని ఎస్లామి చెప్పారు. తొమ్మిదేళ్లలో వీటి నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. ఆ తర్వాత ఏటా 35 టన్నుల అణు ఇంధనాన్ని ఉపయోగించుకుంటుంది. రష్యా సహకారంతో నిర్మించిన వెయ్యి మెగావాట్ల అణుప్లాంట్ ఇరాన్‌లో ఇప్పటికే పనిచేస్తోంది.

## ఉక్రెయిన్‌కు ఈయూ భారీ సాయం

**బ్రస్సెల్స్:** రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు సాయం చేసేందుకు యూరోపియన్ యూనియన్ సిద్ధంగా ఉంటుందని యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ చార్లెస్ మైకేల్ చెప్పారు. గురువారం బ్రస్సెల్స్‌లో సమావేశమైన ఈయూలోని 27 సభ్య దేశాల నేతలు ఉక్రెయిన్‌కు 54 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.48 లక్షల కోట్లు)సాయం ప్యాకేజీని అందించేందుకు అంగీకరించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన తీర్మానంపై కేవలం గంటలోపే చర్చించి ఆమోదించినట్లు వివరించారు. సాయానికి సంబంధించిన తీర్మానాన్ని వీటో చేస్తామంటూ సభ్య దేశం హంగేరీ ప్రధాని విక్టర్ ఓర్బాన్ కొంతకాలం చేస్తున్న హెచ్చరికలను కూడా పట్టించుకోలేదన్నారు.

## ఎన్నికల్లో గెలవాలనే అందర్నీ జైలుకు పంపుతోంది: మమత

**శాంతిపూర్(పశ్చిమబెంగాల్):** త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యంతోనే బీజేపీ ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలందరినీ జైళ్లకు పంపుతోందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఒకవేళ తనను జైలుకు పంపినా బయటకు రాగలనని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలకు గాను రాష్ట్రంలో కాంగ్రెస్‌తో జట్టుకట్టేందుకు తమ టీఎంసీ పార్టీ ఆసక్తి చూపినా ఆ పార్టీ తిరస్కరించిందన్నారు.

## రాజ్యసభ వైస్ చైర్మన్‌గా వేమిరెడ్డి

**సాక్షి, న్యూఢిల్లీ:** రాజ్యసభ వైస్ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎంపికయ్యారు. నలుగురు మహిళలు సహా మొత్తం 8 మంది సభ్యులతో కూడిన వైస్ చైర్మన్ల ప్యానెల్‌ను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పునర్నియామకం చేశారు. ప్యానెల్‌లో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో పాటు రమీలాబెన్ బేచర్ భాయ్ బారా, సీమా ద్వివేది, డాక్టర్ అమీ యాజ్ఞిక్, మౌసమ్ నూర్, కనకమేడల రవీంద్ర కుమార్, ప్రొఫెసర్ మనోజ్ కుమార్ ఝా, లెఫ్టినెంట్ జనరల్ డీపీ వత్స్ (రిటైర్డ్) ఉన్నారు. చైర్మన్ ధన్‌ఖడ్ గైర్హాజరైన సందర్భాల్లో వీరు సభను నిర్వహిస్తారు.




సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 312

శుక్రవారం 2-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





ఇప్పుడంతా 'కృత్రిమ మేధ(ఏఐ)'దే రాజ్యం. ఈ చిత్రం సహా బడ్జెట్ కవరేజీలోని ప్రతీకాత్మక చిత్రాలు, ఇల్లస్ట్రేషన్లను వినూత్నంగా 'ఏఐ'తో రూపొందించాం.
- గ్రాఫిక్స్: సీతారాం

# వేసుకుందాం.. వందకు వంద!

## మొత్తం బడ్జెట్: రూ.47,65,768 కోట్లు

### 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

| పన్నుల ఆదాయం | ఆదాయ లోటు | పన్నేతర ఆదాయం | అప్పుల ద్వారా సమీకరణ |
|---|---|---|---|
| ₹ 26,01,574 కోట్లు | ₹ 16,85,494 కోట్లు | ₹ 3,99,701 కోట్లు | ₹ 16,81,944 కోట్లు |

పదేళ్ల ఎన్డీయే పాలన పురోగతిని వివరించేందుకే ప్రాధాన్యం | వేగవంతమైన వృద్ధి దిశగా మరిన్ని సంస్కరణలు | 2047 నాటికి 'వికసిత్ భారత్'గా నిలిపే లక్ష్యంతో ముందుకు..

- పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు..
- అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకూ చేరాయన్న నిర్మలమ్మ
- ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో ఎలాంటి మార్పుల జోలికి వెళ్లని తీరు
- రక్షణ రంగానికి పెంపు.. రూ. 6.2 లక్షల కోట్లు కేటాయింపు
- పర్యాటక ప్రాంతంగా లక్షద్వీప్ అభివృద్ధి
- 'రూఫ్ టాప్ సోలార్'తో కోటి ఇళ్లకు 300 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్
- రైల్వే శాఖకు రూ. 2.52 లక్షల కోట్లు.. 40 వేల బోగీల ఆధునీకరణ
- ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలకు 'ఆయుష్మాన్ భారత్' వర్తింపు

> ఈ బడ్జెట్ 'వికసిత భారత్' నాలుగు స్తంభాలైన యువత, పేదలు, మహిళలు, రైతులను మరింత శక్తివంతం చేస్తుంది. ఇది దేశ భవిష్యత్తును సృష్టించే బడ్జెట్. గ్రామాలు, నగరాల్లో పేదల కోసం 4 కోట్లకుపైగా ఇళ్లు నిర్మించాం. మరో 2 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తొలుత 2 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీ'లుగా తీర్చిదిద్దాలనేది లక్ష్యం.
> - ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

పేపరు ముందే లీకయిందో లేక, పాఠాలన్నీ బైపోసన పట్టేశారో గానీ... పరీక్షల ముందు విద్యార్థులు పడే టెన్షన్లో పదో వంతు కూడా మోదీ సర్కారులో కనిపించలేదు. బడ్జెట్లో సాధికారత అటుంచితే... ప్రవేశపెట్టడంలో మాత్రం సాధికారత కనిపించింది. 'ప్రోగ్రెస్ రిపోర్టు'లో వందకు వంద మార్కులు వేసుకుంది. ఎన్నికల తరుణంలోనూ తాయిలాల జోలికి పోకుండా.. గత పదేళ్ల పనితీరు వివరిస్తూ, దేశాన్ని తదుపరి దశకు తెచ్చామని చెప్పుకునేందుకే పరిమితమైంది. అభివృద్ధి చెందిన దేశంగా కొంత వరకూ మార్చగలిగామంటూ.. మరింత ముందుకెళ్లి పూర్తిగా వికసిత్ భారత్ సాధించడానికి మరో పాతికేళ్లు పడుతుందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. మామూలు రైళ్లను వందే భారత్ స్థాయిలో అప్‌గ్రేడ్ చేస్తామనటం .. రూఫ్‌టాప్ సోలార్‌తో ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు... ఇవన్నీ తమ హయాంలో దేశం కాస్త వికసించిందనే విశ్వాసంతో చేసిన ప్రకటనలే. కాకుంటే జనరల్ బోగీలు లేవనే ఆందోళనలు.. ఫుట్‌పాత్‌లకే పరిమితమయ్యే జీవితాలనూ చూడాలి. అందరితో కలిసి ప్రగతివైపు వెళతామన్న నిర్మలమ్మ మాటలు నిజమైతేనే వీళ్లూ వికసిస్తారు. అయినా ఇది ఓటాన్ అకౌంటేగా!. ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్లో ఇవి నెరవేరుతాయేమో!



మధ్యతరగతికి సొంతింటి వరం

రక్షణకు రూ. 6.21 లక్షల కోట్లు

కోటి ఇళ్లకు 'సూర్యోదయం' | సాగుకు రూ. 1.27 లక్షల కోట్లు | ఎలక్ట్రిక్..ఇక ఫుల్ చార్జ్

బడ్జెట్‌పై ప్రత్యేక కథనాలు 2,6,7,8,9 పేజీల్లో

# కడప గడ్డపై ఓ కపట నాటకం

# తెరపైకి సౌభాగ్యమ్మ!

**సూత్రధారి కుటిలనీతి చంద్రబాబు**

**పాత్రధారులు:** షర్మిల, సునీత, బీటెక్ రవి, సీఎం రమేశ్ తదితరులు

- ఎంపీగా సునీత బరిలోకి దిగేలా షర్మిలతో బాబు రాయబారం
- కాంగ్రెస్‌లో చేరి పోటీ చేసేందుకు ఆమె విముఖత.. దీంతో వివేకా భార్య సౌభాగ్యమ్మను నిలిపే ఆలోచన
- ఇండిపెండెంట్‌గా అయితే టీడీపీ మద్దతుంటుందని చర్చ
- కుటుంబీకుల మద్దతు కూడా అడగవచ్చనే ఆలోచన
- పైగా కుటుంబీకురాలికి మద్దతు ఇవ్వలేదని జగన్‌పై బురద వేయొచ్చు
- దీన్ని కడపలోను, రాష్ట్రవ్యాప్తంగానూ దుష్ప్రచారానికి వాడనున్న టీడీపీ
- వివేకా హత్య వ్యవహారంలో... ఎల్లో రాతలే అందరి అస్త్రాలు
- హంతకుడిని రక్షిస్తూ... టీడీపీతో అంటకాగుతున్న సునీత
- తన తండ్రిని అనైతికంగా ఓడించిన బీటెక్ రవితోనూ సాన్నిహిత్యం
- బీజేపీలో ఉన్న టీడీపీ నేతల నుంచీ ఆమెకు ఆర్థిక సహకారం
- షర్మిల భర్తతో, అటు రేవంత్‌రెడ్డితో కూడా బీటెక్ రవి మంతనాలు
- బాబు స్కెచ్ ప్రకారం కడపలో 'కుటుంబ పోరు' ఆవిష్కరించేందుకు కుట్ర



2 లో

అడుగడుగునా రాక్షసత్వం కనిపించే అత్యంత విస్తృతమైన నాటకమిది. పాత్రలు ఎవరైనా.. ఆడించేది మాత్రం చంద్రబాబు నాయుడు. ఆయన కోసం పనిచేసే మనుషులే!!. చంద్రబాబు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడే అయినా... ఆయన మనుషులు అన్నిచోట్లా ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్, జనసేన, కమ్యూనిస్టులు... ఇలా ఎక్కడ ఉన్నా పనిచేసేది మాత్రం బాబు కోసమే. కాకపోతే ఎంతమంది ఎన్ని చేసినా... జనం మనసుల్లో తిరుగులేని స్థానం సంపాదించుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవటం ఆయనకు చేత కావటం లేదు. ప్రజాక్షేత్రంలో నేరుగా ఎదుర్కోవటం అసాధ్యమని భావించటంతో.. విషప్రచారమే లక్ష్యంగా జగన్‌పైకి సొంత కుటుంబీకులనే పంపటానికి కుట్రపన్నారు. కడప కేంద్రంగా... కుట్రలన్నిటికీ కేంద్రస్థానం లాంటి భయంకరమైన కూహకానికి తెరతీశారు.






## 5 నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలు ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఉదయం 10 గంటలకు ఉభయ సభల సభ్యులనుద్దేశించి గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమవుతాయి. సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశ పెట్టనున్నారు.



# ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతకు ఓకే

### త్రిసభ్య కమిటీ భేటీలో అంగీకరించిన రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు

- ఏపీలోని 6, తెలంగాణలోని 9 అవుట్‌లెట్ల నిర్వహణ బాధ్యత కృష్ణాబోర్డుదే
- విధివిధానాల సమీక్ష అనంతరం శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు కృష్ణాబోర్డు ఆధీనంలోకి
- ఏపీ తాగునీటి అవసరాలకు తక్షణం 2 టీఎంసీల విడుదలకు అంగీకరించిన త్రిసభ్య కమిటీ

**కృష్ణాజలాలపై రాష్ట్ర హక్కులను పోరాడి పరిరక్షించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్**

3 లో



## బ్లూ ఎకానమీతో రాష్ట్రానికి లబ్ధి

దేశంలో సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే విధంగా కేంద్ర ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన బ్లూఎకానమీ–2తో రాష్ట్రానికి లబ్ధిచేకూరుతుందని ఆశిస్తున్నాం. కోస్తాతీరంలో ఆక్వా, మెరైన్ కల్చర్‌ను ప్రోత్సహించే విధంగా కేంద్రం ప్రవేశపెట్టనున్న ఐదు ఇంటిగ్రేటెడ్ ఆక్వాపార్క్‌ల్లో ఒకటి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అంతర్జాతీయంగా భారత్ పటిష్టమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతు ఇస్తున్నాం.

– డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, చైర్మన్, సీఐఐ ఏపీ చాప్టర్



## మౌలిక రంగానికి పెద్ద పీట

ఎన్నికల ముందు ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో మార్పులు చేయకపోవడం నిరాశపరిచింది. వికసిత్ భారత్ కింద పేదలు, యువత, రైతులు, మహిళలను నాలుగు స్తంభాలుగా పేర్కొంటూ వీరికి పెద్ద పీట వేసింది. మౌలిక రంగానికి రూ.11.1 లక్షల కోట్లు కేటాయించడం, పరిశోధనలకు 50 ఏళ్ల పాటు వడ్డీ లేకుండా రుణాలు ఇచ్చే విధంగా లక్ష కోట్లతో నిధిని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం.

–పొట్లూరి భాస్కరరావు, ప్రెసిడెంట్, ఏపీ చాంబర్స్





## కేంద్ర పన్నుల వాటా నుంచి రూ.49,364.61 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర పన్నుల వాటా నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25)లో ఏపీకి రూ.49,364.61 కోట్లు వస్తాయని అంచనా వేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ విషయాన్ని పేర్కొన్నారు. 2023–24వ ఆర్థిక సంవత్సరం (రూ.44,698.99 కోట్లు)తో పోల్చితే ఇది రూ.4,665.62 కోట్లు ఎక్కువ.

## ఆతిథ్య రంగానికి తోడ్పాటు హర్షణీయం

- ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలు పర్యాటక, ఆతిథ్య రంగం అభివృద్ధికి తోడ్పాటునిస్తాయని ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి గురువారం ఓ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు. ఐకానిక్ టూరిస్ట్ కేంద్రాల సమగ్రాభివృద్ధి, ప్రపంచ స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మ్యాచింగ్ ప్రాతిపదికన పర్యాటక రంగం అభివృద్ధికి దీర్ఘకాలిక వడ్డీలేని రుణాలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. చిన్న, పెద్ద హోటళ్ల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని కోరారు. చిన్న హోటళ్లకు విధించే 12శాతం జీఎస్టీని 7శాతానికి తగ్గించాలని, కోవిడ్ కారణంగా ఇచ్చిన వడ్డీ రాయితీని 3 నుంచి 6ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో హోటల్ మేనేజ్‌మెంట్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

## మార్పు తీసుకొచ్చేలా బడ్జెట్: జీవీఎల్



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గొప్ప మార్పు తీసుకొచ్చేవిధంగా కేంద్రం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఉందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టే బడ్జెట్‌లా కాకుండా.. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే నిర్ణయాలను బడ్జెట్ ద్వారా చెప్పారన్నారు. గురువారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ.. మహిళలు, యువత, రైతులు, పేదల అభివృద్ధికి కావలసిన ఆర్థిక ప్రణాళికను ఈ బడ్జెట్ ద్వారా రూపొందించారన్నారు. ఇది భారత రాజకీయాల్లో సంచలనమైన మార్పని, 'సబ్‌కా సాత్–సబ్ కా వికాస్' అనే నినాదం మరోసారి బడ్జెట్ లో కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. మధ్యంతర బడ్జెట్‌తో ఏపీకి కూడా న్యాయం జరుగుతుందన్నారు.

## బడ్జెట్‌లో ఏపీకి రిక్తహస్తం

- పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. విభజన హామీల అమలుకు కేంద్రం నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. గురువారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదాతో పాటు, ఇతర హామీలను సైతం విస్మరించిందని విమర్శించారు. పెట్రోలియం, ట్రైబల్, హెల్త్ యూనివర్సిటీల ఊసు లేదని, పోలవరం, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించే అంశాలపై నోరు మెదపలేదని మండిపడ్డారు. బడ్జెట్‌లో ఏపీకి రావాల్సినవన్నీ వచ్చే వరకు తాము పోరాడతామని గిడుగు రుద్రరాజు తెలిపారు.

## ఏపీకి అన్యాయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు, పోలవరం, ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి రాజధానికి నిధులు, విభజన హామీల ప్రస్తావన వంటి అంశాలు ఈ బడ్జెట్లో ప్రస్తావించకపోవడం దారుణమని పేర్కొన్నారు. జీఎస్టీ వసూళ్లు ఏటా పెరుగుతున్నప్పటికీ రాష్ట్రం వాటా మాత్రం పెరగడం లేదని తెలిపారు. ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా ఈ నెల 7, 8 తేదీల్లో ఢిల్లీలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# కడప గడ్డపై ఓ కపట నాటకం

# తెరపైకి సౌభాగ్యమ్మ!



### ఒక్కొక్కరినీ పావులుగా రంగంలోకి దింపుతున్న చంద్రబాబు

(సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)

ఇడుపులపాయలో రెండ్రోజుల కిందట షర్మిల–సునీత కలిశారు. దానికి ఎల్లో మీడియా ఎందుకు అంత ప్రాధాన్యమిచ్చింది? హైదరాబాద్‌లో రెగ్యులర్‌గా కలిసే ఈ అక్కచెల్లెళ్లిద్దరూ ఒకరినొకరు ఇడుపులపాయలో కలిస్తే అంత ప్రాధాన్యమెందుకు? ఎందుకంటే వైఎస్ వివేకానందరెడ్డి భార్య సౌభాగ్యమ్మను కడపలో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించటమనేది ఇక్కడ దాదాపుగా ఖరారైంది. కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తే... బీజేపీకి తప్పుడు సంకేతాలు వెళ్లి కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమకు వ్యతిరేకంగా మారవచ్చని సునీత భయం. దీంతో... ఆమె తల్లి సౌభాగ్యమ్మను తెరపైకి తీసుకొచ్చారు. ఎందుకంటే బీజేపీలోని సీఎం రమేశ్, సుజనా చౌదరి లాంటి టీడీపీ నేతలే ఈ కేసులో ఆమెకు ఆర్థికంగా, న్యాయపరంగా సహకరించటంతో పాటు రికమెండేషన్లు, పైరవీల్లోనూ సాయం చేస్తున్నారు. ఇక తెలుగుదేశంలో చేరిపోతే... బాబు నాయుడితో, ఏబీఎన్ రాధాకృష్ణతో, వివేకాను అనైతికంగా ఓడించిన బీటెక్ రవితో తమ సత్సంబంధాలు బాహాటంగా బయటపడిపోతాయని... ఇన్నాళ్లూ కేసును వెనకనుంచి నడిపింది వీరేనన్న సత్యం వెల్లడయిపోతుందని భయం. దీంతో బాబు ప్లాన్ ప్రకారం... సునీత తల్లి సౌభాగ్యమ్మను స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టేటట్లుగా, దానికి కాంగ్రెస్, టీడీపీ నూరు శాతం మద్దతిచ్చేట్లుగా వీరి మధ్య ఒక అవగాహన కుదిరినట్లు తెలిసింది. ఇలా చేస్తే ప్రస్తుతం ఎంపీగా ఉన్న అవినాశ్ రెడ్డిపై వీలైనంత బురద జల్లవచ్చని, కుటుంబంలోని వ్యక్తి స్వతంత్రంగా పోటీ చేస్తున్నారనే ముసుగులో కుటుంబీకుల మద్దతు అడగవచ్చనేది వారి ఆలోచన. పైపెచ్చు కుటుంబంలోని వ్యక్తి ఇండిపెండెంట్‌గా పోటీ చేసినా... మద్దతివ్వకుండా ఆమెపై అభ్యర్థిని నిలబెట్టారనే కోణంలో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ జగన్ పైనా దుష్ప్రచారం చేయాలనేది వారి కుట్ర.

**ఇది కుట్ర అని అడుగడుగునా తెలిసిపోతున్నా... పాత్రధారులు మాత్రం బాబు నాయుడి ఉచ్చులో పడి ఆయన చెప్పినట్లు చేసుకుంటూ పోతుండటమే అన్నిటికన్నా విచిత్రం. వివేకా హత్య జరిగిన నాటి నుంచి వరసగా మారుతున్న పరిణామాలు... దీన్లోని లోతైన కుట్ర కోణాన్ని చెప్పకనే చెబుతాయి.**

### మీ నాన్నను చంపింది నేనే! అని చెప్పినా...



దస్తగిరి

ఇతను వివేకా మాజీ డ్రైవరు. వివేకాను తానే గొడ్డలితో నరికి నరికి కిరాతకంగా చంపానని స్వయంగా స్టేట్‌మెంట్ ఇచ్చిన వ్యక్తి. రూ.500, వెయ్యి అప్పులు తెచ్చుకుని గాలికి తిరిగే ఈ దస్తగిరి ఆర్థిక పరిస్థితి... వివేకా కేసులో అప్రూవర్‌గా మారాక ఒక్కసారిగా టర్న్ అయింది. కార్లలో డ్రైవరును పెట్టుకుని తిరిగే స్థితికి వచ్చేశాడు. వివిధ కోర్టుల్లో ఈయనపై ఉన్న కేసుల కోసం లాయర్లను సునీత, చంద్రబాబు, బీటెక్ రవి పెడుతున్నారంటే ఈ కుట్రను తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. దస్తగిరి అప్రూవర్‌గా మారకముందే ముందస్తు బెయిలు కోసం కోర్టులో దరఖాస్తు చేశాడు. తన తండ్రిని అత్యంత కిరాతకంగా నరికి చంపానని స్వయంగా చెప్పిన దస్తగిరి బెయిలుకు.. వివేకా కుమార్తెగా సునీత ఏమాత్రం అభ్యంతరం చెప్పలేదు. వీళ్ల మధ్య ఉన్న ఎంత గాఢమైన లోపాయికారీ ఒప్పందం ఉందో తెలియటానికి ఇది చాలదూ!!.

### నాన్నను అనైతికంగా ఓడించినా...



బీటెక్ రవి

క్రికెట్ బెట్టింగుల్లో స్థానికంగా చిరపరిచితుడు. బెట్టింగుల్లో పోలీసులకూ దొరికాడు. 2017లో టీడీపీ తరఫున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కడపలో పోటీ చేసి.. వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన వైఎస్ వివేకాను అనైతికంగా ఓడించాడు. చాలినంత మంది ఎంపీటీసీ, జెడ్పీటీసీల మద్దతు లేకపోయినా... నాటి సీఎం చంద్రబాబు, మంత్రి ఆదినారాయణరెడ్డి సాయంతో వాళ్లను రకరకాలుగా ప్రలోభపెట్టాడు. కొందరిని బెదిరించి లోబరచుకుని తనకు బలం లేకున్నా వివేకాను ఓడించగలిగాడు. తండ్రిని దుర్మార్గపు పద్ధతుల్లో ఓడించిన ఈ వ్యక్తి... ఇపుడు సునీత దంపతులకు అత్యంత సన్నిహితుడంటే ఏమనుకోవాలి? కేసు గురించి, కేసుద్వారా పొందాల్సిన రాజకీయ ప్రయోజనాల గురించీ వీరు నిత్యం సంప్రతింపులు జరుపుకొనే స్థాయిలో ఉన్నారంటే ఏమనుకోవాలి? ఈ కేసులో అవినాశ్‌పై బురద జల్లాలనుకున్న ప్రతిసారీ... మాట్లాడేది రవి. మాట్లాడించేది సునీత దంపతులు. బీటెక్ రవి తీవ్రమైన విమర్శలు చేయటం... దాన్ని ఎల్లో మీడియా విస్తృతంగా ప్రచారం చేయటం... తరవాత చంద్రబాబు సహా టీడీపీ వాళ్లు ఇవే అంశాల్ని మాట్లాడటం వీళ్ల మోడస్ ఆపరాండీ.

### బాబు శిష్యుల కలయిక దేనికోసం?



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో బీటెక్ రవి

కనెక్షన్ అనొచ్చు... రిలేషన్ అనొచ్చు. చంద్రబాబు నాయుడు, బీటెక్ రవి, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ, సునీత, షర్మిల అందరూ ఇందులో భాగమే. ఆ రాష్ట్రమూ కాదు... ఆ పార్టీ కూడా కాదు. కానీ రేవంత్‌రెడ్డిని బీటెక్ రవి వెళ్లి కలిశాడంటే ఏమిటర్థం? అప్పటిదాకా తెలంగాణలోనే చావో రేవో అన్న షర్మిల... ఆ తరవాత కాంగ్రెస్‌లో చేరి నేరుగా ఏపీకి వచ్చి ఈ రకమైన మంత్రాంగం నడుపుతున్నారంటే ఏమనుకోవాలి? అయినా ఇది చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన సంఘటన. మూడు నెలల తరవాత మరో ప్రభుత్వం వచ్చింది. పోలీసులూ వారే... దర్యాప్తు మొదలుపెట్టిందీ వారే. ఇంత స్పష్టంగా నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఆదేశాలతో లేఖ, ఫోన్ దాచిపెడితే వారిని ఎందుకు విచారించలేదు? రాజకీయాలకు, విమర్శలకు ఈ సంఘటనను వాడుకుని... అసలు కేసును నీరుగార్చింది నాటి చంద్రబాబు ప్రభుత్వం కాదా? అసలు ఇన్ని కుట్రలు చేసే బదులు బాబు నేరుగా టీడీపీ టికెట్టే ఇవ్వవచ్చు కదా? అపుడు ప్రజల్లో ఎవరి బలం ఎంత ఉందో తెలిసిపోతుందిగా? కుట్రలకు, కుతంత్రాలకు విలువ ఉందో... లేక మంచి చేసిన ప్రభుత్వానికి విలువ ఉందో తేలిపోతుందిగా? ఏమంటావ్ బాబూ!!?

## మొదట చూశారు... కుమార్తెకు చెప్పారు



కృష్ణారెడ్డి

వివేకా మృతదేహాన్ని మొదట చూసింది ఆయన పీఏ కృష్ణారెడ్డే. అక్కడే రక్తపు మరకలతో ఉన్న లేఖను, వివేకా మొబైల్ ఫోన్‌ను ఈయన తీసుకున్నాడు. అదే విషయాన్ని సునీతకు ఫోన్లో చెప్పాడు. సునీతతో పాటు వివేకా బావమరిది నర్రెడ్డి శివప్రసాద్ రెడ్డికి (ఈయన సునీత భర్త రాజశేఖరరెడ్డికి, సౌభాగ్యమ్మకు సొంత సోదరుడు) కూడా చెప్పాడు. ఈ విషయం కాల్ రికార్డ్స్‌లోనూ వెల్లడయింది. వివేకా గురించి సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పగానే... ఆ లేఖను, వివేకా ఫోన్‌ను ఎవ్వరికీ ఇవ్వవద్దని కృష్ణారెడ్డిని ఆయన ఆదేశించారు. దీంతో ఆయన తదుపరి వచ్చిన బంధువులకు గానీ, పోలీసులకు గానీ ఎవ్వరికీ దీన్ని చూపించలేదు. ఆ లేఖను చూపించి ఉంటే... దాన్లోని రక్తాన్ని చూసైనా ఎవ్వరూ మృతదేహాన్ని ముట్టుకునేవారు కాదేమో. కానీ నర్రెడ్డి ఆదేశాలతో ఆయన ఎవ్వరికీ దీన్ని చూపించలేదు... చెప్పలేదు. ఈ విషయాన్ని సునీతే పోలీసుల దగ్గర అంగీకరించారు. అలా ఎందుకు చెప్పారని అడిగితే... కృష్ణారెడ్డికి ప్రాణభయం ఉంటుందనే ఉద్దేశంతోనే అలా చెప్పామన్నారు. లేఖ రాసింది తన తండ్రేనని, చేతిరాత ఆయనదేనని కూడా సునీత పోలీసు డీజీపీ ఎదుట అంగీకరించారు. నిజానికి రక్తంతో రాసిన ఆ లేఖను ఎవరు చూసినా... అది సహజ మరణం కాదని తేలిగ్గా అర్థమవుతుంది. పోలీసులకో, అక్కడికి వచ్చిన వారికో వెంటనే ఆ లేఖను ఇచ్చి ఉంటే... అక్కడి వ్యవహారం మరోలా ఉండేది. ఇది చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు జరిగిన హత్య. అప్పటి పోలీసులు గానీ, సీబీఐ గానీ ఎందుకు ఈ లేఖ, ఫోన్ చూపించలేదని... ఫోన్లో నుంచి వివేకా– ఆయన రెండో భార్య షమీమ్ సంభాషణల్ని ఎందుకు డిలీట్ చేశారని, సునీతను దూషిస్తూ షమీమ్ లేవనెత్తిన అంశాలను ఎందుకు డిలీట్ చేశారని విచారించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. అసలు ఆ కోణాన్నే పట్టించుకోలేదెందుకో..!!.

- ఈ హత్యలో ఎల్లో మీడియా చేస్తున్న మరో దుష్ప్రచారమేంటంటే... ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందే అక్కడకు చేరుకున్నారనేది. నిజానికి అవినాశ్ అక్కడకు చేరేసరికే జనం పోగై ఉన్నారు. వివేకా గుండెపోటుతో చనిపోయారని, సిగరెట్లు ఎక్కువ తాగుతారు కనుకనే ఇలా జరిగిందని తనతో నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి చెప్పినట్లు స్వయంగా నాటి టీడీపీ మంత్రి ఆదినారాయణ రెడ్డే చెప్పారు. అదే శివప్రకాశ్ రెడ్డి అవినాశ్‌కూ ఫోన్ చేసి, ''బావ చనిపోయారు. అర్జెంటుగా అక్కడకు వెళ్లు'' అన్నారు. దీంతో జమ్మలమడుగులో ఎన్నికల ప్రచారానికని అప్పుడే బయల్దేరిన అవినాశ్ రెడ్డి.. వెంటనే యూ టర్న్ తీసుకుని అక్కడకు చేరుకున్నారు. ఆయన ఫోన్ చెయ్యకుండా ఉంటే అవినాశ్‌కు విషయం తెలిసేదే కాదు. ఆయన అక్కడకు రాకుండా ఎన్నికల ప్రచారానికి వెళ్లిపోయి ఉండేవారు. బావ చనిపోయారు.. వెళ్లమని చెప్పిన నర్రెడ్డి శివప్రసాద్... ఎలా చనిపోయారనేది కానీ, లెటర్–ఫోన్ సంగతి కానీ చెప్పలేదు. ఇదంతా ఒక్క స్కెచ్ ప్రకారం జరిగిందనటానికి ఇంతకన్నా ఏం కావాలి?

## ఆస్తి కోసం సునీతతో విభేదాలు



షమీమ్‌తో వివేకా (ఫైల్)

వివేకా మరణించిన నాడు షమీమ్‌కు, వివేకాకు మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, మెసేజుల్లో చాలా అంశాలున్నాయి. ముఖ్యంగా సునీత గురించి జరిగిన ఎస్ఎంఎస్/సంభాషణలన్నీ ఆ తరవాత డిలీట్ చేసేశారు. ఎందుకు చేశారనేది దర్యాప్తు చేయనేలేదు. వివేకాకు, షమీమ్‌కు ఒక కుమారుడు ఉన్నాడనే అంశాన్ని సైతం రహస్యంగానే దాచిపెట్టారు. షమీమ్ సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో వివేకాను ఆయన కుమార్తె, అల్లుడు, బావమరిది ఏ రకంగా హింస పెట్టారు... చెక్ పవర్ తీసేసి ఆర్థికంగా ఎలా నిర్వీర్యం చేశారో స్పష్టంగా చెప్పారు. దస్తగిరి తాను వివేకాను చంపటానికి ముందు కొన్ని డాక్యుమెంట్ల కోసం ఇల్లంతా వెతికినట్లు సాక్షులు చెప్పారు. కానీ దర్యాప్తులో ఆ అంశాలకు విలువే ఇవ్వలేదు. అంతేకాదు. తొలుత ఛార్జిషీట్లో వివేకాకు, ఏ1గా పేర్కొన్న ఎర్ర గంగిరెడ్డికి ఆర్థికపరమైన వివాదాలున్నాయని, వివేకాకు ఏ2 సునీల్ యాదవ్ తల్లితోను, ఏ3 ఉమామహేశ్వరరెడ్డి భార్యతోను అక్రమ సంబంధాలున్నాయని స్పష్టంగా ఉన్నప్పటికీ... ఆ కోణాన్ని తరువాతి ఛార్జిషీట్లలో పూర్తిగా తొక్కిపట్టేశారు.

## దూరం 700 మీటర్లే




అవినాశ్‌రెడ్డి

అవినాశ్, వివేకా ఇళ్ల మధ్య ఉన్న దూరం ఏరియల్ డిస్టెన్స్ అయితే 250 మీటర్లు. రోడ్డు మార్గాన అయితే 700 మీటర్లు. గూగుల్ టేకవుట్ పేరు చెప్పి వివేకా ఇంట్లో ఉన్న ఒక మనిషిని అవినాశ్ ఇంటికి వచ్చినట్లు ఎలా నిర్ధారిస్తారు? ఆ రోజు ఉదయం అవినాశ్ ఎన్నికల ప్రచారం కోసం జమ్మలమడుగుకు బయలుదేరి పులివెందుల రింగ్‌రోడ్లోకి ప్రవేశించిన వెంటనే నర్రెడ్డి శివప్రసాద్ ఫోన్ చేసి వివేకా మరణం గురించి చెప్పారు. వెంటనే ఆయన యూ–టర్న్ తీసుకుని తనతో ఉన్న 3 వాహనాలతో సహా వివేకా ఇంటికి వెళ్లారు. ఫోన్ వచ్చిన రెండు నిమిషాల్లోనే ఎలా వచ్చారనేది సీబీఐ ప్రశ్న. నిజానికి రింగ్‌రోడ్డు (కృష్ణాలయం) నుంచి వివేకా ఇంటికి రెండు నిమిషాలు చాలు. పైపెచ్చు ఉదయాన్నే రోడ్లు ఖాళీగా ఉంటాయి కదా!.

## రాష్ట్రం భూమి ఇచ్చినా..

# రైల్వేజోన్‌పై కేంద్రందే కిరికిరి

- భూసమస్య పేరుతో రాష్ట్ర ప్రభుత్వంపై నెపం నెట్టేసేందుకు కేంద్ర మంత్రి యత్నం
- 950 ఎకరాలు అందుబాటులో ఉందని స్పష్టంచేసిన డీపీఆర్
- రైల్వేకు 52 ఎకరాలు అప్పగించలేదని మంత్రి అసత్య ఆరోపణలు
- కానీ, జనవరి 2నే రైల్వేకు ఆ భూములు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఒడిశాలో రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్రం పన్నాగం
- పైగా రైల్వే మంత్రి కూడా ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారే



52 ఎకరాలను రైల్వే శాఖకు అప్పగిస్తూ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రైల్వే డీఆర్ఎంకు జనవరి 2న రాసిన లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక డిమాండ్, విభజన చట్టంలోని హామీ అయిన విశాఖపట్నం రైల్వేజోన్‌కు సంబంధించిన కూత ఈ ఏడాది రైల్వే బడ్జెట్‌లోనూ వినిపించలేదు. పైగా దీనిపై కేంద్రం మరోసారి కిరికిరీ పెడుతోంది. రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం ఢిల్లీలో విలేకరుల సమావేశంలో జోన్ అంశంపై నెపాన్ని రాష్ట్ర ప్రభుత్వం నెట్టేసేందుకు యత్నించారు. రైల్వేజోన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించాల్సి ఉందని ఆయన చెప్పడం విడ్డూరంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని కప్పిపుచ్చేందుకు సమాధానాన్ని దాటవేసే ఉద్దేశంతోనే ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై నెపం నెట్టేసేందుకు ప్రయత్నిస్తూ అసత్య ఆరోపణలు చేయడం విభ్రాంతి కల్గించింది. ఎందుకంటే.. కేంద్రమంత్రి చెప్పిన 52 ఎకరాలకు, రైల్వేజోన్ వ్యవహారానికి అసలు ప్రత్యక్ష సంబంధమేలేదు. ఆయన చెబుతున్న 52 ఎకరాలను రైల్వేకు కేటాయించకుండా తాత్సారం చేసింది గత టీడీపీ ప్రభుత్వం. ఇక అసలు విషయం ఏమిటంటే.. ఆ 52 ఎకరాలను రైల్వేకు అప్పగిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. గత నెల 2న జీవీఎంసీ కమిషనర్ రైల్వే అధికారులకు లేఖ రాశారు. వాస్తవాలిలా ఉంటే.. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ఇందుకు విరుద్ధంగా రైల్వేజోన్‌పై అవాస్తవాలు వల్లెవేశారు. కేవలం ఒడిశాలోని బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసమే ఆయన ఈ విధంగా మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ వ్యవహారాన్ని తాత్సారం చేస్తున్నట్లుగా స్పష్టమవుతోంది. అసలు ఈ రైల్వేజోన్ అంశంపై వాస్తవాలు ఏమిటంటే..

- విశాఖ కేంద్రంగా 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' ఏర్పాటుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రైల్వే శాఖ రూపొందించింది. భవనాలు, ఇతర అవసరాల కోసం విశాఖలో 950 ఎకరాలు అందుబాటులో ఉందని స్పష్టంగా పేర్కొంది.
- రాష్ట్రప్రభుత్వ ఒత్తిడితో విశాఖపట్నంలో రైల్వే జోన్ కార్యాలయాల నిర్మాణానికి గతేడాది రూ.170 కోట్లు కూడా కేటాయించింది.
- రైల్వేజోన్ ఆచరణలోకి రావాలంటే సాంకేతికంగా కీలక అంశాలపై కేంద్రం నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోంది. భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పు కోస్తా రైల్వేజోన్, సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వేజోన్‌లతో ఏపీ పరిధిలో ఆస్తుల పంపకం, కొత్త డివిజన్ల ఏర్పాటు, ఉద్యోగుల కేటాయింపు, కొత్త కార్యాలయాల ఏర్పాటు తదితర అంశాలను ఓ కొలిక్కి తీసుకువచ్చి దక్షిణ కోస్తా రైల్వేజోన్‌ను ఆచరణలోకి తీసుకురావాలి. కానీ.. కేంద్రం బడ్జెట్‌లో ఈ విషయాలేవీ కనీసం ప్రస్తావించలేదు.
- ఇక రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించనందునే రైల్వేజోన్ ఏర్పాటులో జాప్యం జరుగుతోందనడం హాస్యాస్పదం. ఎందుకంటే.. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రైల్వే భూమికి బదులుగా రైల్వేశాఖకు భూమి కేటాయించాలని ఆయన చెబుతున్నారు. కానీ, విశాఖలో అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 2013లో రైల్వే భూములను తీసుకుంది. అందుకు ప్రత్యామ్నాయంగా రైల్వేశాఖకు 52 ఎకరాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రైల్వేశాఖ మధ్య అంతకుముందే ఒప్పందం కుదిరింది. అంటే.. రాష్ట్ర విభజనకు ఏడాది ముందు సంగతి అది.
- 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించారు. విభజన చట్టంలో విశాఖపట్నం కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీకి అంతకుముందటి రైల్వే భూమి తీసుకున్న దానికి సంబంధమేలేదు. ఆ అంశంతో ముడిపెట్టకుండా విభజన చట్టం ప్రకారం రైల్వే జోన్‌ను ఏర్పాటుచేయాలి. అందుకోసం 950 ఎకరాలు అందుబాటులో ఉన్నాయని కూడా డీపీఆర్‌లో కేంద్ర ప్రభుత్వమే స్పష్టంగా పేర్కొంది. ఆ విషయాన్ని కప్పిపుచ్చుతూ రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఆశ్చర్యకరం.
- వాస్తవానికి రైల్వేకు కేటాయించాలని 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిన 52 ఎకరాలపై వివాదం ఏర్పడింది. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు రైల్వేశాఖ అధికారులు ప్రయత్నిస్తే అక్కడి గిరిజనులు అడ్డుకున్నారు. సమస్య సున్నితంగా మారడంతో రైల్వేశాఖ వెనక్కి తగ్గింది. దీనిపై అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కూడా మౌనంగా ఉండిపోయింది. అప్పట్లో కూడా రైల్వేశాఖ ఆ విషయంపై పట్టుబట్టలేదు.
- ఇక భూమి సమస్యతోనే రైల్వేజోన్ ఏర్పాటులో జాప్యం జరుగుతోందని రైల్వేశాఖ ఇప్పటివరకు చెప్పనేలేదు. రైల్వేజోన్ అంశంపై వైఎస్సార్‌సీపీ ఎంపీలు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఈ నాలుగున్నరేళ్లలో ఎన్నోసార్లు సమావేశమయ్యారు. ఏ ఒక్క సమావేశంలో కూడా ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించనేలేదు.

**రైల్వేకు 52 ఎకరాలు అప్పగింత..**

కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ఇంకా అప్పగించలేదని చెబుతున్న 52 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రైల్వేకు అప్పగించేసింది. ఈ మేరకు గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఆ భూముల్లో ఉన్న ఆక్రమణలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలగించారు. వాటిని పూర్తిగా తమ ఆధీనంలో తీసుకున్నారు. జీవీఎంసీ పరిధిలోని ముడసర్లోవ సర్వే నెంబర్లు 57, 58, 59, 61, 62, 63, 64, 65తో ఉన్న 52 ఎకరాలను రైల్వేశాఖకు అప్పగించారు. ఈ మేరకు జీవీఎంసీ మున్సిపల్ కమిషనర్ సీఎం శ్రీకాంత్ వర్మ ఈ ఏడాది జనవరి 2నే విశాఖలోని ఈస్ట్‌కోస్ట్ డీఆర్ఎంకు లేఖ ద్వారా తెలియజేశారు. వాస్తవం ఇలా ఉంటే.. రాష్ట్ర ప్రభుత్వం భూమిని అప్పగించలేదని రైల్వేమంత్రి వ్యాఖ్యానించడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు ఢిల్లీలోని పచ్చమీడియా ప్రతినిధులు ఉద్దేశపూర్వకంగా అడిగిన ప్రశ్నలకు ప్రభావితమైన ఆయన అవాస్తవాలు మాట్లాడడం కేంద్రమంత్రి స్థాయికి తగినట్లుగా లేదని పలువురు విమర్శిస్తున్నారు.

**ఒడిశాలో రాజకీయ ప్రయోజనాల కోసమేనా?**

ఒడిశాలో బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసమే ఏపీ విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నది స్పష్టమవుతోంది. ప్రధానంగా విశాఖ కేంద్రంగా వాల్తేర్ రైల్వే డివిజన్‌ను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు డిమాండ్ చేస్తుండగా.. వాల్తేర్ రైల్వే డివిజన్‌ను రద్దుచేసి.. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, గుంతకల్ రైల్వే డివిజన్లతోనే కొత్త జోన్ ఏర్పాటుపై డీపీఆర్‌లో ప్రస్తావించారు. దీనిపై రాష్ట్రంలో తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఎందుకంటే.. విజయవాడ నుంచి విశాఖ 350 కి.మీ. దూరంలో ఉండగా.. రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఇచ్ఛాపురం 580 కి.మీ. దూరంలో ఉంది. అంతవరకు విజయవాడ రైల్వే డివిజన్‌గా ఏర్పాటుచేస్తే పరిపాలన నిర్వహణ సమస్యలు ఏర్పడతాయి. అందుకే వాల్తేర్ రైల్వే డివిజన్‌ను కొనసాగిస్తూనే విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ కావాలని రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం తూర్పు కోస్తా జోన్‌లో అత్యధిక రాబడి ఉన్న వాల్తేర్ డివిజన్‌ను రద్దుచేయాలని కేంద్రం భావిస్తోంది. తద్వారా భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పు కోస్తా రైల్వే జోన్ ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోంది. ఒడిశాలో బీజేపీకి రాజకీయంగా ప్రయోజనం కలిగించేందుకే ఇలా వ్యవహరిస్తోంది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఒడిశా కేడర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి కావడంతో ఆయన ఒడిశాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## 10 యూఎల్బీల్లో 'ప్రత్యేక' పాలన పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 10 యూఎల్బీ (అర్బన్ లోకల్ బాడీ)ల్లో ప్రత్యేకాధికారుల పాలనను మరో 6 నెలలు పొడిగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి గురువారం ఉత్తర్వులిచ్చారు. ఇందులో కందుకూరు, ఆమదాలవలస, నరసరావుపేట, పొన్నూరు, కావలి, వైఎస్సార్ తాడిగడపతో పాటు నగర పంచాయతీలైన చింతలపూడి, పొదిలి, అల్లూరు, బి.కొత్తకోట ఉన్నాయి.

## ఎన్నికల బడ్జెట్ కాదు

**వైఎస్సార్‌సీపీ ఎంపీ అయోధ్యరామిరెడ్డి**



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ కాదని వైఎస్సార్ సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ద్రవ్యోల్బణం నియంత్రణలో భాగంగా వ్యక్తిగత పన్నులు, కార్పొరేట్ పన్నులు మార్చలేదని తెలిపారు. ప్రతి ఇంటి పైకప్పున సోలార్ విద్యుదుత్పత్తి చేసేలా దానిపై ఆదాయం పొందేలా పథకం తీసుకురావడం మంచి నిర్ణయమన్నారు. పదేళ్ల కిందటి, ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు.

■ తెలంగాణ

## కుక్కల దాడిలో బాలుడు మృతి

- గుడిసెలో నిద్రిస్తుండగా ఘటన
- శంషాబాద్‌లో దారుణం..

శంషాబాద్ రూరల్: వీధికుక్కలు దాడి చేసి గాయపర్చడంతో ఏడాది వయసున్న బాలుడు మృతి చెందాడు. శంషాబాద్ పట్టణంలోని సామ ఎన్‌క్లేవ్ సమీపంలోని జీఎస్ఎస్‌యూఆర్ఐ గృహ సముదాయాల వద్ద కూలీ పని చేసుకుంటూ సూర్యకుమార్ కుటుంబం అక్కడే గుడిసెల్లో నివాసముంటోంది. అతనికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. రెండో కుమారుడు 20 రోజుల కిందట జన్మించాడు. చిన్న కొడుకుతో భార్య పుట్టింటి వద్ద ఉంటోంది. సూర్యకుమార్, అతని తల్లి, పెద్ద కొడుకు నాగరాజు(ఏడాది)తో పాటు గత నెల 31న రాత్రి గుడిసెలో నిద్ర పోయారు. అర్ధరాత్రి తర్వాత వీధికుక్కలు నాగరాజుపై దాడి చేయడంతోపాటు రోడ్డు పైకి లాక్కొచాయి. బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ విషయాన్ని అక్కడ ఉన్న ఓ వ్యక్తి గమనించి సూర్యకుమార్‌కు చెప్పాడు. అతను వచ్చి చూడగా, నాగరాజు అప్పటికే మృతి చెందాడు.

## టీవీ5 సాంబపై చీటింగ్ కేసు



గచ్చిబౌలి(హైదరాబాద్): టీవీ5 వైస్ ప్రెసిడెంట్ సాంబపై హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. మాదాపూర్‌లోని హుడా టెక్నో ఎన్‌క్లేవ్‌లోని 26వ నంబరు ఫ్లాట్ శ్రీధర్‌రావు పేరిట ఉంది. మైండ్ జంక్షన్‌లో ప్రైమ్ ఏరియాలో ఉన్న 717 చదరపు గజాల ఫ్లాట్‌ను హిందుస్తాన్ పెట్రోలియం సంస్థకు తమ సంతకాలు లేకుండానే లీజు డాక్యుమెంట్లు ఇచ్చారని ఫిర్యాదుదారుడు శ్రీధర్‌రావు ఆరోపించారు. ఫ్లాట్ లీజుపై టీవీ5 సాంబ కుటుంబ సభ్యులను ప్రశ్నించగా, పెట్రోల్ బంక్‌ను మీ పేరిట బదిలీ చేస్తామని నమ్మించారని, కాలం గడిచినా స్పందన లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు. బుధవారం రాత్రి సాంబ, డాక్టర్ కొల్లి సౌమ్య, మరి కొందరిపై ఐపీసీ 420 సెక్షన్ కింద కేసు నమోదైందని మాదాపూర్ సీఐ మల్లేష్ తెలిపారు.


## డ్రగ్స్ కేసులో సరైన సాక్ష్యాలు లేవు

**పలువురు సినీ నటులపై కేసు కొట్టివేత**

సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన టాలీవుడ్ డ్రగ్స్ కేసులో పలువురు సినీ నటులకు ఊరట లభించింది. డ్రగ్స్ కేసులో సరైన సాక్ష్యాలు లేవంటూ పలువురిపై కేసులను నాంపల్లి కోర్టు కొట్టేసింది. టాలీవుడ్ నటులే టార్గెట్‌గా 2017లో ఎక్సైజ్ కేసులు నమోదు చేయగా.. ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దాదాపు ఆరు నెలల పాటు సుదీర్ఘ విచారణ జరిపిన సిట్ 8 కేసులను నమోదు చేసింది. నిందితుల నుంచి గోళ్లు, వెంట్రుకలను కూడా నమూనాలుగా తీసుకుంది. అప్పటి నుంచి ఈ కేసులపై న్యాయస్థానంలో విచారణ సాగుతోంది. కాగా, శాంపిళ్లను ఎఫ్ఎస్ఎల్‌కు పంపగా... డైరెక్టర్ పూరీ జగన్నాథ్, హీరో తరుణ్ శాంపిల్స్‌ను పరిశీలించింది. వాళ్ల శరీరంలో ఎలాంటి డ్రగ్స్ ఆనవాళ్లు లభించలేదని ఎఫ్ఎస్ఎల్ తేల్చింది. ఈ నివేదిక ఆధారంగా, సాక్ష్యాలు లేని కారణంగా 8 కేసుల్లో ఆరు కేసులను కొట్టివేస్తూ న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. సరైన ఆధారాలు, సాక్ష్యాలు లేకపోవడంతో పాటు డ్రగ్స్ కేసులో పాటించాల్సిన విధానాన్ని కూడా పాటించలేదని ఎక్సైజ్ శాఖపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చాలా కాలం విచారణ జరిపినా బలమైన సాక్ష్యాలను కోర్టుకు సమర్పించడంలో విఫలమైందని వ్యాఖ్యానించింది.

# ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతకు ఓకే

**త్రిసభ్య కమిటీ భేటీలో అంగీకరించిన రెండు రాష్ట్రాల ఈఎన్‌సీలు**



సాక్షి, అమరావతి: కృష్ణాజలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణలో సీఎం వైఎస్ జగన్ విజయం సాధించారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణకు నాలుగున్నరేళ్లుగా ఆయన చేసిన పోరాటం, కృషి ఫలించాయి. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను కృష్ణాబోర్డుకు అప్పగించేందుకు కేంద్ర జల్‌శక్తి శాఖ అంగీకరించింది. కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ గతనెల 17న ఢిల్లీలో రెండు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం అమలుకు గురువారం హైదరాబాద్‌లోని కృష్ణాబోర్డు కార్యాలయంలో త్రిసభ్య కమిటీ సమావేశమైంది. ఈ రెండు ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించేందుకు ఈ సమావేశంలో రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. అందుకు సంబంధించిన విధివిధానాలను ఈ సమావేశంలో రూపొందించారు. వాటిని కృష్ణాబోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ దృష్టికి తీసుకెళ్లనున్నారు. ప్రాజెక్టుల అప్పగింత విధివిధానాలపై రెండు రాష్ట్రాల జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శులతో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి సమీక్షించనున్నారు. ఆ తర్వాత ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను కృష్ణాబోర్డుకు అప్పగించనున్నారు. కృష్ణానదీజలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య తరచు విభేదాలు తలెత్తడానికి కారణమైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను కృష్ణాబోర్డుకు అప్పగించడం ద్వారా వివాదాలకు చెక్ పెట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే గతనెల 17న రెండు రాష్ట్రాల జలవనరులశాఖ ఉన్నతాధికారులతో ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించేందుకు రెండు రాష్ట్రాలు ఆ సమావేశంలో అంగీకరించాయి. ప్రాజెక్టుల అప్పగింత విధివిధానాలను వారంలో ఖరారు చేయాలని త్రిసభ్య కమిటీని కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి ఆదేశించారు. కానీ.. హైదరాబాద్‌కు వచ్చాక తెలంగాణ సర్కార్ అడ్డం తిరిగింది. కృష్ణాజలాల వాటాలను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తేల్చేవరకు ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఇదే అంశంపై బుధవారం కేంద్రానికి లేఖ కూడా రాసింది.

**అడ్డంతిరిగి.. దారికొచ్చిన తెలంగాణ**

కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఆదేశాల మేరకు కృష్ణాబోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే నేతృత్వంలో గురువారం త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ ఈఎన్‌సీలు సి.నారాయణరెడ్డి, మురళీధర్ హాజరయ్యారు. కృష్ణాజలాల్లో తెలంగాణ వాటాను ట్రిబ్యునల్ తేల్చేవరకు ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించబోమని తెలంగాణ ఈఎన్‌సీ పాతపాట పాడటంతో ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నీటి వాటాలు తేల్చేది ట్రిబ్యునల్ మాత్రమేనని.. త్రిసభ్య కమిటీ, కృష్ణాబోర్డు, అపెక్స్ కౌన్సిల్‌కు ఆ అధికారం లేదని గుర్తుచేశారు. ప్రాజెక్టుల అప్పగింతకే త్రిసభ్య కమిటీ పరిమితం కావాలని సూచించారు. ఉమ్మడి ప్రాజెక్టుల్లో తమ భూభాగంలోని ఆరు అవుట్‌లెట్లను బోర్డుకు అప్పగిస్తూ ఇప్పటికే ఉత్తర్వులు కూడా జారీచేశామని, తెలంగాణ తన భూభాగంలోని తొమ్మిది అవుట్‌లెట్ల అప్పగింతపై ఇప్పటికీ తేల్చలేదని ఎత్తిచూపారు. దీంతో తమ భూభాగంలోని తొమ్మిది అవుట్‌లెట్లను అప్పగించడానికి తెలంగాణ ఈఎన్‌సీ అంగీకరించారు.

**బోర్డు, ఏపీ, తెలంగాణ ప్రతినిధుల నేతృత్వంలో..**

ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను కృష్ణాబోర్డుకు అప్పగిస్తూనే.. ఒక్కో అవుట్‌లెట్ వద్ద బోర్డు, ఏపీ, తెలంగాణ అధికారులు ఒక్కొక్కరిని నియమించి, నీటి విడుదలను పర్యవేక్షించాలని ఇద్దరు ఈఎన్‌సీలు చేసిన సూచనకు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే అంగీకరించారు. ఇందుకు రెండు రాష్ట్రాలు సిబ్బందిని సమకూర్చాలని సభ్య కార్యదర్శి చేసిన ప్రతిపాదనకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. ప్రతి నీటి సంవత్సరంలో ఎప్పటికప్పుడు త్రిసభ్య కమిటీ సమావేశమై.. రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చించి, నీటివిడుదలకు చేసే సిఫార్సు మేరకు బోర్డు ఉత్తర్వులు జారీచేయాలనే ప్రతిపాదనపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. తాగునీటి అవసరాల కోసం తక్షణమే సాగర్ ఎడమకాలువ కింద ఏపీకి రెండు టీఎంసీల విడుదలకు త్రిసభ్య కమిటీ అంగీకరించింది. కుడికాలువకు మార్చిలో 3, ఏప్రిల్‌లో 5 టీఎంసీల విడుదలకు ఆమోదం తెలిపింది.

### ఏకాభిప్రాయంతో ప్రాజెక్టుల అప్పగింత

త్రిసభ్య కమిటీ సమావేశంలో ఉమ్మడి ప్రాజెక్టుల అప్పగింతకు ఏకాభిప్రాయం కుదిరింది. ఏపీ భూభాగంలోని ఆరు అవుట్‌లెట్లను బోర్డుకు అప్పగింతకు సంబంధించి ఇప్పటికే ఉత్తర్వులు జారీచేశాం. తెలంగాణ భూభాగంలోని తొమ్మిది అవుట్‌లెట్లను అప్పగించడానికి ఆ రాష్ట్రం అంగీకరించింది. త్రిసభ్య కమిటీ సిఫార్సు మేరకు బోర్డు నీటి కేటాయింపులు చేస్తుంది. వాటిని బోర్డే విడుదల చేస్తుంది.

– సి.నారాయణరెడ్డి, ఈఎన్‌సీ, ఏపీ జలవనరులశాఖ

### త్రిసభ్య కమిటీ సిఫార్సులే కీలకం

శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను బోర్డుకు అప్పగించేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. ఏటా నీటి అవసరాలపై త్రిసభ్య కమిటీ చర్చించి.. కేటాయింపులపై బోర్డుకు సిఫార్సు చేస్తుంది. ఆ ప్రకారమే బోర్డు నీటిని విడుదల చేస్తుంది. మా భూభాగంలోని తొమ్మిది అవుట్‌లెట్లను కృష్ణాబోర్డుకు అప్పగిస్తాం. కృష్ణాజలాల్లో 50 శాతం వాటా కోసం కేంద్ర జల్‌శక్తి శాఖకు లేఖ రాశాం.

– మురళీధర్, ఈఎన్‌సీ, తెలంగాణ నీటిపారుదలశాఖ

### హక్కుల పరిరక్షణ కోసం సీఎం జగన్ రాజీలేని పోరాటం

వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక కృష్ణాజలాలపై రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటం చేస్తున్నారు. కృష్ణాపై తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా చేపట్టిన ప్రాజెక్టులను నిలిపేయాలని కేంద్రానికి ఫిర్యాదు చేశారు. రాయలసీమ, నెల్లూరు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీర్చడం కోసం తెలంగాణ తరహాలోనే శ్రీశైలంలో 800 అడుగుల స్థాయిలో నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌లోకి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసేలా రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టారు. దీనిపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తింది. ఈ వివాదాన్ని పరిష్కరించడానికి 2020 అక్టోబర్ 6న కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి హక్కుగా దక్కిన నీటిని వినియోగించుకోవడం కోసమే రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టామని సీఎం జగన్ స్పష్టంగా చెప్పారు. తెలంగాణ చేపట్టిన అక్రమ ప్రాజెక్టులను నిలిపివేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలను నిలిపేసేలా తెలంగాణ సర్కార్‌ను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. 2021లో శ్రీశైలానికి ఎగువ నుంచి వరద ప్రవాహం ప్రారంభం కాకుండానే తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి ప్రారంభించింది. ఇక్కడి నుంచి నీటిని సాగర్‌కు తరలించింది. ఇలా శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేస్తూ రాష్ట్ర హక్కులను హరిస్తుండటంతో సీఎం జగన్ న్యాయ పోరాటానికి దిగారు. కృష్ణాబోర్డు పరిధిని నోటిపై చేయడం ద్వారా అక్రమంగా విద్యుదుత్పత్తి చేయకుండా తెలంగాణను కట్టడిచేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కృష్ణాబోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న కేంద్ర జల్‌శక్తి శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ఉమ్మడి ప్రాజెక్టులను ఏడాదిలోగా బోర్డుకు అప్పగించాలని కేంద్రం ఆదేశించింది. శ్రీశైలం, సాగర్‌లో రాష్ట్ర భూభాగం పరిధిలోని ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైనా.. తెలంగాణ సర్కారు తన భూభాగంలోని ప్రాజెక్టులను అప్పగించేందుకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వే 13 గేట్లతోపాటు కుడికాలువ హెడ్ రెగ్యులేటర్‌ను రాష్ట్రానికి అప్పగించాలని, లేదంటే ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి గతేడాది అక్టోబర్ 6న కృష్ణాబోర్డు రాష్ట్రానికి కేటాయించిన 30 టీఎంసీల్లో 17 టీఎంసీలను ఎడమగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ నాగార్జునసాగర్‌కు తెలంగాణ సర్కార్ తరలించింది. ఆ 17 టీఎంసీలను గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడికాలువ ద్వారా విడుదల చేయాలన్న రాష్ట్ర అధికారుల విజ్ఞప్తులను తెలంగాణ పట్టించుకోలేదు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యత కేంద్రం రాష్ట్రానికి అప్పగిస్తే.. తమ భూభాగంలో ఉందని ఎడమగట్టు విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ సర్కార్ తన ఆధీనంలోకి తీసుకుందని.. అదే తరహాలో రాష్ట్ర భూభాగంలో ఉన్న నాగార్జునసాగర్ స్పిల్ వే 13 గేట్లతోసహా కుడికాలువ హెడ్ రెగ్యులేటర్‌ను ఆధీనంలోకి తీసుకుని, నీటిని విడుదల చేయాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. దీంతో నవంబర్ 30న తెల్లవారుజామున సీఈ మురళీనాథ్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు, జలవనరులశాఖ అధికారులు రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వేలో సగాన్ని, కుడికాలువ హెడ్ రెగ్యులేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. తాగునీటి అవసరాల కోసం కుడికాలువకు 2,300 క్యూసెక్కులు విడుదల చేశారు. దీనిపై తెలంగాణ సర్కారు కేంద్రానికి ఫిర్యాదు చేసింది. దీంతో సీఎం జగన్ ఆది నుంచి చేస్తున్న డిమాండ్ మేరకు ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించేందుకు కేంద్రం అంగీకరించింది.

## స్వచ్ఛ భారత్‌లో వీపీఏకు ప్రథమ స్థానం



కేంద్ర మంత్రి నుంచి అవార్డు స్వీకరిస్తున్న అంగముత్తు, ఇతర అధికారులు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) సిగలో మరో కలికితురాయి చేరింది. కేంద్ర పోర్టులు నౌకా, జలరవాణా మంత్రిత్వ శాఖలో చేపట్టిన స్వచ్ఛతా పక్వాడలో విశాఖ పోర్టు మూడో స్థానం, మేజర్ పోర్టుల్లో ఏకైన పోర్టుగా అవార్డు సాధించింది. న్యూఢిల్లీలో గురువారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ చేతుల మీదుగా విశాఖపట్నం పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అవార్డును అందుకున్నారు. ఆయనతో పాటు పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, చీఫ్ ఇంజనీర్ (ఇన్‌చార్జ్) హరియా ఉన్నారు.



## టీడీపీ తరఫున లోకేశ్ పిటిషన్ ఎలా వేశారు?

- టీడీపీ న్యాయవాదులపై తెలంగాణ హైకోర్టు సీజే ధర్మాసనం ఆగ్రహం
- 'వ్యూహం'పై వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వు



సాక్షి, హైదరాబాద్: 'వ్యూహం చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) కమిటీ జారీ చేసిన యు సర్టిఫికెట్ రద్దు చేయాలన్న పిటిషన్‌పై సింగిల్ జడ్జి విచారణ జరిపి తీర్పు ఇచ్చారు. ఇక్కడకు అప్పీల్ వచ్చింది.. సమాచారం ఇవ్వడానికి ఇంకా సమయం కావాలని కోరడం ఆమోదయోగ్యం కాదు..' అంటూ టీడీపీ న్యాయవాదులపై తెలంగాణ హైకోర్టు సీజే ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పార్టీ అధ్యక్షుడి(అచ్చెన్నాయుడు, ఏపీ) అనుమతి లేకుండా పిటిషన్ వేయడానికి రిట్ పిటిషనర్(లోకేశ్)కు ఏం అధికారం ఉందని ప్రశ్నించింది. 'విచారణకు సిద్ధమై రావాలి కదా.. సబ్జెక్ట్‌పై వాస్తవాలు వెల్లడించండి. పార్టీ నిబంధనల ప్రకారం ఏపీ అధ్యక్షుడి అనుమతి ఎందుకు తీసుకోలేదు?' అని మండిపడింది. శుక్రవారం వరకు సమయం కావాలని టీడీపీ న్యాయవాదులు అడగడాన్ని తప్పుబట్టింది. వ్యూహం చిత్రానికి సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికెట్ రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, దర్శకుడు రాంగోపాల్ వర్మ తెలంగాణ హైకోర్టులో వేర్వేరుగా అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. నిర్మాత తరఫున సీనియర్ న్యాయవాది వెంకటేశ్ వాదనలు వినిపిస్తూ.. సింగిల్ జడ్జి తీర్పును కొట్టివేసి, చిత్ర విడుదలకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు పూర్తి కావడంతో ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది.

## విశాఖ ఎయిర్‌పోర్టుకు మరిన్ని విమానాలు



విశాఖపట్నం: విశాఖ విమానాశ్రయానికి మరిన్ని దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు రానున్నాయని ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు కె.కుమార్‌రాజా, ఓ.నరేష్ కుమార్, డీఎస్ వర్మ, కె.విజయమోహన్‌లు తెలిపారు. గురువారం వారు మీడియాతో మాట్లాడారు. ఏప్రిల్ 9 నుంచి విశాఖ నుంచి బ్యాంకాక్‌కు మంగళ, గురు, శనివారాల్లో, 26 నుంచి కౌలాలంపూర్‌కు బుధ, శని, ఆదివారాల్లోనూ నడుస్తాయని చెప్పారు. బ్యాంకాక్‌కు 2.45 గంటలు, కౌలాలంపూర్‌కు 4 గంటల ప్రయాణ సమయం పడుతుందన్నారు. ఆయా దేశాలకు వెళ్లడానికి వీసా అవసరం లేదన్నారు. మరో మూడు, నాలుగు నెలల్లో దుబాయ్‌కి కూడా విమాన సర్వీసు ప్రారంభమవుతుందన్నారు. ఎయిర్‌పోర్టు ఇన్‌చార్జి డైరెక్టర్ రాజారామ్ మాట్లాడుతూ ఎయిర్‌పోర్టులో జరుగుతున్న రన్‌వే రీసర్ఫేసింగ్ పనులు మార్చి ఆఖరుతో పూర్తవుతాయన్నారు.

## టీడీపీ వల్లే పోలవరం జాప్యం


**బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి**



సాక్షి, భీమవరం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి టీడీపీ మూడేళ్ల పాటు జాప్యం చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో గురువారం బీజేపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత టీడీపీ ప్రభుత్వం అర్హత లేని కాంట్రాక్టు కంపెనీకి పనులు అప్పగించిందని విమర్శించారు. నేటి ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ఇప్పుడు కాంగ్రెస్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని, ఆర్థిక సంఘం ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని స్పష్టం చేయడంతో అప్పటి సీఎం చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నారని చెప్పారు.


'సూర్యోదయ్ యోజన' ప్రధాని దూరదృష్టిని ప్రతిఫలిస్తోంది. ఒక కోటి కుటుంబాలు తమ ఇళ్ల వద్ద సౌరశక్తి వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి ఈ పథకం వీలు కల్పిస్తుంది. దీనివల్ల వారికి నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుంది. ఏటా రూ.15 నుంచి 18 వేల వరకు ఆదా అవుతుంది.
- అమిత్ షా, కేంద్ర హోమ్‌మంత్రి


'వాస్తవ వృద్ధి'ని 7.3 శాతంగా అంచనా వేయడం ఓ కల్పిత కథ. ప్రస్తుత ధరలలో జీడీపీ పెరుగుదలను వాస్తవ వృద్ధి కోసం తగ్గించారు. ద్రవ్యోల్బణం 6 శాతం, ఆహార ద్రవ్యోల్బణం 10 శాతం అని ఆర్బీఐ అంచనా వేసినప్పుడు, దాన్ని 1.6 శాతంగా తీసుకున్నారు. ఇది మోసపూరితం.
- సీతారాం యేచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి


గత పదేళ్లలో ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు? ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు, 2022 నాటికి అందరికీ పక్కా ఇళ్లు, 100 స్మార్ట్ సిటీలు... వేటి గురించీ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. 2014లో 4.6 శాతంగా ఉన్న వ్యవసాయ వృద్ధి రేటు ఈ ఏడాది 1.8 శాతానికి ఎలా పడిపోయింది? ఈ మధ్యంతర బడ్జెట్‌లో జవాబుదారీతనం, విజన్ రెండూ కొరవడ్డాయి.
- మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు



# సాగు సాయం ఇంతేనా?

అభిప్రాయం



డా॥ దొంతి నరసింహారెడ్డి

భారత వ్యవసాయంలో సమూల పరివర్తన అవసరం ఉన్నది. అయితే, ఈ పరివర్తన ఎక్కడ అనేది కీలకంగా మారింది. సంపూర్ణ మార్పు కేంద్ర ప్రభుత్వ విధానాలలో రావాల్సిన అవసరం ఉన్నది. నూతన వ్యవసాయ విధానం ద్వారా ఈ మార్పునకు నాంది పలకాలి. బడ్జెట్ కేటాయింపుల ద్వారా ఈ మార్పునకు అవసరమైన నిధులు అందించాలి. కానీ తాజా మధ్యంతర బడ్జెట్‌లో ఆ మేరకు కేటాయింపులు లేవు. 2024 పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో 2024-25 కేంద్ర బడ్జెట్ కొన్ని నెలల కొరకే రూపొందించారు. పూర్తి స్థాయి బడ్జెట్ ఎన్నికల తరువాత జూలైలో కొత్త ప్రభుత్వం ప్రవేశపెడుతుంది.

మౌలిక వసతుల కల్పనకు 11 శాతం నిధులు పెంచిన కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయ రంగ మౌలిక వసతుల కల్పన మీద దృష్టి పెట్టలేదు. 2023-24లో వ్యవసాయ బడ్జెట్ రూ.1,15,532 కోట్లు ఉండగా ఇప్పుడు 2024-25లో కేవలం రూ. 1,17,529 కోట్లకు పెరిగింది. కేటాయింపులు ఎన్ని ఉన్నా, ప్రభుత్వ ఆలోచనలలో మార్పులు రాలేదని అర్థం అవుతున్నది. ఆహార సబ్సిడీ రూ. 2,05,250.01 కోట్లు మాత్రమే. ఆహార సబ్సిడీ తగ్గడం అంటేఆహార పంటల సేకరణ తగ్గటమే. ఇందువల్ల రైతు మీద భారం పెరుగుతుంది. ఎరువుల సబ్సిడీ రూ. 1,63,999.80 కోట్లు మాత్రమే. 2022-23లో అయిన ఖర్చు రూ. 2,51,339.36 కోట్లు. తగ్గించిన సబ్సిడీ ఎక్కడకు మరల్చినట్లు? సేంద్రియ ఎరువులు ప్రోత్సాహానికి మాత్రం కాదు. ఎందుకంటే, కొత్త పథకాలు లేవు. సహజ వ్యవసాయానికి రూ. 459 కోట్లు గత సంవత్సరం ఇచ్చి, దానిని రూ.100 కోట్లకు సవరించిన ప్రభుత్వం రాబోయే ఏడాదికి రూ.365 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది.



రైతుల కోసం కనీస మద్దతు ధరలు ప్రకటించినా, 11.8 కోట్ల మంది రైతులకు 'కిసాన్ యోజన' కింద ఆర్థిక సహాయం అందించినా, రైతుకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. రైతుల సగటు ఆదాయం పెరగలేదు. రెట్టింపు అసలే కాలేదు. ఆహార ద్రవ్యోల్బణం ఆందోళన కలిగిస్తున్నది. ఆహారం ధరలు పెరుగుతున్నాయి. దిగుమతి సుంకాలు తగ్గించడమే ఆహార దిగుమతులు పెరగడానికి కారణం.

మొత్తం కేంద్ర ప్రతిపాదిత బడ్జెట్ రూ. 47.66 లక్షల కోట్లు కాగా వ్యవసాయానికి ఇచ్చింది కేవలం 2.4 శాతానికి పడిపోయింది. వ్యవసాయానికి మొత్తం బడ్జెట్‌లో ఉండాల్సిన వాటా శాతం తగ్గింది. 2022-23 సంవత్సరం 4.26 శాతం ఉంటే, ఇప్పుడు అది దాదాపు సగానికి తగ్గింది.

వ్యవసాయ రంగ విధానాలు మొత్తం రైతుల సంక్షేమంతో పాటు భారతదేశంలో ఆహార భద్రతను నిర్ధారించడంలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. వ్యవసాయ రంగంలో యాంత్రికీకరణ దిశగా కేంద్రం అనేక ఏళ్లుగా ప్రయత్నం చేస్తున్నది. కానీ, సగటు రైతుకు వాటి నుంచి ఎటువంటి లబ్ధీ చేకూరలేదు. చిన్న రైతుకు ఉపయోగపడని భారీ యంత్రాల వల్ల, అధిక ధరల కారణంగా రైతులు ఆ యా యాంత్రీకీకరణ పథకాల నుంచి లబ్ధి పొందలేక పోతున్నారు.

కేంద్ర ప్రభుత్వం వ్యవ సాయ రంగానికి అధిక సబ్సిడీని ఇస్తుంది అని భావిస్తుంటారు. కానీ, ఆ యా సబ్సిడీలు అన్నీ కంపెనీల వ్యాపారవృద్ధికీ, లాభాలకూ, గుత్తాధిపత్యం పెంచుకోవడానికీ ఉపయోగ పడుతున్నాయి. ఇటీవల వ్యవసాయ రంగంలో డ్రోన్లు ఉపయోగించటానికి దాదాపు 7-8 లక్షల వరకు సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇది కూడా డ్రోన్ల కంపెనీల ప్రోత్సాహానికి అని కూడా చెప్పింది. రసాయనిక ఎరువులు, రసాయన కీటక నాశకాలు, విత్తనాలు, విద్యుత్, సాగు నీరు, రుణాలు, యంత్రాలు, వగైరా సబ్సిడీలు కంపెనీల వ్యాపారాలు పెరగడానికే ఉపయోగపడ్డాయి. పామాయిల్ పెట్టుబడులు కూడా పెద్ద కమతాల కొరకే. సగటు రైతు ఇంకా చితికిపోతున్నాడు. కాగ్ ఇచ్చే నివేదికలు కొన్ని ఈ దిశగా మనకు అవగాహన పెంచుతున్నాయి. పంటల బీమా వల్ల కంపెనీలు దాదాపు రూ. 36 వేల కోట్ల రూపాయలు లబ్ధి పొందినట్టు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఇటీవల ముగిసిన అంతర్జాతీయ వాతావరణ పరివర్తన సదస్సు 'కాప్28'లో ప్రపంచ వాతావరణ పరిస్థితులూ, ఆహార ఉత్పత్తిపై వాటి పరిణామాల ప్రభావం మీదా ఆందోళన వ్యక్తం అయ్యింది. ఆహార రంగంలో సంపూర్ణ పరివర్తన అత్యంత అవసరమని అనేక దేశాలు భావించాయి. రసాయన రహిత, కర్బన ఉద్గారాల రహిత వ్యవసాయం వైపు మళ్ళాలని, ఆ దిశగా పెట్టుబడులు పెరగాలని ఉమ్మడి ప్రకటనలు కూడా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో అటువంటి పెట్టుబడుల గురించి కనీస ప్రస్తావన చేయక పోవడం గమనార్హం.

వ్యాసకర్త వ్యవసాయ రంగ నిపుణులు

# అతివకు ఆదాయమేదీ?

అభిప్రాయం



ప్రొ॥ ఇ. రేవతి

వ్యవస్థను వెంటాడుతున్న దీర్ఘకాలిక ప్రశ్నలకు కేంద్ర బడ్జెట్‌లో ఈసారీ జవాబు కన్పించ లేదు. సంపద సృష్టి పెరిగిందనేది కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాత్కాలిక బడ్జెట్ ప్రసంగంలో కీలకాంశం. అది నిజమే అయితే ధనిక, పేద వర్గాల మధ్య అసమానతలు ఎందుకు పెరిగాయి? దిగువ మధ్య తరగతి ఇప్పటికీ ఎందుకు నాణ్యమైన జీవనం, విద్య అందుకోలేకపోతోంది?

ద్రవ్య లోటును 5.9 నుంచి 5.1కి తగ్గించామని చెప్పారు. పెట్టుబడి వ్యయం పెంపు వైమానిక, రైల్వే రంగాలకు కొంత ఊరటే. కానీ వ్యవసాయం పరిస్థితేమిటి? కోవిడ్ తర్వాత ఈ రంగం 1.8 నుంచి 2 శాతం ఉత్పత్తి పురోగతి సాధిస్తోంది. కానీ మళ్ళీ ఈ ఏడాది కొత్త సవాళ్ళు విసిరింది. దేశవ్యాప్తంగా కనీసం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావం వెరసి ఉత్పత్తి పతనానికి దారి తీసింది. పశు సంపద, పాడి పరిశ్రమ ప్రతికూల ఫలితాలనిస్తోంది. ఈ సవాళ్ళను ఎదుర్కొనే మార్గాలు బడ్జెట్‌లో కన్పించలేదు. ఎర్ర సముద్రంలో యుద్ధం, కొరియా ఘటనలు... ఇలాంటి అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది విదేశీ దిగుమతులకు అనేక సవాళ్ళు ఎదురయ్యాయి, విదేశీ వస్తువులు రావడం ఆలస్యమైంది. ఈ నేపథ్యంలోనే స్వదేశీ వస్తు తయారీ దిశగా ప్రణాళికలు ఏమయ్యాయనే ఆత్మ పరిశీలన అవసరం.

ఎన్నికల సమయం. అందుకేనేమో రైతు, యువత, మహిళ, పేదలు, మధ్య తరగతి వర్గాలే బడ్జెట్ లక్ష్యాలయ్యాయి. ఇవి తాత్కా లిక ప్రయోజనాలే కావడం ఇక్కడ అసలు సమస్య. ఫుడ్ ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించే మంత్రం బడ్జెట్‌లో కన్పిస్తోంది. కానీ మన ఉత్పత్తుల ఎగుమతులు ఈ ఏడాది తగ్గాయి. ఎగుమతులపై నిషేధమే దీనికి కారణం. పామాయిల్ పెంపునకు అవకాశం ఉంది. దీన్ని మనం వినియోగించుకోలేక పోయాం. డిజిటల్ ఫామ్ ఎక్విప్‌మెంట్ వంటి ఆధునిక వ్యవసాయ పద్ధతులను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. ఇవి కాస్తా బాగానే ఉన్నాయి. కానీ వ్యవసాయ పరిశోధనకు స్థానమే ఇవ్వలేదు. వ్యవసాయ జీడీపీలో పరిశోధనకు కేటాయింపులు 0.4 శాతానికే పరిమితం చేశారు. ఇది దీర్ఘకాల ప్రయోజనాలకు విఘాతమే.



పనిలో మహిళా భాగస్వామ్యం 37 శాతం పెరిగిందనేది కేంద్రం వాదన. కానీ ఇప్పటికీ మహిళలు ఆదాయమే లేని పనుల్లోనే ఉన్నారనేది వాస్తవం. ఉదాహరణకు ఆమె తన కమతంలోనే పని చేస్తోంది. డబ్బులెవరిస్తారు? తన దుకాణంలోనే పని చేయాల్సి ఉంటుంది. డబ్బులిచ్చేదెవరు? వీళ్ళ భాగస్వామ్యాన్ని ఎలా లెక్కగడతారు? నిరుద్యోగం తగ్గుతోందని చెప్పారు. యువతే లక్ష్యంగా ఉద్యోగ కల్పనను ప్రస్తావించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహించడం ఈ సత్ఫలితాలిచ్చాయనేది కేంద్రం విశ్లేషణ. సోలార్ ప్రాజెక్టుల కల్పన కూడా ఉపాధికి మార్గమన్నారు. దీంతో ప్రైవేటు పెట్టుబడుల ప్రోత్సాహానికే ప్రాధాన్యమిచ్చారు. ఇక పేదరికం తగ్గిందని చెప్పారు. నీతి అయోగ్ బహుళ పేదరిక ప్రామాణికతపై అనేక సందేహాలున్నాయి. పేదల వినిమయం, పౌష్టికాహారం వంటి అంశాలను పేదరిక కొలమానంగా తీసుకోవాలి. పేదరిక నిర్ధారణకు ఎంచుకున్న పద్ధతుల వల్లే పేదరికం తగ్గిందనే వాదనలూ ఉన్నాయి. ఒకటి మాత్రం వాస్తవం. ఆదాయ వనరులు పేదలకు పెరగొచ్చు. కానీ కనీస అవసరాలకు ఖర్చు పెట్టలేని స్థాయిలో ఎక్కువ మంది పేదలున్నారు. ఎన్నికల కోణంలో కాకుండా, కేంద్ర బడ్జెట్ శాశ్వత పేదరిక నిర్మూలనకు పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త సెస్ డైరెక్టర్, హైదరాబాద్

# ఇది భద్రలోక్ బడ్జెట్

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి గాను తాత్కాలిక (ఓట్ ఆన్ అకౌంట్) బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టారు. ఈ బడ్జెట్ లక్ష్యం నాలుగు విభాగాల ప్రజలకు - పేదలు, యువకులు, రైతులు, మహిళలకు మేలు చేయడమేనని ఆమె పేర్కొన్నారు. ఈ నాలుగు వర్గాలకు బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో ఏ విధమైన మేలు చేసిందన్నది ఇక్కడి ప్రశ్న? 2014 వరకూ, అంటే తాము అధికారంలోకి వచ్చే ముందర అంతా చిందరవందరే అన్నట్లు 'మా ఆర్థిక నిర్వహణ ద్వారా 2014 ముందరి అన్ని ఆర్థిక సవాళ్ళనూ నేడు అధిగమించాం' అంటూ నిర్మలా సీతారామన్ బడ్జెట్ ఉపన్యాసంలో వ్యాఖ్యానించారు. ఇందులో ఎంత వాస్తవం ఉందో చూద్దాం.

కాంగ్రెస్ హయాంలో నాటి అత్యధిక పతన స్థాయి అయిన డాలర్‌తో పోలిస్తే 65 రూపాయలుగా రూపాయి విలువ ఉంది. నేడు రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే మరింత దారుణంగా దిగజారి 84 రూపాయల పరిధిలో ఉంది. ఇక, నిరుద్యోగం 2014లో 5.4 శాతంగా ఉండగా 2023 డిసెంబర్ నాటికి 8.7 శాతానికి పెరిగిపోయింది. 2013లో దేశంలో ధరలు భారీగా పెరిగిపోవడం (ద్రవ్యోల్బణం) కూడా 2014 ఎన్నికలలో కాంగ్రెస్ ఓటమికి కారణం. కాగా, 2022 నుంచీ మొదలుకొని దేశంలో ధరలు అడ్డూ ఆపూ లేకుండా పెరిగిపోతున్నాయి. ఇక స్థూల జాతీయోత్పత్తి విషయంలో కూడా మన పరిస్థితి కేవలం ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే, గుడ్డి వాళ్ళ రాజ్యంలో... ఒంటి కన్ను రాజులా (రఘురాం రాజన్ వ్యాఖ్యానించినట్లు) మాత్రమే ఉందన్నది నిజం. యూపీఏ హయాంలో జీడీపీ సాలీనా సగటున 8.1 శాతం మేర పెరగగా... ప్రస్తుత బీజేపీ హయాంలో (2014 నుంచి 2023 వరకు) అది సాలీన సగటున 5.4 శాతం మేరనే పెరిగింది. కోవిడ్ కాలంలోని ఆర్థిక పతన స్థితిని కాసేపు పక్కన పెట్టినా మొత్తంగా బీజేపీ పాలనలో జీడీపీ పెరుగుదల పరిస్థితి గొప్పగా ఏమీ లేదు.



అవినీతిని నిర్మూలించామంటూ ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ఉపన్యాసంలో చెప్పుకున్నారు. వాస్తవానికి అంతర్జాతీయ 'అవినీతి సూచి'లో భారత్ ర్యాంకు మొత్తం 180 దేశాలలో 2022 సంవత్సరంలో 85వ స్థానంలో ఉండగా 2023లో 93వ స్థానానికి దిగజారింది. ఇక అసమానతల విషయంలో నిత్య జీవితంలో దిగజారిపోతోన్న సామాన్య జనం జీవన ప్రమాణాలు ఒక ప్రక్కనా... పెరిగి పోతోన్న కార్పొరేట్లూ, ధనవంతుల సంపద రాసులు మరో పక్కనా కనపడుతూనే ఉన్నాయి.

అభిప్రాయం



డి. పాపారావు

ఈ స్థితిలో ప్రస్తుత బడ్జెట్ ఈ సమస్యలు వేటికీ జవాబు ఇవ్వలేదు. ఇది కేవలం తాత్కాలిక బడ్జెట్ మాత్రమేనంటూ సమస్యల పరిష్కారాల నుంచి తప్పించుకునే ధోరణి... ద్రవ్యలోటు తగ్గింపు పేరిట ప్రజా సంక్షేమం కోసం... వారి సమస్యల పరిష్కారం కోసం కొత్తగా ఏ వ్యయాలు చేయలేని దుఃస్థితి తాలూకు ఇరకాటం ఈ బడ్జెట్ రూప కల్పనలో దాగి వున్న అసలు నిజాలు.

ఒక పక్కన ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రత్యక్ష పన్నుల వసూళ్ళు మూడు రెట్లు పెరిగాయి. అలాగే పరోక్ష పన్నుల ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. అలాగే, మానిటైజేషన్ ద్వారానూ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ద్వారానూ కూడా కేంద్ర ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరుతోంది. మరో పక్కన కొన్ని లెక్కల ప్రకారం దేశీయ అప్పులు 200 లక్షల కోట్ల రూపాయలను దాటిపోయాయి. ఇంత పెద్ద ఎత్తున సమకూరిన వనరుల ఫలం, ఫలితం మాత్రం ప్రజలకు దక్కడం లేదు. అంటే, బడ్జెట్‌ల క్రమంలో జరుగుతోంది పేదలను కొట్టి పెద్దలకు పెట్టడమే అనేది నిర్వివాదాంశం. పెరుగుతోన్న బిలియనీర్లు, ప్రపంచ ధనవంతుల జాబితాలో పైకి పాకుతోన్న వారి ర్యాంకులే దీనికి తార్కాణం!

ఇక ప్రస్తుత బడ్జెట్ కూడా ఈ యథాతథ స్థితికి మినహాయింపేమీ కాదు. ప్రస్తుత బడ్జెట్ అనంతరం జాతినుద్దేశించి తన సందేశంలో ప్రధాని మోదీ ఇది చరిత్రాత్మక బడ్జెట్ అన్నారు. ఇది కేవలం మాటల గారడీ. బడ్జెట్‌కు కొద్ది రోజుల ముందర ఈ బడ్జెట్ నుంచి ఏ సంచలనాలనూ ఆశించొద్దని ఆర్థిక మంత్రి చెప్పారు. బడ్జెట్ ప్రసంగంలోనూ ఆమె ఈ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పరిమితిని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని చెబుతోన్న చరిత్రాత్మక కేవలం... ధనవంతుల సేవలో తరిస్తోన్న బడ్జెట్‌ల పరంపరలో పదవ మైలు రాయిని చేరుకోవడం తాలూకూది మాత్రమే కావచ్చు!!

వ్యాసకర్త సామాజిక, ఆర్థిక రంగాల విశ్లేషకులు
మొబైల్: 98661 79615

# పేదలకు ఒరిగిందేమీ లేదు!

అభిప్రాయం



డా॥ అందె సత్యం

ఓటాన్ అకౌంట్ లేదా తాత్కాలిక బడ్జెట్... విధానాల్లో మార్పులేవీ తీసుకురాలేదు. ప్రత్యక్ష, పరోక్ష పన్నులు, సుంకాల రేట్లు ఇతర ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి కొత్త విధానాలేవీ ప్రకటించలేదు. బడ్జెట్ పరిమాణం 45 లక్షల కోట్ల నుంచి 47.66 లక్షల కోట్లకు పెరిగింది. కేవలం ఐదు శాతం పరిమాణాన్ని పెంచారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే పెరుగుదలే ఇది కాదు. ఉపాధి హామీ పథకానికి గత ఆర్థిక సంవత్సరంలో రూ. 73 వేల కోట్ల నుంచి రూ. 60 వేల కోట్లకు తగ్గించారు. ఈ ఏడాది మళ్లీ రూ.86 వేల కోట్లకు పెంచారు. దేశంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా లేదా వేతనం పెరిగిన దృష్ట్యా ఇది పెరుగుదల కాదు. దీన్ని ఇంకా పెంచాల్సి ఉంది. గ్రామీణాభివృద్ధికి గత సంవత్సరం రూ. 2.43 లక్షల కోట్లు ఖర్చు చేయగా, ఈ ఏడాది రూ. 1.77 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది గ్రామీణ అభివృద్ధి వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపెట్టనుంది. గత బడ్జెట్‌లో ఆహార సబ్సిడీకి రూ. 2.87 లక్షల కోట్లు ఖర్చు చేయగా, ఈ ఆర్థిక సంవత్సరంలో సబ్సిడీల కింద రూ. 2.13 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. రసాయన ఎరువులకు 1.68 లక్షల కోట్లు




కేటాయించారు. గతంలో రూ. 1.75 కోట్లు కేటాయించారు. ఈ విధంగా ముఖ్యమైన శాఖలన్నింటికీ బడ్జెట్ కేటాయింపులు నామమాత్రపు పెరుగుదల కానీ, లేదా తగ్గుదల కానీ ఉంది. వ్యవసాయ రంగానికి గత ఏడాది తగ్గించి తిరిగి ఈ సంవత్సరం పూర్వ స్థాయికి పెంచారు. అంటే అంతకు ముందు ఏడాది స్థాయికి మాత్రమే తీసుకువచ్చారు. అదే విధంగా గత ఏడాది బడ్జెట్‌లో రక్షణ శాఖకు రూ. 6 లక్షల కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ. 6.2 లక్షల కోట్లు కేటాయించారు. అందువల్ల ఈ కేటాయింపులు యాంత్రికంగా కనిపిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్‌కు కేవలం రూ.7,500 కోట్లు చూపెట్టారు. ఇది ఏ మూలకూ సరిపోదు.

విధానపరంగా చూస్తే పేదలకు, మధ్య తరగతి ప్రజలకు ఈ బడ్జెట్ ఒత్తిడిని పెంచే విధంగా ఉంది. మధ్యతరగతి వేతన జీవులకు నామమాత్రపు ఆదాయాలు పెరిగినప్పటికీ పన్ను వెసులుబాటు కల్పించలేదు. దేశ వ్యాప్తంగా 5 ఆక్వా పార్కులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ పార్కులు మత్స్య రంగం అభివృద్ధి అయిన ప్రాంతాలకు మాత్రమే ఉపయోగపడనున్నాయి. నూనెగింజల ఉత్పత్తిలో దేశం కొరత ఎదుర్కొంటోంది. దీనికోసం ప్రత్యేకంగా ఒక సంస్థను ఏర్పాటు చేస్తామన్నారు. కానీ, ఉత్పత్తి చేయడానికి కావాల్సిన సబ్సిడీలు లేదా ప్రోత్సాహకాలు, మద్దతు ధరల గురించి ఈ బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావనా లేదు. వాటి గురించి తీవ్రంగా ఆలోచిస్తేనే నూనె గింజల దిగుమతుల మీద ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. రైల్వేలకు రూ. 2.5 లక్షల కోట్లు కేటాయించారు. కానీ, రైల్వే మీద ప్రత్యేక కేంద్రీకరణ ఉంటే తప్ప ఆశించిన స్థాయిలో విస్తరణ జరగడం లేదు. గత సంవత్సరం 25 లక్షల మందిని పేదరికం నుంచి బయటపడేశామని ఆర్థిక మంత్రి చెప్పారు. దేశ జనాభాతో పోలిస్తే ఇది చాలా స్వల్పం. ఈ నేపథ్యంలో పేదరిక నిర్మూలన కోసం చేపట్టాల్సిన పథకాలను పెంచాల్సి ఉంది. రూ. 47.66 లక్షల కోట్ల రూపాయల్లో అప్పులు, వడ్డీల కింద 20 శాతం అంటే రూ. 12 లక్షల కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ సంవత్సరం రూ. 169 లక్షల కోట్ల అప్పులుంటాయనే అంచనాలున్నాయి. కాబట్టి బడ్జెట్ అప్పులు, వడ్డీలకే హరించుకుపోతుంది.

వ్యాసకర్త ఆర్థిక విశ్లేషకులు

# ప్రయోగాత్మక బడ్జెట్

అభిప్రాయం



ప్రొఫెసర్ డి. నర్సింహారెడ్డి

ఇది మధ్యంతర బడ్జెట్ అనీ, దీనికీ వచ్చే లోక్‌సభ ఎన్నికలకూ సంబంధం లేదనీ చెబుతున్నప్పటికీ పదేళ్ల మోదీ సర్కార్ ఘనతను చాటే ప్రయత్నం జరిగింది. కొన్ని అంశాల పరంగా చూస్తే మాత్రం ఈసారి బడ్జెట్ ప్రయోగాత్మకంగా ఉంది. గతంలో ఎప్పుడూ ఈ పద్ధతుల్లో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టలేదు. సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఒకట్రెండు రోజుల ముందు 'ఆర్థిక సర్వే' విడుదల చేస్తారు. ఈసారి 'ఇండియన్ ఎకానమీ రివ్యూ' పేరిట 2014 నుంచి ఈ పదేళ్లలో ఏం చేశారన్న దానిపై దృష్టి కేంద్రీకరించారు.

బడ్జెట్ ప్రసంగాన్ని రెండు భాగాలుగా చూస్తే... మొదటి భాగంలోని 'ఇండియన్ ఎకానమీ రివ్యూ'లో పదేళ్లలో సాధించిన దానిపై పొగడ్తలే నిండిపోయాయి. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పెనుసమస్య నిరుద్యోగం కాగా, గత పదేళ్లలో దాని పరిస్థితి ఏమిటన్న దానిపై ఈ రివ్యూలో ఎక్కడా ప్రస్తావనే లేదు. పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్‌ఎఫ్‌ఎస్) అంచనాల ప్రకారం మాత్రం ఉపాధి అవకాశాలు పెరిగాయి, నిరుద్యోగం తగ్గింది అన్నట్టుగా ఉంది. వాస్తవానికి కోవిడ్ మహమ్మారి కారణంగా చాలామంది వలస, ఇతర కూలీలు, పేదలు తమ సొంత ఊళ్లకు వెళ్లిపోగా, కొంతమంది మాత్రమే తిరిగి వచ్చారు. అధికశాతం మహిళలు ఏదో ఒక పని చేసుకోవాల్సి రావడాన్ని కూడా ఉపాధి అవకాశాల కల్పనగా, వర్క్‌ఫోర్స్‌లో స్త్రీల ప్రాతినిధ్యం పెరిగినట్టుగా పేర్కొనడం సరికాదు. గత నవంబర్‌లో దేశంలో 9 శాతానికి పైగానే నిరుద్యోగం ఉందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) వెల్లడించిన విషయం తెలిసిందే.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇబ్బందుల కారణంగానే భారత స్టాక్ మార్కెట్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వంటివి వస్తున్నాయనేది గమనార్హం. ఆర్థిక మంత్రి నానో యూరియా ఇస్తామన్నారు కానీ వ్యవసాయ రంగంలో పెట్టుబడుల ప్రస్తావన లేదు. కొన్నేళ్లుగా వ్యవసాయానికి పెట్టుబడులను కేంద్రం ఒక పద్ధతి ప్రకారం తగ్గించుకుంటూ వస్తోందనే విమర్శలకు ఇది బలం చేకూర్చేలా ఉంది. సోలార్ విద్యుత్‌కు మరింత ప్రోత్సాహం, ప్రజారవాణా రంగంలో ఈ-వెహికిల్స్, టూరిజానికి ప్రోత్సాహం సానుకూల అంశాలే. ఐతే పర్యాటకంలో అండమాన్, లక్షద్వీప్ వంటి దీవులకు నష్టం జరగకుండా పకడ్బందీ ప్రణాళికలతో కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. నూతన విద్యావిధానం గురించి చెబుతున్నా కేంద్రం విద్యకు కేటాయిస్తున్న నిధులు తగ్గుతూ వస్తున్నాయి. వైద్యరంగం విషయానికొస్తే కొంత ప్రోత్సాహకరంగా కనిపిస్తోంది. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంలో భాగంగా... రైల్వేలు, రోడ్లు, బిల్డింగ్‌లకు (ఈ బడ్జెట్‌లో రూ.11 లక్షల కోట్లు) కేటాయింపులు పెంచుతున్నారు. వీటి ద్వారానే వృద్ధి రేటు అవకాశం ఉంటుందనేది నిర్వివాదాంశం.

వ్యాసకర్త పూర్వ డీన్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, హెచ్‌సీయూ

# అవాకులు చవాకులే వారికి వార్తలా?

అభిప్రాయం



అడుసుమిల్లి జయప్రకాశ్

ఇష్టమైన పార్టీనో, నేతలనో పైకి ఎత్తడం, పాఠకులను పక్కదారి పట్టించడం యెల్లో మీడియాకు పెన్నుతో పెట్టిన విద్య అని చెప్పాలి. వార్తల వెనుక ఉండే నిజాలతో వారికి పనిలేదు. వార్తల ప్రయోజనాలు వారికి అవసరం లేదు. స్వలాభాపేక్ష ఒక్కటే లక్ష్యం.

ఇసుక తవ్వకాలు, విక్రయాలపై కొందరు నాయకుల అక్రమాలు ప్రచురిస్తున్నట్లు కనిపించినా... ఆ వంకతో, తమకు అనుకూలమైన వారికి 'ఈనాడు' ఎటువంటి ప్రయోజనాలు కల్పించిందో రాస్తే అదో భారతం అవుతుంది. ఆ మధ్య మిచ్చౌ తుఫాను వచ్చినప్పుడు... ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలలో విస్తారంగా వర్షాలు కురియడంతో పల్లపు ప్రాంతాలలో కొంత మేర ముంపునకు గురయ్యాయి. కానీ ప్రభుత్వమే ఆ పంటలను ముంచేసినట్లు చిత్రీకరిస్తూ ఏపీ ముఖ్యమంత్రి జగన్‌పై, వైసీపీ ప్రభుత్వంపై ఎన్నో అభాండాలను ప్రచురించింది. గోదావరి డెల్టా, కృష్ణా డెల్టా ఆధునీకరణ నిధులు ఏమయ్యాయి? వాటిని గతంలోనే చంద్రబాబు ప్రభుత్వం ఎటు మళ్ళించింది అనే వాస్తవాలను పక్కన పెట్టి పంటల ముంపు బాధ్యత ప్రభుత్వానిదే అన్నట్లు ప్రచురించింది. కృష్ణా డెల్టా ఆధునీకరణకు కేటాయించిన రూ. 175 కోట్లు కృష్ణ కరకట్టపై తాను అక్రమంగా నివాసం ఉంటున్న భవనం ప్రాంతాన్ని సుందరీకరణకు చంద్రబాబు వినియోగించారనే వాస్తవాన్ని యెల్లో పత్రికలు ఎందుకు ప్రచురించవు? గోదావరి ఆధునీకరణ నిధులను కూడా దాదాపు రూ.150 కోట్లు పుష్కరాల నెపంతో 'పచ్చ' కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు. ఈ వాస్తవాన్ని ఈ పత్రికలు కాదనగలవా?

ఒక ప్రభుత్వం చేస్తే సామాజిక న్యాయం, మరో ప్రభుత్వం చేస్తే సమాజ వ్యతిరేకం అవుతుందా? చంద్రబాబు పాలనలో బీసీలకు ఎనిమిది మంత్రి పదవులివ్వగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 11 మంత్రి పదవులు బీసీలకు లభించాయి? మరి ఏది సామాజిక న్యాయం అని చెప్పాలి! చంద్రబాబు ఎస్సీలకు రెండు మాత్రమే మంత్రి పదవులు ఇస్తే జగన్ ఐదుగురికి ఇచ్చారు. మరి ఎవరిది సామాజిక న్యాయం? రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎస్సీ వర్గానికి చెందిన మోషేన్ రాజును కౌన్సిల్ ఛైర్మన్‌గా జగన్ చేశారు. టీడీపీ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు 18 ఎమ్మెల్సీ పదవులు ఇవ్వగా, జగన్ 29 పదవులు (69 శాతం) ఇచ్చి



సామాజిక న్యాయానికి బ్రహ్మరథం పట్టారు. ఈ వాస్తవాలు కనబడవా?

చంద్రబాబు హయాంలో ఏటా సగటున 324 మండలాల్లో కరువు తాండవించినా రైతులను కనికరించిన దాఖలాలు లేవు. జరిగిన పంట నష్టానికి సంబంధించి పరిహారాన్ని ఆ సీజన్ కాదుకదా, కనీసం ఆ ఏడాది ముగిసేలోగానైనా ఇచ్చిన దాఖలాలు లేవు. ఆ వాస్తవాన్ని వదిలేసి జగన్ ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లించలేదంటూ వార్తలు ప్రచురించడాన్ని ఏమనుకోవాలి? ప్రాథమిక పంట నష్టం అంచనాలు, తుది లెక్కలకు వ్యత్యాసం ఉంటుంది. దానిని వదిలేసి, పంట నష్టం లెక్కలను ప్రభుత్వం తక్కువ చేసి చూపిస్తున్నదంటూ అన్నదాతలను పక్కదారి పట్టించడం జర్నలిజంలో నైతిక ప్రమాణాలను మింగివేయడం కాదా?

బడి పిల్లలకు తగిన విద్యా బుద్ధులతో పాటు ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది వైసీపీ ప్రభుత్వం. నిత్యం సగటున 34.90 లక్షల మంది బడి పిల్లలకు 'గోరుముద్ద' అందుతుండగా, దానిలో ఆరు రోజులకు 16 రకాల వంటకాలను విద్యార్థులు రుచి చూస్తున్నారు. ఈ భోజనానికి బాబు హయాంలో ఏటా రూ.450 కోట్లు ఖర్చు చేయగా, జగన్ ప్రభుత్వంలో ఏటా సగటున రూ.1,450 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అయినా బడిపిల్లలకు సరైన పౌష్టికాహారమే లభించడం లేదంటూ వార్తలు ప్రచురించడాన్ని ఏమనాలి?

చంద్రబాబు హయాంలో 1996 లోక్‌సభ ఎన్నికలకు ముందు వామికొండ వద్ద, 1999 ఎన్నికలకు ముందు గండికోట వద్ద మరోసారి గాలేరు-నగరికి శంకుస్థాపన చేశారు. కానీ ఆ తొమ్మిదేళ్ళలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. వై.ఎస్.రాజశేఖర రెడ్డి 2004లో ముఖ్యమంత్రి అయిన తరువాత గాలేరు-నగరి సుజల స్రవంతి పథకాన్ని జలయజ్ఞంలో భాగంగా చేపట్టి 2009 నాటికే చాలావరకు పూర్తి చేశారు. గండికోట రిజర్వాయర్, పైడిపాలెం, వామికొండ, సర్వారాయ సాగర్ జలాశయాలతోపాటు ఈ ప్రాజెక్టు పనులు చాలావరకు 2009 నాటికి పూర్తి చేశారు. తర్వాత చంద్రబాబు వచ్చాక ప్రాజెక్టు మిగిలిన పనులు పడకేశాయి. అటుపై జగన్ అధికారంలోకి వచ్చాకే పెండింగ్ పనులకు కదలిక వచ్చింది. 2020-21 నుండి గండికోటలో ఏటా పూర్తి సామర్థ్యం మేరకు 28.85 టీఎంసీలను నిలువ చేస్తూ ఆయకట్టుకు నీళ్లందించి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.

చంద్రబాబు హయాంలో ఆత్మహత్యలకు పాల్పడిన రైతులకు 5 లక్షల రూపాయల పరిహారం ఇవ్వగా, దానిలో 1.5 లక్షలు అప్పుల కింద జమవేసుకొనేవారు. మిగిలిన మొత్తాన్ని డిపాజిట్ చేసి దాని వడ్డీని మాత్రమే ఆ రైతు కుటుంబానికి ఇచ్చేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ పరిహారాన్ని 7 లక్షల రూపాయలకు పెంచడమే కాక, ఎలాంటి సమస్య లేకుండా ఆ రైతు ఖాతాలోనే నేరుగా పరిహారం మొత్తాన్ని జమచేస్తున్నారు.

విద్యార్థుల చేతుల్లో ట్యాబులు కళకళలాడుతుంటే, వారి వద్ద పలకలు కూడా లేవంటూ ప్రచారం! విద్యార్థుల ఫీజులు రీయింబర్స్ చేస్తూ రకరకాల సంక్షేమ పథకాల కింద వారి ఖాతాలకే జమ చేస్తుంటే బడి మానేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందంటూ ఇంకో యెల్లో పత్రిక కథనాలు! 2022- 23లో జగన్ ప్రభుత్వం 3.32 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు సమీకరించిందని ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ వెల్లడించగా ఆ విషయాన్ని ప్రముఖంగా ప్రచురించడానికి మనసురాక అప్పులు పెరిగి పోతున్నాయంటూ గగ్గోలు! వార్తల్ని మింగేస్తున్న పత్రికలు ఇక సమాజాన్ని ఏం ఉద్ధరిస్తాయి?

వ్యాసకర్త మాజీ ఎమ్మెల్యే । 98481 28844

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: బ.సప్తమి ఉ.11.30 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: స్వాతి రా.1.58 వరకు, తదుపరి విశాఖ, వర్జ్యం: ఉ.6.10 నుండి 7.53 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.49 నుండి 9.37 వరకు, తదుపరి ప.12.37 నుండి 1.25 వరకు, అమృతఘడియలు: సా.4.23 నుండి 6.07 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 6.36, సూర్యాస్తమయం: 5.51.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంపాలెంలోని స్టాల్స్ బాలికల పాఠశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కార్యక్రమంలో పాల్గొని, మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం జరిపారు.





# ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరుదైన శస్త్ర చికిత్సలు

గుంటూరు మెడికల్/కర్నూలు(హాస్పిటల్): తీవ్రమైన అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన వారికి శస్త్ర చికిత్సలు చేసి ప్రాణాలు నిలిపిన ఘటనలకు గుంటూరు జీజీహెచ్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలు వేదికయ్యాయి. వివరాల్లోకి వెళితే... ఏలూరు జిల్లాకు చెందిన 62 ఏళ్ల నూతి దుర్గారావు విపరీతమైన కడుపు నొప్పితో జనవరి 17న గుంటూరు జీజీహెచ్‌కు వచ్చారు. జనరల్ సర్జరీ మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవింద నాయక్ ఆధ్వర్యంలో పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి పాంక్రియాస్ డక్ట్ స్టోన్స్ ఉన్నట్లు గుర్తించారు. మద్యం తాగడం వల్ల ఏర్పడిన ఈ రాళ్లను జనవరి 19న సుమారు నాలుగు గంటల పాటు ఆపరేషన్ చేసి తొలగించారు. సుమారు రూ.1.50 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు.

### బాలిక ఛాతీలో కణితి తొలగింపు

కర్నూలు జిల్లా డోన్ మండలం దొరపల్లి గ్రామానికి చెందిన పద్మ(15)కు ఛాతీలో గుండె పక్కన గడ్డ వచ్చింది. గుండె వెనుక భాగంలో న్యూరో ఫైబ్రోమా అని పిలిచే ఈ గడ్డ నరాల నుంచి వస్తోందని వైద్యులు గుర్తించారు. సాధారణంగా ఇలాంటి కణితిని ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా తొలగించాల్సి ఉంది. ఇలా చేస్తే బాలిక కొన్ని నెలల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. త్వరలో ఆ బాలిక పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉన్నందున వీఏటీఎస్ వీడియో అసిస్టెడ్ థొరాసిక్ సర్జరీ పద్ధతి ద్వారా కణితిని తొలగించినట్లు కార్డియోథొరాసిక్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు.



గుంటూరు జీజీహెచ్‌లో ఆపరేషన్ చేయించుకున్న దుర్గారావుతో డాక్టర్ కిరణ్‌కుమార్, సర్జరీ వైద్యులు



ఆపరేషన్ అనంతరం కోలుకున్న బాలికతో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ కొండారెడ్డి

# వైద్యశాఖలో ఉద్యోగాల పండుగ

## 253 వైద్య పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

- ఎన్‌హెచ్‌ఎం పరిధిలో 234, విమ్స్‌లో 19 పోస్టులు
- కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎంపిక
- 2019 నుంచి ఇప్పటివరకు 53 వేలకు పైగా పోస్టుల భర్తీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాల జాతర కొనసాగుతోంది. కొద్ది రోజుల క్రితం డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆస్పత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 424 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఓవైపు ఈ పోస్టుల భర్తీ కొనసాగుతుండగానే మరోవైపు 253 వైద్య పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో 234 పోస్టులు నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో ఉన్నాయి. మరో 19 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో భర్తీ చేయనున్నట్టు రిక్రూట్‌మెంట్ బోర్డ్ సభ్య కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఈ పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. 11 స్పెషాలిటీల్లో 19 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఈ నెల 9న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విమ్స్‌లో వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్నారు. అర్హులైన వైద్యులు నేరుగా హాజరు కావాలి. బ్రాడ్ స్పెషాలిటీల్లో నెలకు రూ.92 వేలు, సూపర్ స్పెషాలిటీల్లో నెలకు రూ.1.60 లక్షలు చొప్పున వేతనాలు ఇస్తారు.

**7 వరకు దరఖాస్తులకు అవకాశం**

కాగా ఎన్‌హెచ్‌ఎం పరిధిలో 234 స్పెషలిస్ట్ వైద్య పోస్టులకు http://apmsrb.ap.gov.in/msrb/ లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 7 వరకు గడువు ఉంది. ఓసీలు రూ.1,000, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎక్స్‌సర్వీస్‌మెన్ వర్గాలకు చెందిన వారు రూ.500 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించాలి. ఉద్యోగాలకు ఎంపికైనవారికి మైదాన ప్రాంతాల్లో అయితే నెలకు రూ.1.10 లక్షలు, గిరిజన ప్రాంతాల్లో అయితే రూ.1.40 లక్షలు చొప్పున వేతనాలు ఇస్తారు. దరఖాస్తు సమయంలో ఏమైనా సమస్యలు తలెత్తితే అభ్యర్థులు 7416664387/8309725712 నంబర్లను సంప్రదించవచ్చు. ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకుండా ఎప్పటికప్పుడు ఖాళీలను వైఎస్ జగన్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తోంది. ఈ క్రమంలో 2019 నుంచి ఇప్పటివరకు ఏకంగా 53 వేలకు పైగా పోస్టుల భర్తీ చేపట్టింది. అంతేకాకుండా వైద్య శాఖలో నియామకాల కోసమే ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డ్‌ను సైతం ఏర్పాటు చేసింది. వైద్య, ఆరోగ్య శాఖలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేలా బోర్డుకు అత్యవసర అనుమతులు ఇచ్చింది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్య శాఖలో పోస్టుల భర్తీ కొనసాగుతోంది.

**ఎన్‌హెచ్‌ఎం పరిధిలో భర్తీ చేసే పోస్టులు..**

| | |
|---|---|
| జనరల్ మెడిసిన్ | 59 |
| ఓబీజీ | 37 |
| పీడియాట్రిషన్ | 115 |
| కార్డియాలజీ | 8 |
| ఎపిడమాలజీ | 15 |

## ఏఎంవీఐ ఫలితాల విడుదల

సాక్షి, అమరావతి: అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థుల వివరాలను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

## యథావిధిగా ఏపీపీఎస్సీ పరీక్షలు

- గ్రూప్-2 వాయిదా వదంతి మాత్రమే
- సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్

సాక్షి, అమరావతి: ఇటీవల ఏపీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్లలో ఏ ఒక్క పరీక్షను వాయిదా వేయడం లేదని సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 పరీక్ష వాయిదా వేస్తున్నట్టు కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని, అలాంటి వదంతులు నమ్మవొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా యథావిధిగా తమ సన్నద్ధతను కొనసాగించాలని సూచించారు. షెడ్యూల్‌లో పేర్కొన్న తేదీల్లోనే పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

## ఏపీఐఐసీలో 47 రెగ్యులర్ ఉద్యోగాల భర్తీకి అనుమతి

సాక్షి, అమరావతి: ఏపీఐఐసీలో రెగ్యులర్ ఉద్యోగ నియామకాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ఎండీ ప్రవీణ్ కుమార్ గురువారం కోరారు. 15 ఏళ్ల తర్వాత ఏపీఐఐసీలో పలు కేటగిరీల్లో 47 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించిందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు త్వరలో చేపట్టే నియామక ప్రక్రియలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏపీఐఐసీలో రెగ్యులర్ నియామకాలు కల్పిస్తున్న సీఎం జగన్, మంత్రి అమర్‌నాథ్‌కు ఏపీఐఐసీ ఉద్యోగ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి.

## నేటి నుంచి జేఈఈ సెషన్-2 దరఖాస్తులు

సాక్షి, అమరావతి: దేశ వ్యాప్తంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జేఈఈ సెషన్-2 రిజిస్ట్రేషన్లను శుక్రవారం నుంచి ప్రారంభించనుంది. మార్చి 2వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. ఇదిలా ఉంటే.. ఫిబ్రవరి ఒకటో తేదీతో తొలి సెషన్ ముగిసింది. గతంలోనే రెండు సెషన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కొత్తగా రెండో సెషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. మార్చి 3వ వారంలో ఎన్టీఏ పరీక్షల షెడ్యూల్ ప్రకటించనుంది. పరీక్ష తేదీకి మూడు రోజుల ముందుగా అడ్మిట్ కార్డు, సిటీ ఇంటిమేషన్ కార్డులు ఎన్టీఏ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఏప్రిల్ 15 వరకు పరీక్షలు నిర్వహించి 25న తుది ఫలితాలు ప్రకటించేలా ఎన్టీఏ కసరత్తు చేస్తోంది. తొలి సెషన్‌లో పరీక్షలకు సంబంధించి ఎన్టీఏ త్వరలో తాత్కాలిక ఆన్సర్ కీని విడుదల చేయనుంది. విద్యార్థుల నుంచి వచ్చిన అభ్యంతరాల ఆధారంగా ఫైనల్ కీ, ఫలితాలను ప్రకటించనుంది.

## 'అంబేడ్కర్' వర్సిటీ అడ్మిషన్ గడువు పెంపు

మధురానగర్ (విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ అడ్మిషన్ల గడువు ఈనెల 16వ తేదీ వరకు పెంచినట్లు వర్సిటీ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం అజంతకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ ప్రవేశాలకు గడువు జనవరి 31తో ముగిసిందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ప్రవేశాల గడువును ఈనెల 16వ తేదీవరకు పొడిగించినట్లు తెలిపారు. డిగ్రీలో ప్రవేశాలకు రెండేళ్ల ఇంటర్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్ కోర్సు ఉత్తీర్ణత సాధించిన వారు, పీజీలో ప్రవేశాలకు మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు పూర్తిచేసిన వారు అర్హులు అన్నారు. ఈనెల 16వ తేదీలోపు ఏపీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ప్రవేశ రుసుము చెల్లించాలని సూచించారు. మరింత సమాచారం కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో స్వయంగా కానీ 0866-2434868, 7382929642 నంబర్‌లలో కానీ సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

## ఇంటర్ పర్యావరణ పరీక్ష వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 3వ తేదీన జరుగనున్న ఇంటర్మీడియట్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష వాయిదా వేసినట్లు ఎగ్జామినేషన్ ఆఫ్ కంట్రోలర్ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఫిబ్రవరి 23న నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

## ఘనంగా 'గోదావరి' 50 ఏళ్ల పండుగ

**1974 ఫిబ్రవరి 1న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం**



విజయవాడలో కేక్ కట్ చేస్తున్న డీఆర్‌ఎం నరేంద్ర

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తరం)/ రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ)/నాంపల్లి (హైదరాబాద్): దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో విశాఖపట్నం-హైదరాబాద్-విశాఖపట్నం మధ్య నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు 12727/12728 సిల్వర్ జూబ్లీ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ రైళ్లు విశాఖపట్నం, హైదరాబాద్‌లలో బయలుదేరే సమయంలోను, విజయవాడ స్టేషన్‌కు చేరుకున్నప్పుడు ఉద్యోగులు కేక్ కట్‌చేసి ఆనందం పంచుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. విశాఖపట్నంలో రైల్ ఫాన్స్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. హైదరాబాద్‌లో స్టేషన్ మాస్టార్ ఏకే సింగ్, కోచింగ్ డిపో ఇన్‌చార్జి శ్రీనివాస్, గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ఇన్‌చార్జి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. విజయవాడలో డీఆర్‌ఎం నరేంద్ర ఎ పాటిల్, సీనియర్ డీసీఎం వి.రాంబాబు తదితరులు కేకు కట్ చేశారు.

## సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

- పదవీ విరమణ వయసు పెంపుపై బోధనేతర సిబ్బంది హర్షం
- వర్సిటీల్లో సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమాలు

సాక్షి, అమరావతి/ఏయూ క్యాంపస్/తిరుపతి సిటీ: రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అగ్రికల్చర్, హార్టీ కల్చర్, వెటర్నరీ, వైఎస్సార్ హెల్త్, సంప్రదాయ, సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో బోధనేతర సిబ్బంది సంబరాలు చేసుకుంటున్నారు. సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తూ, స్వీట్లు పంచుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గురువారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బంది ప్రత్యేకంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ వర్సిటీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళిరెడ్డి, వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు అజీమ్, ముత్తువేలు తదితరులు పాల్గొన్నారు.

**ఏఎన్‌యూలోనూ..**

గుంటూరులోని ఆచార్య నాగార్జున వర్సిటీ ఎంప్లాయీస్ యూనియన్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వెంకటప్పారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

**ఏయూ క్యాంపస్‌లో...**

ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపుదలపై హర్షం వ్యక్తం చేస్తూ ఆంధ్రా యూనివర్సిటీలోని మహానేత వై.ఎస్.రాజశేఖర రెడ్డి విగ్రహానికి ఏయూ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడే సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. డాక్టర్ బి.వి. రమణా రెడ్డి, త్రినాథరెడ్డి, ఎం.లక్ష్మణరెడ్డి, బి.మంగరాజు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏఎన్‌యూ మెయిన్ గేట్ ఎదుట సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బోధనేతర సిబ్బంది



విశాఖలో ఏయూ ఉద్యోగులు..



తిరుపతిలో నాన్ టీచింగ్ ఉద్యోగులు..

## నూతన ఆవిష్కరణలతో ప్రపంచ ప్రగతి

**సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు • ముగిసిన సౌత్ జోన్ సైన్స్ ఫెయిర్**



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ఎస్పీడీ శ్రీనివాసరావు, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి


సాక్షి, అమరావతి: ప్రపంచ ప్రగతిలో విద్యార్థుల పాత్ర కీలకమని, వారిని శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు బాధ్యత స్వీకరించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అన్నారు. 6 రోజులుగా విజయవాడలో జరుగుతోన్న 'సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్' గురువారంతో ముగిసింది. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ మ్యూజియం (బెంగళూరు) సహకారంతో సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 210 ప్రాజెక్టులు ప్రదర్శనకు ఉంచారు. ఆరేళ్లకు ఓసారి నిర్వహించే ఈ సైన్స్ ఫెయిర్‌కు ఈసారి ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇచ్చింది. ముగింపు సభలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఎస్పీడీ మాట్లాడుతూ..సైన్స్ ఫెయిర్ కొన్ని సమస్యలకు పరిష్కారాలు చూపడంతో పాటు వివిధ ప్రాంతాల విద్యార్థులు ఒక్కచోటకు రావడంతో ఒకరి సంస్కృతీ సంప్రదాయాలు మరొకరు తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్ గ్రూప్ కేటగిరీలో ఓవరాల్ విజేతగా 'మోడల్ స్మార్ట్ మల్టీ పర్పస్ చైర్' ప్రాజెక్ట్ ఎంపికైంది. గుంటూరు జిల్లా మంగళగిరి సీకే జూనియర్ కాలేజ్ అండ్ హైస్కూల్ విద్యార్థులు బహుమతి అందుకున్నారు. తమిళనాడు నాచంపట్టి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రూపొందించిన 'మోడల్ ఆర్టిఫిషియల్ హ్యాండ్స్ ఫర్ ఫిజికల్లీ ఛాలెంజెడ్ ఇన్ ఫిజిక్స్'కి ద్వితీయ బహుమతి దక్కింది. ఈ విజేతలకు నగదు పురస్కారం, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ట్రోఫీ అందజేశారు. వ్యక్తిగత విభాగంలో తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మౌంట్ బాసిల్ హైస్కూల్ విద్యార్థి డి.సాయి చంద్రశేఖర్ రూపొందించిన 'మోడల్ ఆటోమేటిక్ రైల్వే ప్లాట్‌ఫారం డోర్' రెండో బహుమతికి ఎంపికైంది. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

# చిన్న దేశాలే.. రిచ్చెస్ట్..

ఒక దేశంలో ఏడాదికాలంలో ఉత్పత్తి అయ్యే మొత్తం వస్తువులు, సేవల విలువను జీడీపీగా చెప్తారు. జనాభా ఎక్కువగా ఉన్న దేశాల జీడీపీ ఎక్కువగా ఉన్నా.. తలసరి జీడీపీ బాగా తక్కువగా ఉంటుంది. అంటే అవి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలే అయినా.. పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల కిందే లెక్క. అదే తలసరి జీడీపీ ఎక్కువగా ఉన్న దేశాలు బాగా అభివృద్ధి చెందినవి అన్నమాట.












## రాష్ట్రాలకు రూ. 75 వేల కోట్ల వడ్డీలేని రుణాలు

వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేసే చర్యల్లో భాగంగా సంస్కరణల బాటపట్టే రాష్ట్రాలకు 50 ఏళ్లపాటు రూ. 75 వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తామని కేంద్రం తెలిపింది. 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న లక్ష్యసాధన కోసం ఈ మేరకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఇందుకోసం రాష్ట్రాలు ఎన్నో అభివృద్ధి ఆధారిత సంస్కరణలను చేపట్టాల్సి ఉందన్నారు. అన్ని రంగాల సమ్మిళిత అభివృద్ధి సాధన దిశగా మోదీ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని చెప్పారు.



## అంతరిక్షానికి అదనంగా రూ. 2,000 కోట్లు

అంతరిక్షంలో భారత కేంద్రం ఏర్పాటు లక్ష్యంగా కలిగిన అంతరిక్ష విభాగానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంటే రూ.2 వేల కోట్లు అదనంగా కేటాయించారు. ఈ విభాగానికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.13,042.75 కోట్లు కేటాయించారు. 2023-24 సవరించిన అంచనాల ప్రకారం ఈ విభాగానికి రూ.11,070.07 కోట్ల కేటాయింపులు జరిగాయి. 2035 కల్లా భారత్ అంతరిక్ష కేంద్రాన్ని నెలకొల్పాలని, 2040 కల్లా భారతీయ వ్యోమగామి చంద్రునిపై కాలు మోపాలని ప్రధాని మోదీ లక్ష్యంగా నిర్దేశించిన సంగతి తెలిసిందే. ఇలావుండగా స్పేస్ టెక్నాలజీకి కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. 2023-24లో రూ.8,180 కోట్లు కేటాయించగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.10,087 కోట్లుగా ప్రతిపాదించారు.



## మహిళా శిశు అభివృద్ధికి రూ.26 వేల కోట్లు

మధ్యంతర బడ్జెట్‌లో మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు రూ.26 వేల కోట్ల కేటాయింపులు దక్కాయి. 2023-24 బడ్జెట్‌తో పోలిస్తే ఇది 2.52 శాతం అధికం. అత్యధికంగా సాక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0లకు రూ.21,200 కోట్లు కేటాయించారు. మిషన్ శక్తికి రూ.3,145.97 కోట్లు ప్రతిపాదించారు. మహిళలకు భద్రత, రక్షణ అలాగే వారు తమ హక్కులు పొందడం, పలు ప్రభుత్వ పథకాలు చేరువ చేయడం లక్ష్యంగా మిషన్ శక్తి (సంబల్)కి కేంద్రం శ్రీకారం చుట్టింది. కాగా మిషన్ వాత్సల్య (బాలల రక్షణ సేవలు, బాలల సంక్షేమ సేవలు)కు రూ.1,472 కోట్లు కేటాయించారు. సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం..2023-24లో మహిళా శిశు అభివృద్ధి శాఖకు రూ.25,448.68 కోట్లు కేటాయించారు. అటానమస్ సంస్థలకు రూ.168 కోట్ల నుంచి రూ.153 కోట్లకు బడ్జెట్ తగ్గింది. ఈ సంస్థల్లో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీ, నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్, నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ ఉన్నాయి.

## ఇది కార్పొరేట్ల బడ్జెట్

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ఓటర్లను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. ఈ బడ్జెట్ దారిద్ర్య రేఖకు దిగువనున్నవారికి ప్రయోజనం కల్పించేది కాదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. కేంద్రం ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ, మరోవైపు రాయితీలకు కోత పెడుతోందన్నారు.

# సాగుకు రూ. 1.27 లక్షల కోట్లు

| వ్యవసాయ విభాగానికి | వ్యవసాయ పరిశోధన, విద్యకు |
|---|---|
| రూ.1,17,528 కోట్లు | రూ. 9,941 కోట్లు |
| పీఎం కిసాన్ పథకానికి | ఆహార మంత్రిత్వ శాఖ |
| మళ్లీ రూ.60 వేల కోట్లే | బడ్జెట్‌కు కోత.. |

:... వ్యవసాయ రంగం ...:



**న్యూఢిల్లీ:** వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను వ్యవసాయ మంత్రిత్వ శాఖకు కేంద్రం రూ.1.27 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-2024)తో పోల్చుకుంటే కేటాయింపులు స్వల్పంగా పెంచింది. రూ.1,27,469.88 కోట్లలో వ్యవసాయ విభాగానికి రూ.1,17,528 కోట్లు కేటాయించగా, వ్యవసాయ పరిశోధన, విద్య (డేర్) విభాగానికి రూ.9,941 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర సవరించిన అంచనాల ప్రకారం.. వ్యవసాయ విభాగానికి రూ.1,16,788.96 కోట్లు, డేర్‌కు రూ.9,876.60 కోట్లు కేటాయించారు. పీఎం కిసాన్ పథకానికివ్యవసాయ విభాగం పరిధిలోని ప్రతిష్టాత్మక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.60 వేల కోట్లు కేటాయించగా, వచ్చే ఏడాదికి ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా రూ.60 వేల కోట్లే కేటాయించారు. ఈ పథకం కింద కేంద్రం రైతులకు మూడు వాయిదాలుగా సంవత్సరానికి రూ.6 వేలు చొప్పున అందజేస్తోంది.

వినియోగదారుల వ్యవహారాలు,ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే కేటాయింపులు తగ్గాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను ఈ శాఖకు రూ.2.13 లక్షల కోట్ల పైచిలుకు కేటాయించారు. ఇందులో వినియోగదారుల వ్యవహారాలకు 302.62 కోట్లు కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దీని బడ్జెట్ రూ.309.26 కోట్లు కావడం గమనార్హం. ఇక ఆహార, ప్రజా పంపిణీ విభాగానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2,21,924.64 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది కొంత కోత విధించి రూ.2,13,019 కోట్ల బడ్జెట్ మాత్రమే కేంద్రం కేటాయించింది. దేశవ్యాప్తంగా ఉన్న రేషన్ షాపుల ద్వారా 80 కోట్లకు పైగా ప్రజలకు ఈ విభాగం ఆహార ధాన్యాలు పంపిణీ చేస్తోంది.

**ప్రజా పంపిణీకి రూ.8 వేల కోట్ల తగ్గింపు..**

వచ్చే ఆర్థిక సంవత్సరానికి రసాయనాలు, ఎరువుల శాఖకు రూ.1.68 లక్షల కోట్లు కేటాయించారు. ఎరువుల విభాగానికి కేటాయింపులు రూ.1,88,947.29 కోట్ల నుంచి రూ.1,64,150.81 కోట్లకు తగ్గించారు. ఇక రసాయనాలు, పెట్రో రసాయనాల విభాగానికి కేటాయింపులు గణనీయంగా తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.572.63 కోట్లు కేటాయించగా, వచ్చే ఏడాదికి కేవలం రూ.139.05 కోట్లు మాత్రమే కేటాయించారు. అయితే ఫార్మాస్యూటికల్స్ విభాగానికి మాత్రం కేటాయింపులు పెరగడం గమనార్హం. దీనికి కేటాయింపులు రూ.2,697.95 కోట్ల నుంచి రూ.4,089.95 కోట్లకు పెరిగాయి. అలాగే హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలోని సహకార శాఖకు కూడా రూ.747.84 కోట్ల నుంచి రూ.1,183.39 కోట్లకు కేటాయింపులు పెరిగాయి. ఇక మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ శాఖకు రూ.7,105.74 కోట్లు, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖకు రూ.3,290 కోట్లు కేటాయించారు.

**రసాయనాలు ఎరువుల శాఖకు రూ.1.68 లక్షల కోట్లు**

## నీళ్లకు నిధులు పెరిగాయ్

**జలశక్తి శాఖకు రూ. 98,418 కోట్లు కేటాయింపు**
**గతేడాదికన్నా రూ. 2 వేల కోట్లు అధికం**
**పీఎంకేఎస్‌వై ప్రాజెక్టుకు రూ. 11,391 కోట్లు**
**గతంకన్నా రూ. 3 వేల కోట్లు పెరుగుదల**


**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం 2024 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేంద్ర జలశక్తి శాఖకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యతనిచ్చింది. గతేడాది జలశక్తి శాఖకు మొత్తంగా కేటాయించిన నిధుల కంటే దాదాపు రూ. 2 వేల కోట్ల మేర కేటాయింపులను పెంచింది. గతేడాది జలశక్తి శాఖకు రూ. 96,549 కోట్లు కేటాయించగా ఈ ఏడాది ఆ కేటాయింపులను రూ. 98,418 కోట్లకు పెంచింది. ముఖ్యంగా ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) కింద నిధుల మొత్తాన్ని రూ. 8,781 కోట్ల నుంచి రూ. 11,391 కోట్లకు పెంచింది. దీనికిందే ఉన్న సమగ్ర సాగునీటి సత్వర ప్రాయోజిత కార్యక్రమం (ఏఐబీపీ) పథకానికి గతేడాదికి సమానంగా రూ. 2,500 కోట్లు కేటాయించింది. ఏఐబీపీ పథకంలో తెలంగాణ, ఏపీకి సంబంధించి వివిధ ప్రాజెక్టులకు ఈ నిధులు కేటాయించే అవకాశం ఉంది. దీంతోపాటే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో భేటీ సమయంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోరగా పీఎంకేఎస్‌వై పథకం కింద ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిధుల్లోనే ఆ మొత్తాలను కేటాయించాల్సి ఉంటుంది. ఇక ఆయకట్టు అభివృద్ధి పథకం (కాడా) కింద రూ. 1,400 కోట్లు కేటాయించగా దీని కింద సైతం తెలంగాణకు సంబంధించి 11 ప్రాజెక్టులున్నాయి.



**నదుల అనుసంధానానికి పెరిగిన కేటాయింపులు...**

నదుల అనుసంధాన కార్యక్రమానికి కేంద్రం నిధులు పెంచింది. గతేడాది కేవలం రూ. 1,500 కోట్లు కేటాయించిన మోదీ ప్రభుత్వం.. ఈ ఏడాది దాన్ని రూ. 4 వేల కోట్లకు పెంచింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ సాగు, తాగునీటి అవసరాలను తీర్చే కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రక్రియ ఇప్పటికే మొదలవ్వడం, నాలుగు రోజుల కిందటే మధ్యప్రదేశ్, రాజస్తాన్ మధ్య పర్బతి-కాలిసింద్-చంబల్ నదులను తూర్పు రాజస్తాన్ కాలువతో కలిపే అనుసంధాన ప్రక్రియపై ఒప్పందాలు జరిగిన నేపథ్యంలో కేటాయింపులు పెంచినట్లు తెలుస్తోంది. అయితే గోదావరి-కావేరి అనుసంధాన ప్రక్రియపై ఎలాంటి ముందడుగు ఉంటుందన్నది తేలాల్సి ఉంది. గతేడాది తుంగభద్ర జలాలపై ఆధారపడి కర్ణాటక చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర సాయం కింద రూ. 5,300 కోట్లు ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించగా ఈ ఏడాది దాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. అలాగే తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టులు ముఖ్యంగా ఏపీలోని పోలవరం ఎత్తిపోతల పథకానికి నిధుల కేటాయింపు అంశాల ప్రస్తావన లేదు.

## ఆదాయ పన్ను శ్లాబ్‌లు యథాతథం..



**సాక్షి,అమరావతి:** మధ్యతరగతి, వేతనజీవుల ఆశలపై ఆర్థిక మంత్రి నీళ్లు కుమ్మరించారు. ఎన్నికల వేళ ప్రవేశపెడుతున్న బడ్జెట్ కావడంతో కాసింత ఉపశమన మాటలు వస్తాయనుకున్న వారికి గతంలో చేసిన గొప్పలను ఏకరువు పెట్టి సరిపెట్టారు. మధ్యంతర బడ్జెట్ కావడంతో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో ఎటువంటి మార్పులు చేయడం లేదన్నారు. వ్యక్తిగత ఆదాయ పన్నుల శ్లాబుల్లో ఎటువంటి మార్పులు లేవన్నారు. గత పదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 3 రెట్లకుపైగా పెరగ్గా పన్ను రిటర్నులు దాఖలు చేసే వారి సంఖ్య 2.4 రెట్లు పెరిగిందని పేర్కొన్నారు. 2013- 14 ఆర్థిక సంవత్సరానికి దేశంలో పన్ను చెల్లించాల్సినవసరం లేని ఆదాయ పరిమితి రూ.2.2 లక్షలు ఉంటే ఇప్పుడు 7 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారు ఒక్క రూపాయి పన్ను చెల్లించాల్సిన పని లేదన్నారు.

**కొత్త పన్నుల విధానం ఎన్నుకున్న వారికే ఇది వర్తింపు**

7 లక్షల వరకు పన్ను చెల్లించక్కర్లేదన్న ఆర్థిక మంత్రి మాటలపై మధ్యతరగతి ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇది కేవలం కొత్త పన్నుల విధానం ఎంచుకున్నవారికి మాత్రమే వర్తిస్తుందని, పాత పన్నుల విధానంలో ఉన్న వారికి ఈ రిబేటు పరిమితి రూ.5 లక్షలే ఉందన్న విషయాన్ని వారు గుర్తుచేశారు. నాలుగేళ్ల కిందట కొత్త పన్నుల విధానం తీసుకొచ్చారు. పాత విధానంతో పోలి స్తే తక్కువ పన్ను రేట్లతో అన్ని వయసుల వారికి ఒకే విధమైన శ్లాబ్ రేట్ల ను ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానం ఎంచుకుంటే సెక్షన్ 80సీ, గృహ రుణాలు, స్టాండర్డ్ డిడక్షన్, ఆరోగ్య బీమా వంటి పలు సెక్షన్ల కింద లభించే ప్రయోజనాలను పొందడానికి వీలుండదు. మొత్తం ఆదాయం మీద పన్ను చెల్లించా ల్సి వస్తుంది. కొత్త పన్నుల విధానంలో 7 లక్షల వరకు ఎటువంటి పన్ను చెల్లించన వరం లేకుండా సెక్షన్ 87ఏ కింద రిబేటు ప్రకటించింది. దీనికింద రూ.25,000 ప్రయో జనం లభిస్తుంది. అదే పాత పన్నుల విధానం ఎంచుకుంటే సెక్షణ్ 87ఏ రిబేటు పరిమితిని రూ.5 లక్షల ఆదాయం వరకు పరిమితం చేశారు. పాత పన్నుల విధానం ఎంచుకున్న వారికి కేవలం రూ.12,500 మాత్రమే ప్రయోజనం లభిస్తుంది. పాత విధానం నుంచి కొత్త విధానంలోకి మార్చాలన్న ఉద్దేశ్యంతో నిర్మాల ఈ నిర్ణయం తీసుకున్నారు. రిటైల్ వ్యాపారుల ఊహాజనిత ఆదాయం పరిమితిని రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లకు, వృత్తినిపుణుల ఊహాజనిత ఆదాయ పరిమితిని రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో పన్ను రిటర్నులు సులభంగా దాఖలు చేసే విధంగా పలు చర్యలు తీసుకున్నామని, దీంతో 2013- 14లో 93 రోజులుగా ఉన్న రిఫండు సమయాన్ని ఇప్పుడు పదిరోజులకు తగ్గించినట్లుగా తెలిపారు.

## 'లఖ్‌పతి దీదీ' కిందకు 3 కోట్ల మంది మహిళలు



**న్యూఢిల్లీ:** స్వయం సహాయక బృందాల్లో సభ్యత్వం తీసుకుని పొదుపు బాటలో పయనిస్తూ తమ దక్షతతో వ్యాపారం చేస్తూ లఖ్‌పతి దీదీ (లక్షాధికారి)లుగా అవతరిస్తున్న మహిళల సంఖ్యను మరింత పెంచడంపై దృష్టిపెట్టినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ విషయాన్ని తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. '' 83 లక్షల స్వయం సహాయక బృందాలు(ఎస్‌హెచ్‌జీ)ల్లో దాదాపు తొమ్మిది కోట్ల మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. వేల కోట్ల రుణాలు తీసుకుంటూ స్వయం ఉపాధి సాధిస్తూ, చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటున్నారు. కష్టించి వ్యాపారాన్ని నిలబెట్టుకుని తమ కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలుస్తున్నారు. ఇలా దేశవ్యాప్తంగా దాదాపు కోటి మంది మహిళలు ఏటా కనీసం రూ. 1 లక్ష ఆర్జిస్తున్నారు. స్వయం ఉపాధి ద్వారా ఇలా పొదుపు సంఘాల మహిళలు దేశ సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేస్తూ సాధికారత, స్వావలంభన సాధిస్తూ అందరికీ స్ఫూర్తిప్రదాతలయ్యారు. ఇలాంటి లక్షాధికారి(లఖ్‌పతి దీదీ)ల సంఖ్యను రెండు నుంచి మూడు కోట్లకు పెంచడమే మా ప్రభుత్వ లక్ష్యం'' అని నిర్మల లోక్‌సభలో వ్యాఖ్యానించారు.

## ఆశ, అంగన్‌వాడీలకు 'ఆయుష్మాన్ భారత్'

**న్యూఢిల్లీ:** ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు హెల్త్‌కేర్ కవరేజీని కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించారు. వారిని ఆయుష్మాన్ భారత్ బీమా పథకం పరిధిలోకి తీసుకువస్తున్నట్లు 2024-25 బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. సక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 కింద అంగన్‌వాడీ కేంద్రాలను ఉన్నతీకరించడం ద్వారా న్యూట్రిషన్ డెలివరీ వేగవంతం అవుతుందని చెప్పారు. ఇప్పుడున్న ఆస్పత్రుల మౌలిక వసతులను వినియోగించుకుని మరిన్ని మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలనే ప్రణాళికలో ప్రభుత్వం ఉందని తెలిపారు. దీనిని పరిశీలించడానికి ఓ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కేటాయింపులను రూ. 6,800 కోట్ల నుంచి రూ. 7,500 కోట్లకు పెంచినట్లు నిర్మల చెప్పారు. సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణ కోసం 9 నుంచి 14 ఏళ్ల మధ్య ఉన్న బాలికలకు వ్యాక్సినేషన్‌ను ప్రోత్సహిస్తామన్నా రు. సమగ్ర ఆచరణ కోసం వివిధ మాతా శిశు హెల్త్‌కేర్ స్కీంలను ఒకే గొడుగు కిందకు తెస్తామన్నారు. మిషన్ ఇంద్రధనుష్ మరింత సమర్థంగా అమలు చేయడంలో భాగంగా కొత్తగా రూపొందించిన యు-విన్ పోర్టల్‌ను దేశవ్యాప్తంగా తీసుకొస్తున్నామని తెలిపారు.

## గ్రామీణాభివృద్ధికి..

### రూ. 1.77 లక్షల కోట్లు



➤ 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు రూ.1.77 లక్షల కోట్లు ప్రకటించారు. గతేడాది రూ.1.57 లక్షల కోట్ల కంటే 12 శాతం ఎక్కువగా కేటాయించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.86,000 కోట్లు కేటాయించగా, గత బడ్జెట్‌లో చేసిన రూ.60,000 కోట్ల కంటే ఇది 43 శాతం ఎక్కువ. వచ్చే ఐదేళ్లలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ పథకానికి రూ.54,500 కోట్లు కేటాయించారు. 'లఖ్ పతి దీదీ'ల లక్ష్యాన్ని రెండు కోట్ల నుంచి 3 కోట్లకు పెంచినట్లు సీతారామన్ ప్రకటించారు. జాతీయ జీవనోపాధి మిషన్-ఆజీవికకు రూ.15,047 కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయించిన రూ.14,129.17 కోట్ల కంటే ఇదిదాదాపు 6% ఎక్కువ. కాగా, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజనకు కేటాయింపులు తగ్గాయి. ఈ బడ్జెట్‌లో రూ.12,000 కోట్లు కేటాయించారు.

## పర్యావరణ శాఖకు..

### రూ. 3,265 కోట్లు



➤ కేంద్ర ప్రభుత్వం 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో పర్యావరణ శాఖకు రూ.3,265 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఈ మొత్తం రూ.3,231 కోట్లు ఉండగా, ఈ సారి కొద్దిగా పెరిగింది. అలాగే కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు, కేంద్ర జూ అథారిటీ, జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ,ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ సంస్థలకు గతేడాది బడ్జెట్‌లో 158.60 కోట్లు కేటాయించగా, ఈ సారి రూ.192 కోట్లు కేటాయించారు. కాగా, స్వయంప్రతిపత్తి సంస్థలైన జీబీ పంత్ హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎన్వి రాన్‌మెంట్, భారత అటవీ పరిశోధన, అభి వృద్ధి మండలి, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాలకు కేంద్రం గతేడాది బడ్జెట్‌లో రూ.573.73 కోట్లు కేటాయించగా, తాజా మధ్యంతర బడ్జె ట్‌లో రూ.391 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇక అడ వుల్లో జంతు ఆవాసాల సమీకృత అభివృద్ధికి రూ.450 కోట్లను కేటాయించింది. అలాగే అడవుల పరిరక్షణ, పచ్చ దనం పెంపునకు సంబంధించి జాతీయ గ్రీన్ ఇండియా మిషన్‌కు గత బడ్జెట్‌లో రూ.160 కోట్లు ఉన్న కేటాయింపులను ఈ సారి రూ.220 కోట్లకు పెంచింది.

## సామాజిక న్యాయం, సాధికారతకు..

### రూ. 14,225 కోట్లు



➤ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు రూ.14,225.47 కోట్లు కేటాయించారు. సామాజిక న్యాయం, సాధికారత శాఖకు రూ.13,000 కోట్లు కేటాయించగా.. వికలాంగుల సాధికారత శాఖకు రూ.1,225.27 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ రూ.11,078.33 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది 28.4% పెరిగింది. వికలాంగుల సాధికారత విభాగం కింద జాతీయ వికలాంగుల సంక్షేమానికి రూ.615 కోట్లు కేటాయించారు. సామాజిక న్యాయం, సాధికారత శాఖ కింద షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి పథకానికి రూ.9,559.98 కోట్లు కేటాయించగా, బలహీన వర్గాల అభివృద్ధి కార్యక్రమానికి రూ.2,150 కోట్లు కేటాయించారు. జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్, వెనుక బడిన తరగతుల జాతీయ కమిషన్, సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్‌కు మొత్తం రూ.7,175 కోట్లు కేటాయించారు.

## గిరిజన మంత్రిత్వ శాఖకు..

### రూ. 13వేల కోట్లు




➤ 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు కేంద్రప్రభుత్వం రూ.13,000 కోట్లు కేటాయించింది. ఇది గత కేటాయింపుల కంటే భారీ అనగా 70 శాతం ఎక్కువ. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గిరిజన మంత్రిత్వ శాఖకు రూ.7,605 కోట్లు కేటాయించారు. 2024-25లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎమ్ ఆర్ఎస్) నిర్మాణానికి కేంద్రం రూ.6,399 కోట్లు కేటాయించింది. ఇది 2023-24లో కేటాయించిన రూ.2,471.81 కోట్ల కంటే 150 శాతం ఎక్కువ. ప్రధాన మంత్రి ఆది ఆదర్శ్ గ్రామ యోజనకు కేటాయింపులు రూ.300 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు పెంచారు. ఈ పథకం కింద విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి-ఆదాయ కల్పన వంటి రంగాల్లోని అంతరాలను తగ్గించడానికి గిరిజన ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిధులను అందిస్తారు. గిరిజన పరిశోధనా సంస్థలకు ఆర్థిక సహాయాన్ని రూ.50 కోట్ల నుంచి రూ.111 కోట్లకు పెంచారు. కాగా, జాతీయ ఫెలోషిప్, ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్య, స్కాలర్‌షిప్ కోసం బడ్జెట్ కేటాయింపులు 2023-24లో రూ.230 కోట్ల నుంచి 2024-25లో రూ.165 కోట్లకు తగ్గించారు.

## ప్రపంచంలో 'రక్షణ'కు భారీ బడ్జెట్లు!

లోపీ ఇనిస్టిట్యూట్ ఆసియా పవర్ ఇండెక్స్-2023 ప్రకారం.. 2030నాటికి ఇండియా రక్షణ వ్యయం 15.19 లక్షల కోట్లకు పెరగనుంది.

చాలా దేశాలు తమ శత్రుదేశాల నుంచి ముప్పును ఎదుర్కోవడానికి, తమ ఆధిపత్యాన్ని చాటడానికి రక్షణ రంగంపై భారీగా ఖర్చు చేస్తుంటాయి. అత్యాధునిక యుద్ధ విమానాలు, క్షిపణులు, ట్యాంకులు, తుపాకులు వంటి ఆయుధాలను కొనుగోలు చేయడమో, తయారు చేసుకోవడమో జరుగుతుంది. కొన్నేళ్లుగా పలు దేశాల మధ్య యుద్ధాలు, ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు, ఆధిపత్య ధోరణులు వంటివి వాటితో మిలటరీ బడ్జెట్ భారీగా పెరిగిపోతూ వస్తోంది. ఇందులోనూ ప్రపంచంలో అమెరికా టాప్‌లో ఉండగా.. చైనా, ఇండియా, యూకే, సౌదీ అరేబియా వంటి దేశాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.






# కోటి ఇళ్లకు 'సూర్యోదయం'

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సూర్యోదయ్ పథకం ద్వారా కోటి గృహాలపై సోలార్ ప్యానెళ్లను బిగించడం ద్వారా ఒక్కో కుటుంబం నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా పొందొచ్చని ఆర్థికమంత్రి నిర్మల చెప్పారు. జనవరి 22వ తేదీన అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ట కార్యక్రమం తర్వాత ఢిల్లీలో ప్రధాని మోదీ ప్రధాన్‌మంత్రి సూర్యోదయ్ యోజన పథకాన్ని ప్రారంభించిన విషయం తెల్సిందే. కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా పేద, మధ్యతరగతి ప్రజల కరెంటు బిల్లులను తగ్గించడమే కాకుండా, ఇంధన రంగంలో భారత్ స్వావలంబన దిశగా పయనించేందుకు దోహదం చేస్తుందని ఆనాడు మోదీ పేర్కొన్న విషయం విదితమే. ఈ పథకాన్ని నిర్మల తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. ''ఈ పథకం పూర్తిగా అమల్లోకి వస్తే ఒక్కో కుటుంబం నెలకు 300 ఉచిత విద్యుత్‌ను సొంతంగా తయారుచేసుకోవచ్చు. వాడకం పోగా అధికంగా ఉత్పత్తి అయిన మిగులు విద్యుత్‌ను డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు అమ్మి నగదు లబ్ధి పొందొచ్చు. ఇలా సంవత్సరానికి దాదాపు రూ.18,000 వరకు నగదు ఆదా చేసుకోవచ్చు. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్‌తో ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ పెట్టుకోవచ్చు. ఇళ్లపై సోలార్ ప్యానెల్ వ్యవస్థ అమర్చుకునే వారికి సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకయ్యే ఖర్చులో 40 శాతం వరకు కేంద్రం రాయితీ ఇస్తుంది. ''అని నిర్మల చెప్పారు.

### సముద్రజలాలపై పవన విద్యుత్..

''2070 ఏడాదికల్లా భారత్ కర్బన తటస్థత(కార్బన్ నెట్ జీరో)ను సాధించగలదు. సముద్ర జలాలపై పవన విద్యుత్ ప్రాజెక్టులకు మొదలుపెట్టే సంస్థలకు ఆర్థిక సాయం చేస్తాం. కనీసం 1 గిగావాట్ స్థాపక సామర్థ్యమున్న ప్రాజెక్టులకు ప్రాధాన్యతమిస్తాం. మరోవైపు భారత్‌లో సౌరవిద్యుత్ ఉత్పత్తి స్థాపక సామర్థ్యం 73 గిగావాట్లుగా ఉంది. అదే తరహాలో పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 45 గిగావాట్లుగా ఉంది. బయోమాస్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 10 గిగావాట్లుగా ఉంది. 2030 ఏడాదికల్లా 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో 50 శాతం విద్యుత్‌ను శిలాజేతర ఇంధన వనరుల నుంచే ఉత్పత్తిచేయాల్సి ఉంది''అని నిర్మల చెప్పారు.

:... సౌర విద్యుత్ ...:

300
సొంతంగా సౌరవిద్యుత్ ఉత్పత్తితో నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్

18,000
మిగులు విద్యుత్ అమ్మకాలతో ఏటా రూ. 18,000 వరకు ఆదా



కేవలం ఇంటి అవసరాల కోసమే కాకుండా యువత ఈ పథకాన్ని అద్భుత ఉపాధి అవకాశంగా మలుచుకోవచ్చు. యువత సరఫరాదారు, వ్యాపారిగా మారి పెద్ద మొత్తంలో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల బిగింపు, పంపిణీ వ్యాపారంలో దిగి అంకుర సంస్థలను నడిపించవచ్చు. దీంతో దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలూ మెరుగవుతాయి. సాంకేతిక నైపుణ్యమున్న యువత ఈ రంగంలో తయారీ, నిర్వహణ బాధ్యతలనూ తీసుకోవచ్చు.



## విదేశాంగ శాఖకు రూ. 22,154 కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో విదేశాంగ శాఖకు రూ. 22,154 కోట్లు కేటాయించారు. గతేడాది 18,050 కోట్లు ఇవ్వగా.. 2024-25 బడ్జెట్‌లో రూ. 4,104 కోట్లు పెంచి ఇచ్చారు. ఇక పొరుగుకు మొదట (నైబర్‌హుడ్ ఫస్ట్) పాలసీ కింద ఎక్కువ సాయాన్ని భూటాన్ అందుకోనుంది. ఈ దేశానికి ఈ బడ్జెట్‌లో రూ. 2,068 కోట్లు సాయాన్ని ప్రతిపాదించారు. గతేడాది బడ్జెట్‌లో ఈ హిమాలయ దేశానికి రూ. 2,400 కోట్లు ఇచ్చారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగించడానికి గాను ఆ దేశంలోని చబహర్ పోర్టుకు రూ. 100 కోట్లు కేటాయించారు. ఇక మాల్దీవులకు అభివృద్ధి సాయంలో గతేడాది కంటే రూ. 170 కోట్లు తగ్గించి ఈ బడ్జెట్‌లో రూ. 600 కోట్లు కేటాయించారు. అఫ్గానిస్తాన్‌కు రూ. 200 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ. 120 కోట్లు, నేపాల్‌కు రూ. 700 కోట్లు, శ్రీలంకకు రూ. 75 కోట్లు, మారిషస్‌కు రూ. 370 కోట్లు, మయన్మార్‌కు రూ. 250 కోట్లు అభివృద్ధి సాయం ప్రతిపాదించారు. ఆఫ్రికా దేశాల కోసం ప్రత్యేకంగా రూ. 200 కోట్లు ప్రకటించారు. లాటిన్ అమెరికా, యురేసియా ప్రాంతాల్లోని దేశాలకు అభివృద్ధి సాయంగా రూ. 4,883 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు.

### ఐఎంఈసీ ఓ గేమ్ చేంజర్

బడ్జెట్ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. వ్యూహాత్మంగా, ఆర్థిక పరంగా భారత్ ఇతర దేశాలకు ఇండియా మిడిల్ ఈస్ట్ యూరోప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఈసీ) ఓ గేమ్ చేంజర్ అని చెప్పారు. ప్రపంచ వాణిజ్యానికి ఈ కారిడార్ వందల ఏళ్ల పాటు ఆధారభూతంగా ఉంటుందని అన్నారు. భారత నేలపై నుంచి ఈ కారిడార్ ప్రారంభమైందనే విషయం చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని చెప్పారు.

# రక్షణకు రూ. 6.21 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో రక్షణ శాఖకు కేటాయింపులను గత ఏడాది కంటే స్వల్పంగా పెంచింది. 2023-24 బడ్జెట్‌లో రూ.5.94 లక్షల కోట్లు కేటాయించగా ఇప్పుడు రూ.6.21 లక్షల కోట్లు కేటాయించారు. మిలిటరీ కేపిటల్ వ్యయం కింద పెద్ద ఎత్తున కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధ ఓడల కొనుగోలు కోసం రక్షణ శాఖకు రూ. 1.72 లక్షల కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపు గత ఏడాది 1.62 లక్షల కోట్లుగా ఉంది. మిలిటరీ అవసరాల కోసం అత్యాధునిక సాంకేతికను సమకూర్చుకునేందుకు 'ఆత్మ నిర్భరత'ను వేగవంతం చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. మొత్తం రెవెన్యూ వ్యయం రూ.4,39,300 కోట్లు కాగా, ఇందులో రక్షణ శాఖ పింఛన్లకు 1,41,205 కోట్లు, రక్షణ సర్వీసులకు 2,82,772 కోట్లు, రక్షణ మంత్రిత్వ శాఖ (సివిల్)కు రూ.15,322 కోట్లు కేటాయించారు. విమానాలు, ఏరో ఇంజిన్ల కోసం రూ. 40,777 కోట్లు, ఇతర పరికరాల కోసం 62,343 కోట్లను కేటాయించారు. నేవీ వాహనాల కోసం రూ.23,800 కోట్లు, డాక్‌యార్డ్ ప్రాజెక్టుల కోసం రూ.6,830 కోట్లు కేటాయించారు. రెవెన్యూ వ్యయం కోసం ఆర్మీకి రూ.1,92,680 కోట్లు, నేవీకి రూ.32,778 కోట్లు, భారత వాయుసేనకు రూ. 46,223 కోట్లు కేటాయించారు. మొత్తమ్మీద రక్షణ శాఖకు ఈసారి కేటాయింపులు స్వల్పంగానే పెరిగాయని, ఇది మిలిటరీపై ప్రభుత్వ ప్రాధాన్యతను తెలియజేస్తుందని జాతీయ భద్రత అధ్యయన కేంద్రం లోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణ్ కుమార్ బెహెరా చెప్పారు. కేపిటల్ వ్యయం కోసం రూ.10వేల కోట్లను పెంచడాన్ని ఆరోగ్యకర సంకేతంగానే భావించాలన్నారు.

:... రక్షణ ...:
ఆయుధాలు, విమానాలు, యుద్ధ ఓడల కొనుగోలుకు
1.72
లక్షల కోట్లు

:... డీఆర్‌డీఓ ...:
23,855 కోట్లు



ఆత్మ నిర్భరత, ఎగుమతులను ప్రోత్సహించే లక్ష్యంతో రూ.6,21,540 కోట్లను కేటాయించగా, మొత్తం కేంద్ర బడ్జెట్‌లో ఇది 13.04 శాతంగా ఉంది. సాంకేతిక నిపుణులు, కంపెనీలకు దీర్ఘకాల రుణాలు ఇచ్చేందుకు రూ. లక్ష కోట్లు కార్పస్ ఫండ్ కేటాయించారు. రక్షణ స్టార్టప్‌లకు పన్ను రాయితీలు ఇచ్చి రక్షణ రంగంలో ఆవిష్కరణలకు పెద్దపీట వేయనున్నారు. కేపిటల్ వ్యయం కోసం కేటాయింపులను 2022-23 వాస్తవ కేటాయింపులతో పోలిస్తే ఈసారి 20.33 శాతం నిధులను ఎక్కువగా కేటాయించారు. సరిహద్దు మౌలిక వసతుల కోసం రూ.6,500 కోట్లు, భారత తీరప్రాంత గస్తీదళానికి రూ.7,651 కోట్లు, డీఆర్‌డీఓకు రూ.23,855 కోట్లు కేటాయించారు. నిధుల పెంపుదలతో సాయుధ బలాలకు అధునాతన ఆయుధాలు సమకూర్చేందుకు వీలవుతుందని రక్షణ శాఖ వెల్లడించింది.

:... హోంశాఖ ...:
## 2 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖకు 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో అంతర్గత, సరిహద్దు భద్రతకు ప్రాధాన్యమిస్తూ రూ. 2,02,868.70 కోట్లు కేటాయించారు. అమిత్‌షా నేతృత్వంలోని ఈ శాఖకు 2023-24లో రూ.1,96,034.91 కోట్లను కేటాయించారు. ఈసారి బడ్జెట్‌లో అత్యధిక నిధులను కేంద్ర బలగాలైన సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్‌కు ఇచ్చారు. పారామిలిటరీ బలగాల కిందకు వచ్చే పోలీసులకు రూ. 1,32,345.47 కోట్లను, కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌కు 37,277.74 కోట్లను కేటాయించారు. లద్దాఖ్‌కు రూ.5,958 కోట్లు, అండమాన్ నికోబార్ దీవులకు రూ. 5,866.37 కోట్లు, చండీగఢ్‌కు రూ. 5,862.62 కోట్లు, పుదుచ్చేరికి 3269 కోట్లు, దాద్రా నగర్ హవేలి-డామన్ డయ్యూకు 2,648.97 కోట్లు, లక్షద్వీప్‌కు 1,490.10 కోట్లు, ఢిల్లీకి 1,168.01 కోట్లు కేటాయించారు. మంత్రిమండలి, కేబినెట్ సెక్రటేరియట్, పీఎంఓ ఖర్చుల కోసం 1,248.91 కోట్లు ఇచ్చారు. 2023-24 బడ్జెట్‌లో పారామిలిటరీ బలగాలైన సీఆర్‌పీఎఫ్‌కు 32,809.65 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల మేరకు 31,389.04 కోట్లు ఇచ్చారు.ఇంటెలిజెన్స్ బ్యూరోకు రూ.3,195.09 కోట్లు (2023-24లో 3,268.94 కోట్లు), వామపక్ష ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేక మౌలిక సదుపాయాల పథకం కింద 3,199.62 కోట్లు, సరిహద్దు ప్రాంత అభివృద్ధి కార్యక్రమాల కోసం 335 కోట్లు, సేఫ్ సిటీ ప్రాజెక్టుల కోసం 214.44 కోట్లు, ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు రూ.330 కోట్లు కేటాయించారు.


## సీబీఐకి రూ.928.46 కోట్లు

న్యూఢిల్లీ: 2024-25 కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి రూ.928.46 కోట్లు కేటాయించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇది గతేడాది కంటే రూ.40.4 కోట్లు తక్కువ. సీబీఐ శిక్షణా కేంద్రాల ఆధునీకరణ, టెక్నికల్, ఫోరెన్సిక్ సపోర్ట్ యూనిట్ల ఏర్పాటు, సమగ్ర ఆధునీకరణ, భూమి కొనుగోలు, ఏజెన్సీకి కార్యాలయాలు, నివాస భవనాల నిర్మాణం వంటి పలు ప్రాజెక్టులకు కేటాయింపులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలోని ప్రధాన దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ.. బ్యాంకు రుణ మోసాలు, విదేశాల్లోని కోర్టులలో కొనసాగుతున్న ఉన్నత స్థాయి కేసులతో పాటు కృత్రిమ మేధస్సు, క్రిప్టోకరెన్సీ, డార్క్‌నెట్‌ల ఆధిపత్యంతో అభివృద్ధి చెందుతున్న నేరాలను పరిష్కరిస్తుంది. ఇది పలు రాష్ట్రాలు, హైకోర్టులు, సుప్రీంకోర్టు అప్పగించిన క్రిమినల్ కేసులను కూడా డీల్ చేస్తుంది.



## 'ఈ-కోర్టు'కు 825 కోట్లు

న్యూఢిల్లీ: దిగువ న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాలను ఆధునీకరించేందుకు, కేసుల వివరాలను కంప్యూటర్‌లో డిజిటల్ రూపంలో పొందుపరిచేందుకు రూపొందిస్తోన్న ప్రతిష్టాత్మక ఈ-కోర్ట్ ప్రాజెక్ట్ 3వ దశకోసం బడ్జెట్‌లో ఈ ఆర్థిక సంవత్సరం రూ. 825 కోట్లు కేటాయించారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ. 1,500 కోట్లు పెంచాలని ప్రతిపాదించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ఈ ప్రాజెక్టు రూ.7,210 కోట్ల ఆర్థిక వ్యయంతో కేబినెట్ ఆమోదం పొందిన విషయం తెలిసిందే. 2024-25 బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.1,500 కోట్లు కేటాయించాలని కూడా తాజా అంచనాలు రూపొందించారు. 4 సంవత్సరాలలో పూర్తవుతుందని భావిస్తున్న ఈ ప్రాజెక్టులో కోర్టు రికార్డులు, వారసత్వ కేసులు, పెండింగ్ కేసులు అన్నింటినీ డిజిటల్ రూపంలో చేస్తారు. 3,108 కోట్ల పత్రాలను డిజిటలైజ్ చేసేందుకు రూ. 2,038.40 కోట్లు అవుతుందని అంచనా. 25 పెటా బైట్ల స్టోరేజీతో క్లౌడ్ టెక్నాలజీ సాంకేతికతను ఈ వ్యవస్థకోసం ఉపయోగించడం గొప్ప అడుగుగా ప్రభుత్వం అభివర్ణించింది. దీనికి సంబంధించిన హార్డ్‌వేర్‌ను రాష్ట్రాలకు కేంద్రమే అందిస్తుంది. కేంద్రం, రాష్ట్రాలు, 25 రాష్ట్రాల హైకోర్టులతో ఒక త్రైపాక్షిక ఒప్పందం జరుగుతుంది.



## జనగణన, ఎన్‌పీఆర్‌కు రూ. 1,277 కోట్లు

న్యూఢిల్లీ: 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో జనాభా గణన, ఎన్‌పీఆర్ కోసం రూ.1,277.80 కోట్లు కేటాయించారు. దీంతో ఈ ఏడాది కూడా జనాభా లెక్కించే అవకాశం లేదని సంకేతాన్నిచ్చినట్టైంది. జనాభా లెక్కలు, ఎన్‌పీఆర్‌ల కోసం ప్రభుత్వానికి రూ.12,000 కోట్లకు పైగా ఖర్చు అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. డిసెంబర్ 24, 2019న జరిగిన కేంద్ర మంత్రివర్గం సమావేశం రూ.8,754.23 కోట్ల వ్యయంతో జనాభా గణన-2021, రూ.3,941.35 కోట్ల వ్యయంతో జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పీఆర్) ప్రతిపాదనను ఆమోదించింది. 2020, ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30, 2020 వరకు దేశవ్యాప్తంగా జనాభా గణన, ఎన్‌పీఆర్‌ను అప్‌డేట్ చేయడానికి సంబంధించిన హౌస్ లిస్టింగ్ దశ షెడ్యూల్ చేసింది. అయితే కోవిడ్-19 వ్యాప్తి కారణంగా దీన్ని వాయిదా వేశారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల జరిగే నేపథ్యంలో 2024లో జనాభా గణన చేపట్టే అవకాశం లేదని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఎన్యుమరేటర్ల ద్వారా కాకుండా సొంతంగా జనాభా గణన ఫారమ్‌ను పూరించే హక్కును వినియోగించుకోవాలనుకునే పౌరులకు ఎన్‌పీఆర్‌ను తప్పనిసరి చేశారు. ఇందుకు సెన్సస్ అథారిటీ స్వీయ గణన పోర్టల్‌ను రూపొందించగా.. అది ఇంకా ప్రారంభం కాలేదు. స్వీయ-గణన సమయంలో, ఆధార్ లేదా మొబైల్ నంబర్ తప్పనిసరిగా సేకరిస్తారు.

# రైల్వే కారిడార్లకు గ్రీన్ లైట్

2.52
లక్షల కోట్ల రూపాయలతో రైలు బడ్జెట్ కూత

దేశంలో 40,000 సాధారణ రైలు బోగీలను వందే భారత్ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరించనున్నట్లు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రయాణికుల భద్రత, సదుపాయాలు, సౌకర్యాలను పెంపొందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. వందే భారత్, అమృత్ భారత్ రైళ్లు విజయవంతం కావడం ఇతర బోగీలను సైతం ఆధునీకరించాల్సిన అవసరాన్ని వెల్లడించిందని రైల్వే మంత్రి అశ్వనీ కుమార్ పేర్కొన్నారు. 'మన వద్ద దాదాపు 40,000 సంప్రదాయ బోగీలున్నాయి. వీటిని ఆధునీకరించవచ్చు. రైల్వేల సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గతేడాది రైల్వేలు 5,200 కి.మీ. మేర నూతన మార్గాన్ని అందుబాటులోకి తెచ్చాయి. ఇది మొత్తం స్విట్జర్లాండ్ నెట్‌వర్క్ పరిమాణంతో సమానం. ఈ ఏడాది మరో 5,500 కి.మీ. నిర్మాణం జరుగుతుంది. 2014లో రోజుకు కేవలం నాలుగు కి.మీ. నుంచి ఇప్పుడు 15 కి.మీ. మేర కొత్త ట్రాక్‌లను నిర్మిస్తున్నాం. నెట్‌వర్క్ ఏర్పాటులో ఇది గణనీయమైన పురోభివృద్ధి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి నాటికి మూలధన వ్యయంలో రైల్వేలు 82 శాతం ఆర్జించాయి' అని అశ్వనీ కుమార్ తెలిపారు.

### 40 వేల బోగీలు ఇక 'వందే భారత్'


న్యూఢిల్లీ: సరుకు రవాణాను సులభతరం చేస్తూ బడ్జెట్‌లో ప్రకటించిన మూడు మల్టీ మోడల్ ఆర్థిక కారిడార్ల నిర్మాణంతో రైలు ప్రయాణికుల టికెట్ వెయిటింగ్ లిస్ట్ కష్టాలు తీరనున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. రైల్వేల సరుకు రవాణా సామర్థ్యాన్ని మెరుగుపరచి జీడీపీ వృద్ధి రేటును పరుగులు తీయించేందుకు ప్రత్యేకంగా మూడు ఆర్థిక కారిడార్లను నెలకొల్పనున్నట్లు బడ్జెట్‌లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇంధనం, ఖనిజాలు, సిమెంట్ కారిడార్లు, పోర్టు కనెక్టివిటీ కారిడార్లు, అధిక రద్దీ సాంద్రత కారిడార్లు ఇందులో ఉంటాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో రైల్వే శాఖకు రూ.2.52 లక్షల కోట్లు కేటాయించారు. బడ్జెట్ కేటాయింపులపై రైల్వే మంత్రి అశ్విని కుమార్ గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆర్థిక కారిడార్లలో భాగంగా కొత్తగా 40,000 కి.మీ. మేర రైల్వే ట్రాక్‌ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇది నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు 2030-31 నాటికి ప్రయాణికులకు టికెట్ వెయిటింగ్ ఇబ్బందులను తొలగిస్తుందన్నారు. మూడు కారిడార్లపై బడ్జెట్‌లో ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఇవి కేవలం సరుకు రవాణా కోసం మాత్రమే కాకుండా మల్టీ మోడల్ కారిడార్ల మాదిరిగా పని చేస్తాయన్నారు. ప్రత్యేక కారిడార్లలో భాగంగా 434 ప్రాజెక్టులను సుమారు రూ.11 లక్షల కోట్ల వ్యయంతో చేపడుతున్నట్లు తెలిపారు.

3 మల్టీ మోడల్ ఆర్థిక కారిడార్లతో కొత్తగా 40,000 కి.మీ. ట్రాక్‌ల నిర్మాణం

తీరనున్న టికెట్ వెయిటింగ్ కష్టాలు.. ప్రయాణికులకు ఊరట

దూసుకెళ్లనున్న సరుకు రవాణా

వందే భారత్ ప్రమాణాలకు అనుగుణంగా 40 వేల సాధారణ బోగీల మార్పు




'ప్రధానంగా ఇంధనం, లోహాలు, సిమెంట్ కారిడార్లు రహదారులపై కాలుష్యాన్ని తగ్గిస్తాయి. సరుకు రవాణా చౌకగా జరుగుతుంది. ఓడ రేవులతో రైలు మార్గం అనుసంధానం కూడా అవుతుంది' అని రైల్వే మంత్రి చెప్పారు. మూడో కారిడార్‌ను అమృత చతుర్భుజంగా అభివర్ణించారు. 'రైల్వే ట్రాఫిక్ సాంద్రత అధికంగా ఉండే రూట్లలో అమృత చతుర్భుజం ఏర్పాటవుతుంది. రానున్న 6 నుంచి 8 సంవత్సరాలలో మూడు కారిడార్ల ద్వారా మొత్తంగా దాదాపు 40 వేల కి.మీ. మేర కొత్తగా రైల్వే ట్రాక్‌లను నిర్మిస్తాం. దీనిద్వారా రైల్వేల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. మన ఆర్థిక వ్యవస్థలో ఇది విప్లవాత్మక మార్పు తెస్తుంది. అంతేకాకుండా ఇది 90 శాతం కర్బన ఉద్గారాలను తగ్గిస్తుంది. రైల్వేలు అత్యంత కాలుష్య రహిత రవాణా మార్గాలు. ఇతర మార్గాలతో పోలిస్తే రైలు రవాణా 40 - 50 శాతం చౌక' అని అశ్వనీ కుమార్ తెలిపారు.


### అమృత చతుర్భుజం..

## రైల్వే బడ్జెట్‌లో ఏపీకి రూ.9,138 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైల్వే అభివృద్ధి నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,138 కోట్లు కేటాయించినట్లు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. 2009-14 కాలంతో పోలిస్తే 2023-24 నాటికి పదేళ్లలో కేటాయింపు పది రెట్లు పెరిగిందన్నారు. అదే సమయంలో తెలంగాణకు రూ.5,071 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 2009-14లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.886 కోట్లు మాత్రమే కేటాయింపులు జరిగాయని ఆయన గుర్తుచేశారు. ఇక విశాఖపట్నం రైల్వేజోన్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. పార్లమెంటులో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రైల్‌భవన్‌లో అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

- 2009-14 మధ్య 73 కిలోమీటర్ల మేర నూతన ట్రాక్ నిర్మాణం జరిగితే 2014-24 మధ్య 152 కిలోమీటర్ల ట్రాక్ నిర్మాణం జరిగింది. 2024-25లో 246 కిలోమీటర్ల ట్రాక్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకు సంబంధించిన పనులను ఆమోదించాం.
- అలాగే, 2009-14 కాలంలో 37 కిలోమీటర్ల మేర విద్యుదీకరణ జరిగితే 2014-24 మధ్య 195 కిలోమీటర్లు విద్యుదీకరణ చేశాం. రాష్ట్రంలో రైల్వేలైన్ల విద్యుద్దీకరణ ఇప్పటికే 97శాతం పూర్తయ్యింది. 2024-25లో 100శాతం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.
- రూ.68,059 కోట్ల విలువతో 5,332 కిలోమీటర్ల మేర 33 ప్రాజెక్టుల (నూతన ట్రాక్)కు సంబంధించి పనులు పురోగతిలో ఉన్నాయి.
- అదేవిధంగా రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం 88 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, 74 లిఫ్టులు, 40 ఎస్కలేటర్లు ఏర్పాటుచేశాం.
- స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి' పథకంలో భాగంగా 103 రైల్వేస్టేషన్లలో 109 స్టాళ్లను ఏర్పాటుచేశాం.
- అమృత్ భారత్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో 72 రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నారు.






# GYAN

గరీబ్ | యువ | అన్నదాత | నారీ

# పద్దు!

**ఈ నాలుగు వర్గాలే ప్రాధాన్యతగా ముందుకు**

**బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

**2047 నాటికి దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చడమే లక్ష్యమని వెల్లడి**

**న్యూఢిల్లీ:** దేశ సుస్థిర, సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా, దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశంలో పేదలు, యువత, రైతులు, మహిళల సాధికారత, సంక్షేమమే తమ ప్రాధాన్యత అని ప్రకటించారు. గత పదేళ్లలో అభివృద్ధి ఎంతో వేగం పుంజుకుందని పేర్కొన్నారు. ఆమె గురువారం పార్లమెంటులో 2024–25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సీతారామన్ ప్రసంగ సారాంశం ఆమె మాటల్లోనే..

''గత పదేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ సకారాత్మకంగా గణనీయ మార్పు సాధించింది. దేశ ప్రజలు ఎంతో ఆశగా, నమ్మకంతో భవిష్యత్తు వైపు చూస్తున్నారు. ప్రజల ఆశీర్వాదంతో, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఎన్నో సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొంది. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' మంత్రంతో, ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో ముందడుగు వేస్తోంది. ఆర్థిక వ్యవస్థ నూతన శిఖరాల దిశగా సాగుతోంది. రెండోసారి ఘన విజయం సాధించిన తర్వాత మోదీ సర్కారు.. 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్' మంత్రాన్ని చేపట్టి దేశంలోని అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి చర్యలు చేపట్టింది. అవినీతి, బంధుప్రీతి తగ్గాయి. సామాజిక న్యాయం అందుతోంది.

**ఆత్మనిర్భర్ భారత్‌తో అమృత కాలానికి..**

ప్రపంచాన్ని వణికించిన మహమ్మారి విసిరిన సవాళ్లను ఎదుర్కొని.. ఆత్మనిర్భర్ భారత్‌తో అమృతకాలానికి పునాదులు వేసుకున్నాం. అద్భుతమైన భవిష్యత్తు దిశగా సాగుతున్నాం. అందరికీ ఇళ్లు, ప్రతి ఇంటికీ నీళ్లు, విద్యుత్, వంటగ్యాస్, బ్యాంకు ఖాతాలు వంటివాటితో దేశంలోని ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి.

**వికసిత్ భారత్ దిశగా..**

అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ప్రజలందరికీ సమాన అవకాశాలతో ప్రకృతితో కలసి సాగుతూ.. 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపొందే దిశగా అడుగులు వేస్తాం. వచ్చే ఐదేళ్లలో అనూహ్య ప్రగతి సాధించబోతున్నాం. మనకు అవకాశాలకు కొదవలేదు. ఆకాశమే హద్దు. ఈ అద్భుతమైన పనితీరు చూపిన మా ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాం. 'వికసిత భారత్' దిశగా చేపట్టే రోడ్‌మ్యాప్‌ను జూలైలో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌లో వెల్లడిస్తాం.

**ప్రపంచవ్యాప్తంగా సవాళ్లు ఎదురవుతున్నా..**

కొన్నేళ్లుగా యుద్ధాలు, వివాదాలతో ప్రపంచ పరిణామాలు సంక్లిష్టంగా మారుతున్నాయి. కీలక ఖనిజాలు, సాంకేతికతలు, సరుకుల రవాణాకు ఆటంకం కలుగుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అధిక వడ్డీరేట్లు, అప్పుల భారం, పర్యావరణ సమస్యలు సవాలుగా మారుతున్నాయి. వీటిని దీటుగా ఎదుర్కొంటూ, సరైన పరిష్కారాలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్నాం.ఇండియా–మధ్యప్రాచ్య దేశాలు– యూరప్ ఎకానమిక్ కారిడార్ మనదేశానికి ఒక గేమ్ చేంజర్. ప్రపంచ వాణిజ్యానికి కీలకంగా మారనున్న ఈ కారిడార్‌కు మూలం భారత్ అన్న విషయం చరిత్రలో నిలిచిపోతుంది.

**మరిన్ని సంస్కరణలు తెస్తాం**

సుస్థిర, సమ్మిళిత ఆర్థిక అభివృద్ధి కోసం, అందరికీ అవకాశాలు అందించడం కోసం మరిన్ని సంస్కరణలు తెస్తాం. రాష్ట్రాలు, ఇతర భాగస్వాములతో చర్చించి అమలు చేస్తాం. ప్రపంచంతో పోటీపడేలా పరిశ్రమలకు తోడ్పాటుఅందిస్తాం. తూర్పు ప్రాంతం, అక్కడి ప్రజలు దేశ అభివృద్ధిని ముందుండి నడిపించేలా దృష్టిసారిస్తాం.

**లక్షాధికారులను చేసేలా..**

83 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలతో 9 కోట్ల మంది ప్రయోజనం పొందుతున్నారు. వారిలో కోటి మంది ఇప్పటికే లక్షాధికారులు (లక్‌పతి దీదీ) అయ్యారు. త్వరలో మూడు కోట్ల మందిని 'లక్‌పతి దీదీ'గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

**నాలుగు వర్గాలకు ప్రాధాన్యత**

పేదలు, మహిళలు, యువత, రైతులు.. ఈ నాలుగు వర్గాల అవసరాలు, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ నాలుగు వర్గాల వారికి ప్రభుత్వ మద్దతు అవసరం. వారు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుంది.

**జీడీపీ అంటే.. ఈ మూడు.. :** స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో దేశం దూసుకుపోతోంది. అదే సమయంలో కీలకమైన మరో మూడు అంశాల 'జీడీపీ.. గవర్నెన్స్ (పరిపాలన), డెవలప్‌మెంట్ (అభివృద్ధి), పర్ఫార్మెన్స్ (పనితీరు)'పై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజలే కేంద్రంగా పారదర్శక, బాధ్యతాయుతమైన పరిపాలన అందించేందుకు.. సమ్మిళిత అభివృద్ధి కోసం కృషి చేస్తోంది.

## పేదలకు మరో రెండు కోట్ల ఇళ్లు

- పీఎం ఆవాస్ యోజన ద్వారా గత ఐదేళ్లలో మూడు కోట్ల ఇళ్లను నిర్మించాలన్న లక్ష్యానికి దాదాపు పూర్తి చేసుకుంటున్నాం. వచ్చే ఐదేళ్లలో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మిస్తాం.
- రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు ద్వారా కోటి ఇళ్లకు ప్రతినెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుంది. ప్రజలకు ఏటా రూ.15 వేల నుంచి రూ.18 వేలు ఆదా అవుతాయి. దీనితో ఎంతో మందికి ఉపాధి కూడా లభిస్తుంది.
- అద్దె ఇళ్లలో నివసిస్తున్న మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు త్వరలో కొత్త పథకాన్ని ప్రారంభిస్తాం.
- దేశంలో మెడికల్ కాలేజీల సంఖ్యను గణనీయంగా పెంచుతాం. దీనిపై ప్రతిపాదనల కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తాం.
- మహిళల్ల సర్వైకల్ కేన్సర్ నివారణ కోసం 9–14 ఏళ్ల మధ్య వయసు బాలికలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడతాం.
- గర్భిణులు, శిశువుల సంక్షేమం, పోషకాహారం అందించడం కోసం అంగన్‌వాడీలను 'సక్షం అంగన్‌వాడీ అండ్ పోషణ్ 2.0'గా అప్‌గ్రేడ్ చేస్తాం.
- చిన్నారుల్లో వ్యాధుల నివారణ కోసం టీకాల కార్యక్రమాన్ని విస్తృతం చేస్తాం.
- ఆశా, అంగన్‌వాడీ వర్కర్లకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని వర్తింపజేస్తాం.
- రైతులకు ప్రయోజనం కలిగేలా ఫుడ్ ప్రాసెసింగ్, పంటల నిల్వ, రవాణా సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తాం. నానో డీఏపీ వినియోగాన్ని పెంచుతాం.
- వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఇతర నూనె గింజల దిగుబడి పెరిగేలా పరిశోధన, ఆధునిక వ్యవసాయ విధానాలపై పరిశోధనలను ప్రోత్సహిస్తాం.
- పశువుల్లో ఫుట్ అండ్ మౌత్ వ్యాధి నియంత్రణకు చర్యలు చేపడతాం.
- మత్స్య పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఐదు సమీకృత ఆక్వాపార్క్‌లను ఏర్పాటు చేస్తాం.
- సరికొత్త టెక్నాలజీల రూపకల్పన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు రూ.లక్ష కోట్లతో కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తాం.
- రక్షణ రంగం కోసం డీప్–టెక్ సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి కొత్త పథకాన్ని ప్రారంభిస్తాం.
- దేశంలో పర్యాటకాన్ని పెంచేందుకు ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఇందుకోసం రాష్ట్రాలకు వడ్డీ రహిత రుణాలు ఇస్తాం.

## పేదల సంక్షేమమే.. దేశ సంక్షేమం..

పేదలకు సాధికారత కోసం ప్రభుత్వం వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేసింది. ఫలితంగా గత పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రభుత్వం వివిధ పథకాల కింద రూ.34 లక్షల కోట్లను నేరుగా జన్‌ధన్ ఖాతాల్లో జమ చేసింది. దీని ద్వారా వృధా వ్యయం, అక్రమాలకు చెక్‌పడి ప్రభుత్వానికి రూ.2.7లక్షల కోట్లు మిగిలాయి. పీఎం స్వానిధి పథకం ద్వారా 78 లక్షల మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించాం. పీఎం జన్‌మన్ యోజన ద్వారా ఆదివాసీలు, విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతివృత్తుల వారు ప్రయోజనం పొందారు.

## రైతులు మనకు అన్నదాతలు

దేశంలో రైతు కేంద్రిత విధానాలు అమలు చేస్తున్నాం. పంటలకు మద్దతు ధరలను క్రమంగా పెంచుకుంటూ వస్తున్నాం. కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా దేశవ్యాప్తంగా 11.8కోట్ల మంది రైతుల ఖాతాల్లో ఏటా నగదు జమ అవుతోంది. నాలుగు కోట్ల మంది రైతులకు ఫసల్ బీమా యోజన అందుతోంది. ఈనామ్ ద్వారా 1,361 మార్కెట్లతో 1.8 కోట్ల మంది రైతులకు సేవలు అందుతున్నాయి.

## యువత సాధికారతతోనే దేశ శ్రేయస్సు

యువతకు తగిన ప్రోత్సాహాన్ని, సాధికారతను అందించడంపైనే దేశ శ్రేయస్సు ఆధారపడి ఉంది. ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానం–2020 దేశంలో గుణాత్మక సంస్కరణలకు మార్గం వేసింది. పీఎంశ్రీ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతోంది. స్కిల్ ఇండియా మిషన్ ద్వారా 1.4కోట్ల మంది యువత శిక్షణ పొందారు. ప్రభుత్వం ఏడు ఐఐటీలు, 16 ట్రిపుల్ ఐటీలు, 7 ఎయిమ్స్, 390 యూనివర్సిటీలతోపాటు 3 వేల కొత్త ఐటీఐలను నెలకొల్పింది. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు పీఎం ముద్రా యోజన ద్వారా 22.5 లక్షల కోట్ల రుణా లు అందించాం. స్టార్టప్ ఇండియా, స్టార్టప్ క్రెడిట్ గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పుడు వారు 'ఉద్యోగ దాత'లు అవుతున్నారు. క్రీడలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహానికి.. ఆసియన్ గేమ్స్‌లో మన క్రీడాకారులు సాధించిన పతకాలే నిదర్శనం.

## నారీ శక్తి ముందడుగు..

గత పదేళ్లలో మహిళల సాధికారత, ఆత్మగౌరవం కోసం తీసుకున్న చర్యలతో 'నారీ శక్తి' ముందడుగు వేస్తోంది. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు 30 కోట్ల ముద్ర రుణాలు అందించాం. ఉన్నత విద్యను అభ్యసించే మహిళలు 28శాతం పెరిగారు. 'స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథ్స్)' కోర్సుల్లో చేరుతున్నవారిలో 43శాతం మంది మహిళలే. ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఇవన్నీ ఉద్యోగాలు/ఉపాధిలో మహిళ భాగస్వామ్యం పెంచాయి. ట్రిపుల్ తలాక్ రద్దు, లోక్‌సభ/అసెంబ్లీలలో మూడో వంతు రిజర్వేషన్లు, పీఎం ఆవాస్ యోజన కింద 70శాతం మహిళా లబ్ధిదారులకే మంజూరు వంటివి మహిళల ఆత్మగౌరవానికి తోడ్పడుతున్నాయి.



# దేశీయ పర్యాటక కేంద్రాల అభివృద్ధి

**ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పెరుగుతాయి**

**టూరిస్ట్ కేంద్రాల అభివృద్ధికి రాష్ట్రాలకు లోన్లు**

**న్యూఢిల్లీ:** దేశీయ పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు పోర్టు కనెక్టివిటీ, పర్యాటక మౌలిక వసతులు, ఇతర సదుపాయాలను లక్షద్వీప్‌తో పాటు మన దీవుల్లో ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దీంతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. మన ఆర్థిక బలం దేశాన్ని వ్యాపార, కాన్ఫరెన్స్ టూరిజంనకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మార్చిందని చెప్పారు. పర్యాటకం వైపు దేశ మధ్యతరగతి ప్రజలు కూడా ఆకర్షితులు అవుతున్నారని అన్నారు. పర్యాటకం, అలాగే ఆధ్యాత్మిక పర్యాటకంతో స్థానిక వ్యాపారాలకు అవకాశం పెరుగుతుందని చెప్పారు. మంచి టూరిస్ట్ సెంటర్లను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్రాలను ప్రోత్సహిస్తామన్నారు. ఇలాంటి అభివృద్ధి కోసం రాష్ట్రాలకు వడ్డీలేని దీర్ఘకాలిక లోన్లను ఇస్తామని తెలిపారు. టూరిస్ట్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలకు, సేవలకు రేటింగ్ ఇచ్చేందుకు ఒక ఫ్రేమ్ వర్క్‌ను రూపొందిస్తామన్నారు. అరవై ప్రాంతాల్లో జీ20 సదస్సులను విజయవంతంగా నిర్వహించడం ద్వారా భారతదేశంలోని భిన్నత్వం ప్రపంచానికి తెలిసిందన్నారు.

**'లక్షద్వీప్'ప్రస్తావన...**

పర్యాటక కేంద్రాల అభివృద్ధి విషయంలో లక్షద్వీప్‌ను ఆర్థిక మంత్రి ప్రత్యేకంగా ప్రకటించడం పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది. జనవరి 4న ప్రధాని మోదీ లక్షద్వీప్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. అడ్వెంచర్ టూరిజం ఇష్టపడేవారు లక్షద్వీప్‌ను కూడా తమ జాబితాలో చేర్చుకోవాలని అప్పట్లో పేర్కొన్నారు. ప్రధాని పర్యటనపై మాల్దీవులకు చెందిన ఓ మంత్రి, ఇతర నేతలు అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయడం, దానిపై వివాదం చెలరేగడం తెలిసిందే. ఈ నేపథ్యంలో చాలా మంది భారత టూర్ ఆపరేటర్లు మాల్దీవుల పర్యటనను రద్దు చేశారు.



## ఇదీ బడ్జెట్ సమగ్ర స్వరూపం (అంకెలు రూ.కోట్లలో)

| అంశం | 2022-23 వాస్తవ గణాంకాలు | 2023-2024 బడ్జెట్ అంచనాలు | 2023-2024 సవరించిన అంచనాలు | 2024-2025 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| 1. రెవెన్యూ వసూళ్లు | 23,83,206 | 26,32,281 | 26,99,713 | 30,01,275 |
| • పన్ను ఆదాయం | 20,97,786 | 23,30,631 | 23,23,918 | 26,01,574 |
| • పన్నేతర ఆదాయం | 2,85,421 | 3,01,650 | 3,75,795 | 3,99,701 |
| 2. మూలధన వసూళ్లు | 18,09,951 | 18,70,816 | 17,90,773 | 17,64,494 |
| • రుణాల రికవరీ | 26,161 | 23,000 | 26,000 | 29,000 |
| • ఇతర వసూళ్లు | 46,035 | 61,000 | 30,000 | 50,000 |
| • అప్పులు, ఇతర వసూళ్లు | 17,37,755 | 17,86,816 | 17,34,773 | 16,85,494 |
| మొత్తం ఆదాయం (1+2) | 41,93,157 | 45,03,097 | 44,90,486 | 47,65,768 |
| మొత్తం వ్యయం (3+6) | 41,93,157 | 45,03,097 | 44,90,486 | 47,65,768 |
| 3. రెవెన్యూ ఖాతా | 34,53,132 | 35,02,136 | 35,40,239 | 36,54,657 |
| 4. వడ్డీ చెల్లింపులు | 9,28,517 | 10,79,971 | 10,55,427 | 11,90,440 |
| 5. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు | 3,06,264 | 3,69,988 | 3,21,190 | 3,85,582 |
| 6. మూలధన ఖాతా | 7,40,025 | 10,00,961 | 9,50,246 | 11,11,111 |
| వాస్తవ మూలధన వ్యయం (5+6) | 10,46,289 | 13,70,949 | 12,71,436 | 14,96,693 |
| 7. రెవెన్యూ లోటు (3-1) | 10,69,926 | 8,69,855 | 8,40,527 | 6,53,383 |
| 8. నికర రెవెన్యూ లోటు (7-5) | 7,63,662 | 4,99,867 | 5,19,337 | 2,67,801 |
| 9. ద్రవ్య లోటు | 17,37,755 | 17,86,816 | 17,34,773 | 16,85,494 |
| 10. ప్రాథమిక లోటు | 8,09,238 | 7,06,845 | 6,79,346 | 4,95,054 |

# స్కూళ్లకు నిధులు

## యూజీసీకి 60 శాతం కోత

**న్యూఢిల్లీ:** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)కి కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో గ్రాంట్లను 60.99 శాతం మేర కోత వేసింది. గత ఏడాది సవరించిన అంచనాల ప్రకారం రూ.6,409 కోట్లు కేటాయించగా, ఈసారి కేవలం 2,500 కోట్లు కేటాయించింది. అయితే, 2024–25 బడ్జెట్‌లో స్కూళ్లకు కేటాయింపులు పెంచింది. పాఠశాల విద్యకు గత ఏడాది సవరించిన అంచనాల (రూ.72473.80) కన్నా దాదాపు రూ.500 కోట్ల మేర పెంచి 73008.10 కోట్లు కేటాయించింది. ఉన్నత విద్యకు మాత్రం గత ఏడాది రూ.57244.48 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.9,600 కోట్లు కోతవేసి 47619.77 కోట్లు కేటాయించడం గమనార్హం. కేంద్రం ఐఐఎంలకు వరుసగా రెండో ఏడాది కూడా కోత విధించింది. గత ఏడాది సవరించిన అంచనాల మేరకు రూ.608.23 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారు. అలాగే, ఐఐటీలకు గత ఏడాది సవరించిన అంచనాల మేరకు రూ.10384.21 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.10324.50 కోట్లు కేటాయించారు. అలాగే, కేంద్ర విశ్వవిద్యాలయాలకు నిధులను 28 శాతం పెంచారు. వీటికి గత ఏడాది రూ.12000.08 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ.15472 కోట్లు కేటాయించడం విశేషం. కాగా, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే గ్రాంట్లను రూ.8,200 కోట్ల మేర పెంచగా, కేంద్రపాలిత ప్రాంతాలకు రూ.308 కోట్ల మేర పెంచారు.

### 390 వర్సిటీలు... 3000 ఐటీఐలు

2014 నుంచి ఇప్పటివరకు పదేళ్లలో పెద్ద ఎత్తున ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 7 ఐఐటీలు, 16 ఐఐఐటీలు, 7 ఐఐఎంలు, 15 ఎయిమ్స్ విద్యాసంస్థలను, 390 యూనివర్సిటీలను ఏర్పాటుచేసినట్లు బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. అలాగే, 3,000 ఐటీఐలను కూడా స్థాపించామన్నారు. యువతను ఎంతవరకు సాధికారికంగా మార్చామన్నదానిపై మన ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. సంస్కరణలకు జాతీయ విద్యావిధానం–2020 నాంది పలుకుతోందని, 'పీఎం శ్రీ'పథకం ద్వారా నాణ్యమైన బోధనను అందించడంతోపాటు విద్యార్థులను మరింత ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. స్కిల్ ఇండియా మిషన్ కింద మూడువేల ఐటీఐలను ఏర్పాటుచేసి ఇప్పటివరకు 1.4 కోట్ల మందికి శిక్షణ ఇచ్చామని, 54 లక్షల మంది యువకుల ప్రతిభకు మెరుగులు దిద్దామని తెలిపారు.





# దేశ భవిష్యత్తును సృష్టించే బడ్జెట్

**యువత ఆకాంక్షలను ప్రతిబింబిస్తోంది**

**మధ్యంతర బడ్జెట్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు**

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ 'వికసిత భారత్' నాలుగు స్తంభాలైన యువత, పేదలు, మహిళలు, రైతులను మరింత శక్తివంతం చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొ న్నారు. ఈ బడ్జెట్ దేశ భవిష్యత్తును సృష్టించే బడ్జెట్ అని కొనియాడారు. గురువారం బడ్జెట్ అనంతరం ఆయన టీవీలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 2047 నాటికి 'వికసిత భారత్'పునాదిని బలోపేతం చేసే హామీని ప్రస్తుత బడ్జెట్ ఇస్తోందని చెప్పారు. ఇది మధ్యంతర బడ్జెట్ అయినప్పటికీ సమగ్రంగా, వినూత్నంగా ఉందని, దేశ పురోభివృద్ధిపై పూర్తి విశ్వాసాన్ని కలిగిస్తోందని ప్రశంసించారు. భారతదేశ యువ త ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని వెల్లడించారు. పరిశోధన, ఆవిష్కరణల కోసం బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించిన ట్లు తెలిపారు. స్టార్టప్ కంపెనీలకు పన్ను మినహాయింపులు ప్రకటించినట్లు గుర్తుచేశారు. గ్రామాలు, నగరాల్లో పేదల కోసం 4 కోట్లకు పైగా ఇళ్లు నిర్మించామని, మరో 2 కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. తొ లుత 2 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి దీదీ'లుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించకున్నామని, ఆ సంఖ్యను 3 కోట్లకు పెంచామని వివరించారు. ఆయుష్మాన్ భారత్ పథకం పేదల కు ఎంతగానో ఉపయోగపడిందని, ఇకపై అంగన్‌వాడీ సభ్యు లు, ఆశావర్కర్లు సైతం లబ్ధి పొందుతారని పేర్కొన్నారు.

**యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు**

తాజా బడ్జెట్‌లో ద్రవ్య లోటును అదుపులో ఉంచుతూనే మూలధన వ్యయాలను భారీగా పెంచినట్లు నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మూలధన వ్యయం కోసం రూ.11,11,111 కోట్లు కేటాయించారని, ఆర్థికవేత్తల భాషలో చెప్పాలంటే ఇది తీపి కబురేనని వ్యాఖ్యానించారు. దీనివల్ల 21వ శతాబ్దంలో ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతుందని, కోట్లాది మంది యువతకు నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 'వందేభారత్ స్టాండర్డ్'కింద 40 వేల ఆధునిక కోచ్‌లను తయారుచేసి, సాధారణ ప్యాసింజర్ రైళ్లలో చేర్చాలని బడ్జెట్‌లో ప్రకటించారని, ఇది దేశవ్యాప్తంగా ప్రయాణ సౌలభ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని వెల్లడించారు.

## కోటి కుటుంబాలకు ఉచిత విద్యుత్

పేద, మధ్య తరగతి వర్గాలకు సాధికారత కల్పించడం, వారికి కొత్త ఆదాయ అవకాశాలను సృష్టించడంపై బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రధాని మోదీ చెప్పారు. సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్ల ద్వారా కోటి కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందుతుందని అన్నారు. మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా ప్రజలు ఏటా రూ.15 వేల నుంచి రూ.18 వేల అదనపు ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. ఆదాయపు పన్ను ఉపశమన పథకంతో దాదాపు కోటి మంది మధ్యతరగతి ప్రజలకు గణనీయమైన లబ్ధి కలుగుతుందన్నారు. నానో డీఏపీ వినియోగం, పశువుల కోసం కొత్త పథకం, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ఆత్మనిర్భర్ ఆయిల్ సీడ్ అభియాన్ వంటి పథకాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని, ఖర్చులు తగ్గుతాయని వివరించారు.



## స్టార్టప్‌లకు పన్ను ప్రయోజనాలు.. మరో ఏడాది

అంకుర సంస్థలకు, వాటిలో సావరీన్ వెల్త్ లేదా పెన్షన్ ఫండ్లు చేసే పెట్టుబడులకు ఇస్తున్న పన్ను పరమైన ప్రయోజనాలను కేంద్రం మరో ఏడాది పాటు 2025 మార్చి వరకు పొడిగించింది. వాస్తవానికి ఇవి ఈ ఏడాది మార్చి 31తో ముగియాల్సి ఉంది. దేశీయంగా స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నట్లు బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పటివరకు 1.17 లక్షల స్టార్టప్‌లను గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన అంకుర సంస్థలు స్టార్టప్ ఇండియా యాక్షన్ ప్లాన్ కింద పన్నులపరమైన ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు.



## పన్ను మినహాయింపును పెంచాలి..

సంక్రమించని వ్యాధులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వీటి నివారణలో భాగంగా ఆరోగ్య సంరక్షణ కోసం పన్ను మినహాయింపును పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రస్తుతం ఉన్న ఆసుపత్రుల మౌలిక వసతులను ఉపయోగించుకోవడం ద్వారా వైద్య విద్యను పెంపొందించే వ్యూహాన్ని స్వాగతిస్తున్నాను. వైద్య, నర్సింగ్ కళాశాలల సంఖ్యను అధికం చేయడానికి మార్గం సుగమం కావడంతోపాటు పారా–మెడికల్ శిక్షణ సామర్థ్యం కూడా పెరుగుతుంది.

– ప్రతాప్ సి రెడ్డి, చైర్మన్, అపోలో హాస్పిటల్స్







# మధ్య తరగతికి... సొంతింటి వరం!

- ఇళ్ల నిర్మాణం కోసం ప్రత్యేక పథకం
- పేదలకు మరో రెండు కోట్ల ఇళ్లు
- రియల్టీలో డిమాండ్ బూస్ట్
- పెరగనున్న ఉపాధి కల్పన
- స్వాగతించిన పరిశ్రమ వర్గాలు

**న్యూఢిల్లీ:** దేశ హౌసింగ్ రంగానికి మరింత ఊతమిచ్చే దిశగా ఆర్థిక మంత్రి సీతారామన్ కీలక ప్రకటన చేశారు. కరోనా అనంతరం సొంతిళ్ల కోసం డిమాండ్ పెరగ్గా.. దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా హౌసింగ్ రంగానికి, పేద, మధ్య తరగతి వాసులకు మంత్రి తీపి కబురు చెప్పారు. ముఖ్యంగా కీలకమైన సార్వత్రిక ఎన్నికల ముందు అందుబాటు ధరల ఇళ్లకు ప్రోత్సాహంపై దృష్టి సారించారు. ''అద్దె ఇళ్లల్లో లేదా మురికివాడలు, అనధికారిక కాలనీల్లో నివసించే అర్హత కలిగిన మధ్యతరగతి ప్రజలు.. ఇంటి కొనుగోలుకు లేదా ఇంటి నిర్మాణానికి వీలుగా ప్రభుత్వం ఓ పథకాన్ని ప్రారంభిస్తుంది''అని మంత్రి సీతారామన్ తెలిపారు. అలాగే, వచ్చే ఐదేళ్ల కాలంలో పీఎం ఆవాస్ యోజన (గ్రామీణ్) పథకం కింద గ్రామీణ పేదల కోసం మరో రెండు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. ఇది రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి దోహదం చేస్తుందని, ఉపాధి కల్పనకు దారితీస్తుందని ప్రాపర్టీ డెవలపర్లు, కన్సల్టెంట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు.

### అందరికీ ఇళ్లు

''కరోనా వల్ల అవరోధాలు ఎదురైనప్పటికీ పీఎం ఆవాస్ యోజన పథకం అమలును కొనసాగించాం. మూడు కోట్ల ఇళ్ల లక్ష్యానికి చేరువలో ఉన్నాం. వచ్చే ఐదేళ్లలో మరో రెండు కోట్ల ఇళ్లను నిర్మించి ఇస్తాం''అని మంత్రి సీతారామన్ ప్రకటన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ ఇళ్లు సమకూర్చడమనే లక్ష్యంతో కేంద్ర సర్కారు 2016లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకాన్ని ప్రారంభించింది. 2024 మార్చి నాటికి 2.95 కోట్ల పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది.

### పరిశ్రమ డిమాండ్లు..

షాపూర్జీ పల్లోంజీ రియల్ ఎస్టేట్ ఎండీ, సీఈవో వెంకటేష్ గోపాలకృష్ణన్ ప్రభుత్వ చర్యలను గుర్తిస్తూనే.. ఈ రంగం పూర్తి సామర్థ్యాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు వచ్చే బడ్జెట్‌లో లక్షిత చర్యలను ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. ''పట్టణ, సుస్థిరాభివృద్ధికి ప్రకటించిన చర్యలు దేశీయ రియల్ ఎస్టేట్‌పై దీర్ఘకాలంలో సానుకూల ప్రభావం చూపిస్తాయి'' అని గోద్రేజ్ ప్రాపర్టీస్ ఎండీ, సీఈవో గౌరవ్ పాండే పేర్కొన్నారు. మూలధన వ్యయాలను పెంచడం , అందుబాటు ధరల ఇళ్లపై ప్రభుత్వం మరింతగా దృష్టి సారించడాన్ని టాటా రియల్టీ ఎండీ, సీఈవో సంజయ్ దత్ ప్రస్తావించారు. ''ఊహించినట్టుగానే బడ్జెట్‌లో భారీ ప్రకటనలు ఏవీ లేవు. కానీ, మౌలిక వసతులను మెరుగు పరచడానికి, దేశవ్యాప్త అనుసంధానతపై దృష్టిని కొనసాగించడం.. రియల్ ఎస్టేట్ వృద్ధికి మేలు చేస్తుంది''అని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి తెలిపారు.

### ప్రోత్సాహకరం..

బడ్జెట్ ప్రతిపాదనలపై క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు బొమాన్ ఇరానీ స్పందించారు. ఈ తరహా చర్యలు ప్రోత్సాహకరమని, హౌసింగ్ మార్కెట్ వృద్ధికి సాయపడతాయన్నారు. మౌలిక వసతుల అభివృద్ధిపై స్థిరమైన దృక్పథం హౌసింగ్ రంగానికి ఊతమిస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ పథకం ద్వారా హౌసింగ్ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తన మద్దతు కొనసాగించడం ప్రశంసనీయమని నరెడ్కో ప్రెసిడెంట్ జి.హరి బాబు పేర్కొన్నారు. పట్టణ మధ్యతరగతి వాసులకు కొత్త పథకాన్ని ప్రకటించడం సామాన్యుల్లోనూ, రియల్ ఎస్టేట్ పరిశ్రమలోనూ విశ్వాసాన్ని పెంచుతుందన్నారు. నూతన పథకానికి సంబంధించి మరింత స్పష్టత కోసం చూస్తున్నట్టు చెప్పారు.

## ఎన్నో సానుకూలాంశాలు..



ఆర్థిక వ్యవస్థగా, అపార వాగ్దాన వ్యవస్థగా, అభివృద్ధి చెందిన దేశం వైపు భారత్ పయనిస్తున్న విశ్వాసాన్ని ప్రదర్శిస్తోంది. గ్రామీణ, పర్యాటకం, మహిళా సాధికారత, సాంకేతికతపై దృష్టి సారించి ప్రజా పనుల కోసం మూలధన వ్యయాన్ని నిరంతరం పెంచడం పట్ల సంతోషిస్తున్నాము. రూ.1 లక్ష కోట్ల నిధి వంటి ఎన్నో సానుకూలాంశాలు ఉన్నాయి. ఇది గొప్ప బడ్జెట్.

– సంజీవ్ పురీ, చైర్మన్, ఐటీసీ.

## ప్రజాకర్షక చర్యలు ప్రకటించలేదు..



సీతారామన్ ప్రెజెంటేషన్ అతి చిన్న ప్రసంగాల్లో ఒకటి. తక్కువ మాటల్లో ఎక్కువ విషయాలు ఉన్నాయి. ఇది స్వాగతించదగినది. నిశ్శబ్ద విశ్వాసాన్ని తెలియజేస్తుంది. ఎన్నికల ముందు బడ్జెట్‌లలో సంప్రదాయంగా ఊహించినట్లుగా ఎలాంటి ప్రజాకర్షక చర్యలు ప్రకటించలేదు. ఆర్థిక లోటు లక్ష్యం అనుకున్నదానికంటే మెరుగ్గా ఉంది.

– ఆనంద్ మహీంద్రా, చైర్మన్, మహీంద్రా గ్రూప్

## భవిష్యత్తును ప్రతిబింబించేలా..



60 బిలియన్ డాలర్ల వార్షిక ఎఫ్‌డీఐ స్థాయిని మరింత పెంచడానికి కొన్ని సాహసోపేతమైన చర్యలు అవసరం. డిజిటల్ అవస్థాపనపై మరింత ఊపుతో పాటు బ్యాంకింగ్, విద్యుత్ రంగ సంస్కరణలు మెరుగైన వికసిత్ భారత్‌కు ఆవశ్యకమైనవి. మధ్యంతర బడ్జెట్ ప్రజాకర్షక చర్యలకు దూరంగా ఉన్నందున వర్తమానాన్ని చాకచక్యంగా నిర్వహిస్తూ భవిష్యత్తును ప్రతిబింబించే సమయం, దృక్పథం రెండింటినీ సూచిస్తుంది.

– జి.పి.హిందూజా, చైర్మన్, హిందూజా గ్రూప్

## ఆవిష్కరణలకు దన్ను..



దేశీ ఫార్మా 2030 నాటికి 120–130 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్న నేపథ్యంలో వర్ధమాన రంగాల్లో పరిశోధనల కోసం రూ. 1 లక్ష కోట్ల కేటాయింపనేది ఆవిష్కరణలకు దన్నుగా నిలవగలదు. వ్యాపారాల నిర్వహణను సులభతరం చేయడం, స్థానికంగా తయారీని ప్రోత్సహించే చర్యలు స్వాగతించతగ్గవి.

– సతీష్ రెడ్డి, చైర్మన్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్

## నిబద్ధతను ప్రతిబింబిస్తుంది..



వివేకవంతమైన, సమ్మిళిత బడ్జెట్. సబ్కా సాథ్ సబ్‌కా వికాస్‌కు అనుగుణంగా అవసరాలు, ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ గరీబ్ కళ్యాణ్, నారీ శక్తి, యువ (యువ సాధికారత), అన్నదాత (రైతుల సాధికారత) గురించి ఉద్ఘాటించడం ప్రభుత్వ దార్శనికత, అందరి సమగ్ర అభివృద్ధికి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

– పవన్ ముంజాల్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హీరో మోటో

# డిజిన్వెస్ట్‌మెంట్ టార్గెట్... రూ. 50,000 కోట్లు

- 2024–25లో ప్రభుత్వ లక్ష్యం
- ఈ ఏడాది రూ. 30,000 కోట్లు



**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2024–25) డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ. 50,000 కోట్ల సమీకరణ లక్ష్యాన్ని ప్రకటించారు. వెరసి ఈ ఏడాది (2023–24)కి రూ. 30,000 కోట్ల సవరించిన అంచనాలకంటే అధికంగా డిజిన్వెస్ట్‌మెంట్ టార్గెట్‌ను ప్రభుత్వం నిర్దేశించుకుంది. నిజానికి గతేడాది ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో ఆర్థిక శాఖ రూ. 51,000 కోట్ల సమీకరణకు ప్రతిపాదించింది. అయితే ఆపై ప్రభుత్వం రూ. 30,000 కోట్లకు లక్ష్యాన్ని సవరించింది. కాగా.. 2024–25 ఏడాదికి లోక్‌సభలో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రభుత్వ ఆస్తుల మానిటైజేషన్‌ను ప్రతిపాదించకపోవడం గమనార్హం! తద్వారా నిధులను సమకూర్చుకునేందుకు ఎలాంటి ప్రణాళికలనూ ప్రకటించలేదు. గత బడ్జెట్ అంచనాలలో ఈ మార్గంలో రూ. 10,000 కోట్లను అందుకోవాలని ఆకాంక్షించిన సంగతి తెలిసిందే.

### ఇదీ తీరు..

డిజిన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం 7 సీపీఎస్ఈలలో మైనారిటీ వాటాల విక్రయం ద్వారా రూ. 12,504 కోట్లను సమకూర్చుకుంది. ఈ జాబితాలో ప్రభుత్వ రంగ దిగ్గజాలు కోల్ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, ఆర్‌వీఎన్ఎల్, ఇరెడా తదితరాలున్నాయి. మార్చికల్లా వాటాల ఉపసంహరణ(డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా మొత్తం రూ. 30,000 కోట్లను అందుకోగలమని ప్రభుత్వం భావిస్తోంది. 2018–19, 2017–18ని మినహాయిస్తే.. ప్రతి బడ్జెట్‌లో ప్రతిపాదించిన డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను చేరుకోకపోవడం గమనార్హం! 2017–18కి బడ్జెట్ అంచనాలు రూ. లక్ష కోట్లు కాగా.. అంతకుమించి రూ.1,00,056 కోట్లను సమీకరించడం ద్వారా ప్రభుత్వం రికార్డు నెలకొల్పింది. ఈ బాటలో 2018–19లోనూ బడ్జెట్ అంచనాలు రూ.80,000 కోట్లను అధిగమిస్తూ సీపీఎస్ఈలలో వాటాల విక్రయం ద్వారా రూ. 84,972 కోట్ల నిధులు అందుకుంది.

# బయో–ఫౌండ్రీకి స్కీము



**న్యూఢిల్లీ:** పర్యావరణ అనుకూల చర్యల్లో భాగంగా త్వరలో బయో–తయారీ, బయో–ఫౌండ్రీ కోసం కొత్తగా స్కీమును ప్రారంభించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బయో–ఫార్మా, బయో–ప్లాస్టిక్స్, బయోడిగ్రేడబుల్ పాలిమర్స్ మొదలైన వాటికి ఇది ఊతమివ్వనుంది. ప్రపంచ ఎకానమీని మార్చేయగలిగే సత్తా ఈ స్కీముకు ఉంటుందని కేంద్ర సైన్స్, టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్‌ను సాకారం చేయాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యానికి ఇది తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. 2014లో కేవలం 10 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీ బయో ఆర్థిక వ్యవస్థ గడిచిన ఎనిమిది, తొమ్మిదేళ్లలో 140 బిలియన్ డాలర్లకు చేరిందని సింగ్ చెప్పారు.

# ఆర్‌బీఐ, బ్యాంకింగ్ నుంచి డివిడెండ్ల ధమాకా



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), బ్యాంకింగ్‌సహా ఇతర ప్రభుత్వ రంగ ఫైనాన్షియల్ సంస్థల నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1.02 లక్షల కోట్ల డివిడెండ్లు వస్తాయన్నది తాజా బడ్జెట్ అంచనా. మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2023–24 బడ్జెట్ అంచనా రూ.48,000 కోట్లయితే, ఊహించని రీతిలో రూ.1.04 లక్షల కోట్లు ఒనగూరుతాయన్నది తాజా బడ్జెట్ సవరిత అంచనా. ఆర్‌బీఐ ఒక్కటే గత ఏడాది మేలో రూ.87,416 కోట్ల డివిడెండ్ చెల్లించడంతో డివిడెండ్ రాబడులకు ఊతం లభించినట్లయ్యింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా లభించిన డివిడెండ్లు రూ.39,961 కోట్లు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈ) నుంచి ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరంలో డివిడెండ్ చెల్లింపులు రూ.43,000 కోట్లని బడ్జెట్ అంచనా. మొత్తంగా డివిడెండ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,54,407 కోట్లు ఉంటే, 2024–25లో విలువ స్వల్పంగా రూ.1.50 లక్షల కోట్లకు తగ్గుతుందని తాజా బడ్జెట్ అంచనావేసింది.

# ఎలక్ట్రిక్.. ఇక ఫుల్ చార్జ్!

## తయారీ, చార్జింగ్ ఇన్‌ఫ్రాపై కసరత్తు

**న్యూఢిల్లీ:** చార్జింగ్, తయారీ మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించనున్నట్లు వివరించారు. రవాణా కోసం ఉపయోగించే సీఎన్‌జీ లోనూ, పైపుల ద్వారా సరఫరా చేసే సహజ వాయువులోను కంప్రెస్డ్ బయోగ్యాస్‌ను కలపడం తప్పనిసరని ఆమె పేర్కొన్నారు. మరోవైపు మధ్యంతర బడ్జెట్‌లో చర్యలను స్వాగతించిన క్వాంటమ్ ఎనర్జీ ఎండీ సి. చక్రవర్తి .. కొన్ని ఆకాంక్షలు మాత్రం నెరవేరలేదని పేర్కొన్నారు. 2024 మార్చితో ముగిసిపోనున్న ఫేమ్ 2 సబ్సిడీ ప్రోగ్రామ్‌ను పొడిగిస్తారని ఆశలు నెలకొన్నప్పటికీ ఆ దిశగా ప్రతిపాదనలు లేవని ఆయన తెలిపారు. గడువు పొడిగించి ఉంటే ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమకు గట్టి మద్దతు లభించి ఉండేదన్నారు. అలాగే లిథియం అయాన్ బ్యాటరీ ప్యాక్‌లు, సెల్స్‌పై జీఎస్‌టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించి ఉంటే ఈవీల ధరలు మరింత అందుబాటు స్థాయిలోకి వచ్చేందుకు ఆస్కారం లభించేందని చక్రవర్తి తెలిపారు. సోలార్ రూఫ్‌టాప్ స్కీములు.. స్వచ్ఛ విద్యుత్ లక్ష్యాల సాధనకు తోడ్పడగలవని సీఫండ్ సహ వ్యవస్థాపకుడు మయూరేష్ రౌత్ తెలిపారు. మరోవైపు, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఫేమ్ స్కీముకు కేటాయింపులను బడ్జెట్‌లో కేంద్రం రూ. 2,671 కోట్లుగా ప్రతిపాదించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను సవరించిన అంచనాల (రూ. 4,807 కోట్లు) కన్నా ఇది 44 శాతం తక్కువ. ప్రస్తుతమున్న ఫేమ్ 2 ప్లాన్‌ను మరోసారి పొడిగిస్తారా లేదా అనే దానిపై స్పష్టత లేని పరిస్థితుల్లో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఆటోమొబైల్‌కు పీఎల్ఐ బూస్ట్ ..

వాహన పరిశ్రమకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) స్కీము కింద బడ్జెట్‌లో కేటాయింపులను కేంద్రం ఏకంగా 7 రెట్లు పెంచి రూ. 3,500 కోట్లుగా ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనా ప్రకారం ఇది రూ. 484 కోట్లు. కాగా, అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్, బ్యాటరీ స్టోరేజీకి కేటాయింపులను రూ. 12 కోట్ల నుంచి రూ. 250 కోట్లకు పెంచారు.

### ఈవీల షేర్లు అప్ ..

బడ్జెట్‌లో సానుకూల ప్రతిపాదనల నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల సంస్థల షేర్లు పెరిగాయి. బీఎస్ఈలో జేబీఎం ఆటో 2.48 శాతం పెరిగి రూ. 1,963 వద్ద, గ్రీవ్స్ కాటన్ సుమారు 1 శాతం పెరిగి రూ. 165 వద్ద ముగిశాయి. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ మాత్రం లాభాల స్వీకరణతో 0.69 శాతం క్షీణించి రూ. 1,729 వద్ద ముగిసింది. అయితే, ఒక దశలో 6 శాతం ఎగిసి 52 వారాల గరిష్టమైన రూ. 1,849 స్థాయిని తాకింది.



**ముంబై:** సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ స్టాక్ మార్కెట్‌ను మెప్పించకలేకపోయింది. మౌలిక వసతుల రంగానికి అంచనాల కంటే తక్కువ కేటాయింపులు, ఆదాయం పన్ను శ్లాబులు యథాతథంగా కొనసాగింపు నిర్ణయాలు నిరాశపరిచాయి. మరోవైపు ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య పాలసీ నిర్ణయాల వెల్లడి సందర్భంగా చైర్మన్ పావెల్ ఈ మార్చిలోనూ కీలక వడ్డీ రేట్ల తగ్గింపు ఉండకపోవచ్చనే సంకేతాలిచ్చారు. ఇన్వెస్టర్లు క్యాపిటల్ గూడ్స్, మెటల్, రియల్టీ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. ఫలితంగా సెన్సెక్స్ 107 పాయింట్లు నష్టపోయి 71,645 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 28 పాయింట్లు దిగివచ్చి 21,698 వద్ద నిలిచింది.

### ఇంట్రాడేలో ఒడిదుడుకులు...

సార్వత్రిక ఎన్నికల ముందు ప్రజాకర్షక బడ్జెట్ ఉండొచ్చనే అంచనాలతో ఉదయం స్టాక్ మార్కెట్ లాభాలతో మొదలైంది. సెన్సెక్స్ 247 పాయింట్లు పెరిగి 71,999, నిఫ్టీ 55 పాయింట్ల లాభంతో 21,781 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. జనరంజక బడ్జెట్ సమర్పణ ఆశలతో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగ సమయం(గంటసేపు)లో సెన్సెక్స్ 400 పాయింట్లు పెరిగి 72,151 వద్ద, నిఫ్టీ 107 పాయింట్లు బలపడి 21,833 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అయితే స్టాక్ మార్కెట్‌కు ఉత్సాహాన్నిచ్చే ప్రకటలేవీ వెలువడకపోవడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ పాల్పడ్డారు. ఫలితంగా ఆరంభ లాభాలు కోల్పోయిన సూచీలు చివరికి నష్టాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 576 పాయింట్ల పరిధిలో నిఫ్టీ 174 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

### మార్కెట్లో మరిన్ని సంగతులు

- బడ్జెట్ ప్రకటన రోజు గత ఆరేళ్లలో స్టాక్ మార్కెట్ నాలుగు పర్యాయాలు లాభపడగా., రెండుసార్లు నష్టాలు చవిచూసింది. 2023, 2022, 2021, 2019 ఏడాదిల్లో పెరిగింది. కాగా, 2020, 2024 ఏడాదిల్లో పతనాన్ని చవిచూసింది.
- బాండ్లపై రాబడులు తగ్గడంతో ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. పీఎస్‌బీ, ఐఓబీ, యూకో బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ షేర్లు 7–5%, కెనరా బ్యాంక్, పీఎన్‌బీ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ షేర్లు 4–3% పెరిగాయి. మహారాష్ట్ర బ్యాంక్, ఎస్‌బీఐలు 2–1% లాభపడ్డాయి. ఎన్ఎస్ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిథ్యం వహించే నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 3.11% లాభపడింది.
- రైల్వే సంబంధిత స్టాకులు ఆరంభ లాభాలు కోల్పోయి నష్టాలు మూటగట్టుకున్నాయి. ఇర్కాన్ 3.69%, రైల్వే వికాస్ నిగమ్ 3.49%, రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ 3%, జుపిటర్ వేగన్స్ 2% పతనమయ్యాయి. ఐఆర్‌సీటీసీ 1.50%, టెక్స్‌మాకో రైల్ ఇంజనీరింగ్, టిటాఘర్ రైల్వే సిస్టమ్స్ 1% నష్టపోయాయి.

## ప్చ్.. నచ్చలే!

- మెప్పించని బడ్జెట్
- ఫెడరల్ రిజర్వ్ ప్రతికూల సిగ్నల్స్
- సెన్సెక్స్ నష్టం 107 పాయింట్లు
- 21,700 స్థాయి దిగువకు నిఫ్టీ
- కీలక రంగాల్లో లాభాల స్వీకరణ
- ఎదురీదిన ప్రభుత్వ బ్యాంకు షేర్లు



చరిత్రాత్మకంగా పరిశీలిస్తే మధ్యంతర బడ్జెట్ వేళ ఈక్విటీ మార్కెట్లు పెద్దగా స్పందించలేదు. ఈ ఏడాది అదే పునరావృతమైంది. మూలధన వ్యయాలకు కేటాయింపుల స్వల్ప పెంపు, ద్రవ్య లోటు 5.5% నుంచి 5.1%కి తగ్గింపు లక్ష్యం మినహా ఉత్సాహాన్నిచ్చే ఇతర ప్రకటలేవీ వెలువడలేదు. ప్రసంగం తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చే వరకు వడ్డీరేట్ల తగ్గింపు యోచన సముచితంకాదని ఫెడ్ చైర్మన్ వ్యాఖ్యలతో అమెరికా పదేళ్ల బాండ్లపై రాబడులు 4% పెరగడం ప్రతికూల ప్రభావం చూపింది

– యస్ సెక్యూరిటీస్ ఎండీ అమర్ అంబానీ

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బాధ్యతాయుత, వినూత్న, సమిళిత మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించారు. ఆర్థిక ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ., ప్రైవేట్ మూల పెట్టుబడులకు అవకాశం కల్పించారు. జాతీయ ప్రాముఖ్యతలున్న రంగాల వృద్ధికి మరోసారి పటిష్ట పునాదులు వేశారు''

– బీఎస్ఈ ఎండీ సుందరరామన్ రామమూర్తి


నెల్లూరు ద్వారకానగర్‌లో వృద్ధురాలు మరియమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రేవతి


శ్రీకాకుళం నగరంలోని గార వీధిలో బమ్మిడి కామమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నవీన్


విశాఖపట్నంలోని సింహాచలం దరి గణేష్‌కాలనీలో దివాకర్ల భాస్కరరావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ వసంతలక్ష్మి


ప్రకాశం జిల్లా ఒంగోలు బాలాజీనగర్‌లో కోగంటి నాగమణికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాధ


ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మూర్తివీధిలో జడ దుర్గమ్మకు వితంతు పింఛన్ ఇస్తున్న వార్డు వలంటీర్ జి.శిరీష


నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో అరదేశి కంబన్నకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జదల వెంకటలక్ష్మి

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం రాచర్లలో దివ్యాంగుడు రాజయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రూనాస్సీ



# తొలిరోజు 80.35 శాతం మందికి పింఛన్ల పంపిణీ

**53.15 లక్షల మందికి అందిన రూ.1,574.70 కోట్లు**

రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి నెల పింఛన్ల పంపిణీ తొలిరోజు గురువారం 80.35 శాతం మందికి పూర్తయినట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. వలంటీర్లు సూర్యోదయానికి ముందే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ ప్రారంభించారని చెప్పారు. ప్రభుత్వం ఈ నెల 66.15 లక్షల మందికి పింఛన్ కానుకగా రూ.1,961.13 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. గురువారం రాత్రి ఎనిమిది గంటల వరకు 53.15 లక్షల మందికి (80.35 శాతం) రూ.1,574.70 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. విజయనగరం జిల్లాలో అత్యధికంగా 88.30 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. - సాక్షి, అమరావతి


అనంతపురంలో వృద్ధురాలు చెన్నమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భానుబీ


కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో దివ్యాంగుడు ఆకుల వెంకట్రావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గదుల శ్రీదేవి


ఏలూరులో జి.లక్ష్మణరావుకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కె.శిరీష


కడపలోని నబీకోటలో శ్రీ సాయికి దివ్యాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివమునీంద్ర


గుంటూరు జిల్లా తెనాలి అయితానగర్‌కు చెందిన సౌభాగ్యంకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ నరసింహారావు


విజయనగరం జిల్లా జగన్నాథపేట ఆలయ ప్రాంతంలో దివ్యాంగుడు లక్కోజు జేజీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నీరజ

## క్లుప్తంగా...

### సచివాలయాల్లోనే రేషన్ షాపుల ఆథరైజేషన్ రెన్యువల్

**పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్**

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని చౌకధరల దుకాణదారులు ఈనెల 28లోగా ధ్రువీకరణను పునరుద్ధరించుకోవాలని (ఆథరైజేషన్ రెన్యువల్) పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో మాదిరిగా రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామ/వార్డు సచివాలయంలో ఏపీ సేవా పోర్టల్ ద్వారా పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 29,851 చౌకధరల దుకాణదారులు ప్రభుత్వ ఖాతాకు నిర్దేశిత రుసుము రూ.500 చెల్లించి, ఆ చలానాతో సచివాలయానికి స్వయంగా వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దీంతో ప్రతి రెండేళ్లకు ఒకసారి సమీపంలోని సచివాలయంలోనే చౌకధరల దుకాణదారుల ధ్రువీకరణను పునరుద్ధరించుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.

### జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు సత్కారం

సాక్షి, అమరావతి: జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాలు సాధించిన విద్యార్థులను ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో సన్మానించారు. ఏటీఎల్ మారథాన్, నేషనల్ స్టూడెంట్ ఇన్నోవేషన్ చాలెంజ్, నేషనల్ స్కూల్ బ్యాండ్ కాంపిటీషన్, స్టేట్ లెవల్ విన్నర్స్ ఆఫ్ ఆన్‌ఆర్మ్ మార్చింగ్ కంటింజెంట్, నేషనల్ గ్రీన్ స్కూల్ అవార్డుతో సహా వివిధ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన తొమ్మిది మంది విద్యార్థులకు ప్రత్యేక ప్రశంసాపత్రాలతో సత్కరించారు. సత్కారాలు పొందిన విద్యార్థుల్లో కె.వర్షిణి ప్రియాంక, ఎస్.సౌజన్య, కె.అమృత వర్షిణి, ఆర్. ప్రవల్లిక, (విశాఖ జిల్లా), పి.సుహిత, బి.ఎస్.దివ్యదర్శిని(భోగోలు, నెల్లూరు జిల్లా), సీహెచ్.రోహిత్ (కొత్తఆరుగొలను, పశ్చిమ గోదావరి), బి.అవినాష్ (దుప్పలవలస, శ్రీకాకుళం), పి.కీర్తన (ముప్పాల, ఎన్టీఆర్ జిల్లా), జి.హర్షకుమార్ (పెదవేగి, ఏలూరు జిల్లా), దడాల జ్యోత్స్న (ఐఐటీ-ఎస్ఈఈటీ అకాడమి, ఈడుపుగల్లు, కృష్ణాజిల్లా) ఉన్నారు.

### దేశానికే ఆదర్శంగా నిలిచాం

**డాక్టర్ మంత్రి సీదిరి అప్పలరాజు**

సాక్షి, అమరావతి : పాడి, పశుసంవర్థక శాఖలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పలు కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలతో పాటు కేంద్రానికే ఆదర్శంగా నిలిచాయని పాడి, పశుసంవర్థక, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గత ఏడాది వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనపరిచిన అధికారులు, సిబ్బందిని పశుసంవర్థక శాఖ డైరక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్‌తో కలిసి మంత్రి సత్కరించారు. మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా పశుపోషకులకు మెరుగైన ఆదాయం, జీవన ప్రమాణాల పెంపు కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. దీంతో గత 40 ఏళ్లలో సాధించలేకపోయిన ప్రగతిని.. కేవలం నాలుగున్నరేళ్లలో సాధించగలిగామన్నారు. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల ద్వారా పశుపోషకులకు అందిస్తున్న సేవలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. పశువులకు లంపి స్కిన్ వ్యాధి వ్యాపించిన సమయంలో ఆర్బీకేల ద్వారా అందించిన సేవలు అభినందనీయమన్నారు.

## ఏలూరు 'సిద్ధం'కు చురుగ్గా ఏర్పాట్లు

**రేపు ఏలూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ**

- ఉభయగోదావరితో పాటు కృష్ణా నుంచి హాజరుకానున్న లక్షలాది మంది క్యాడర్
- 50 నియోజకవర్గాల నుంచి తరలిరానున్న పార్టీ శ్రేణులు
- జాతీయ రహదారిపై భారీ వాహనాల మళ్లింపు
- 110 ఎకరాల ప్రాంగణంలో 'సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్లు తుది దశకు
- శనివారం మధ్యాహ్నం 3 గంటలకు దెందులూరు చేరుకోనున్న సీఎం జగన్
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి కారుమూరి, తలశిల, ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/సాక్షిఅమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖారావం సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల మూడో తేదీన ఏలూరు జిల్లాలో నిర్వహించనున్న 'సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో పాటు ప్రజాప్రతినిధులు గురువారం పరిశీలించారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు సభకు తరలిరానున్న క్రమంలో ఆ మేరకు


దెందులూరు జాతీయ రహదారిపై 'సిద్ధం' సభ ఏర్పాట్లు

భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. 110 ఎకరాల సువిశాల ప్రాంగణంలో బహిరంగ సభ జరగనుంది. ఏలూరు ఆటోనగర్, దెందులూరు సమీపంలోని సహారా గ్రౌండ్స్‌లో బహిరంగ సభ వేదిక పనులు చురుగ్గా సాగుతున్నాయి. భారీ సభా వేదిక నిర్మాణం, పదుల సంఖ్యలో గ్యాలరీల ఏర్పాటు, పార్టీ శ్రేణులందరి దగ్గరకు వచ్చి అభివాదం చేసేందుకు వీలుగా పార్టీ గుర్తయిన 'ఫ్యాన్' ఆకారంలో భారీ వాక్‌వేను ఏర్పాటు చేశారు. జిల్లా చరిత్రలోనే లక్షలాది మందితో నిర్వహిస్తున్న బహిరంగ సభ కావడంతో జాతీయ రహదారిపైన ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లూ చేశారు.

**గోదావరి ప్రజలు సిద్ధం : మంత్రి కారుమూరి**

ఎన్నికలకు జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమంటే గోదావరి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని, ఉభయగోదావరి జిల్లాలు జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటాయని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

**3న దెందులూరుకు సీఎం**

'సిద్ధం' బహిరంగ సభకు ముఖ్యమంత్రి షెడ్యూల్ ఖరారైంది. మూడో తేదీ మధ్యాహ్నం 2.45 గంటలకు తాడేపల్లిలోని హెలీప్యాడ్ నుంచి బయలుదేరి 3.20 గంటలకు దెందులూరులో సభా ప్రాంగణం వెనుక భాగంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులను కలిసిన అనంతరం 3.30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుని 4.55 గంటలకు సభ ముగిస్తారు. ఐదు గంటలకు హెలికాప్టర్‌లో తాడేపల్లికి తిరుగు ప్రయాణం అవుతారు.

ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటి బిడ్డ అని, సంక్షేమాన్ని ప్రతి ఇంటికి చేర్చి దేశంలోనే సరికొత్త చరిత్ర సృష్టించిన నేత అని కొనియాడారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ దెందులూరులో జనసునామీ చూడబోతున్నారని, చంద్రబాబునాయుడు కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల్లో ఐదు ఎకరాల్లోనే సభలు పెడుతుంటే జనం రాని పరిస్థితి ఉందని, కానీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒకే ఒక పిలుపుతో 110 ఎకరాల్లో జరిగే సభకు లక్షలాది మంది తరలిరానున్నారని చెప్పారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని తదితరులు ఉన్నారు.

## రూ.12.35 కోట్ల అక్రమ నగదు స్వాధీనం

**నెల్లూరు జిల్లాలో రూ.7.23 కోట్లు • తిరుపతి జిల్లాలో రూ.5.12 కోట్లు పట్టివేత**

నెల్లూరు(క్రైమ్)/గూడూరు రూరల్: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా..రశీదులు లేకుండా అక్రమంగా తరలిస్తోన్న రూ.12.35 కోట్లను సీజ్ చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మొత్తం నగదును ఆదాయపు పన్ను శాఖకు అప్పగించనున్నట్లు తిరుపతి జిల్లా గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి గురువారం తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సరైన ధ్రువపత్రాలు లేకుండా తరలిస్తోన్న రూ.7.23 కోట్లను సీజ్ చేశారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాబి తన సిబ్బందితో ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో రాజమహేంద్రవరానికి చెందిన అప్పారావు, పవన్, దుర్గాప్రసాద్‌రెడ్డి, సాయిరామ్‌కృష్ణ, కాకినాడకు చెందిన తాతారావు, రమేష్, సత్యవేణి, మణికంఠను అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించి తనిఖీ చేయగా వారి బ్యాగ్‌ల్లో రూ.4,38,50,000 గుర్తించారు. సరైన ధ్రువపత్రాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. నెల్లూరు రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజమహేంద్రవరానికి చెందిన వికాస్, నరసింహం, సత్యనారాయణ,అరవింద్‌ను అదుపులోకి తీసుకుని వారి బ్యాగ్‌ల్లో ఉన్న రూ.1,44,50,000 స్వాధీనం చేసుకున్నారు. బంగారు వ్యాపారుల వద్ద పనిచేస్తూ పలు ప్రాంతాలకు బంగారు కొనుగోలుకు నగదుతో రాకపోకలు సాగిస్తున్నట్లు వారు చెప్పారు. వెంకటాచలం ఇన్‌స్పెక్టర్ అంకమ్మరావు వాహన తనిఖీలు చేపట్టగా ఓ ప్రైవేట్ బస్సులో విజయవాడ నుంచి పాండిచ్చేరి వెళుతోన్న పల్నాడు జిల్లా నరసారావుపేటకు చెందిన జిలాని, దావూద్, అర్షద్‌లను అదుపులోకి తీసు


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి

కున్నారు. వారి బ్యాగ్‌లో సరైన ధ్రువపత్రాలు లేకుండా తరలిస్తోన్న రూ.1,40,50,000 స్వాధీనం చేసుకున్నారు. వీరు కూడా బంగారం కొనుగోలుకు చెన్నై వెళ్తున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లాలో రశీదులు లేకుండా నగదు తరలిస్తోన్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.5.12 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. వరగలి క్రాస్ రోడ్డు వద్ద విజయవాడ వైపు నుంచి చెన్నైకి వెళుతోన్న ఓ వాహనాన్ని తనిఖీ చేయగా రూ.3,67,41,180 గుర్తించారు. పశ్చిమ గోదావరి జిల్లాకి చెందిన పీబీ. సాయిక్రిష్ణ, గుంటూరు జిల్లాకి చెందిన శ్రీధర్, మంగళగిరికి చెందిన రవి ఉన్నారు. నగదు వివరాలు వీరు చెప్పకపోవడంతో సీజ్ చేశారు. గూడూరు రూరల్ పరిధిలోని చిల్లకూరు బైపాస్ జంక్షన్ వద్ద పోలీసులు ఓ వాహనంలో మంగళగిరికి చెందిన లక్ష్మణరావు, ఖమ్మం జిల్లా పర్ణిబందంకి చెందిన మహేష్‌కుమార్ వద్ద ఎలాంటి పత్రాలు లేని రూ.95,50,000 నగదు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఒకటో పట్టణ సీఐ..రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా ఉండటంతో అతని బ్యాగును తనిఖీ చేసి రూ.50 లక్షల ఉన్నట్లు గుర్తించారు. సరైన పత్రాలు చూపకపోవడంతో ఈ నగదును సీజ్ చేశారు.

## దేశంలో టాప్-10లో ఏపీ డిస్కంలు

- జాతీయ సగటు కంటే ఏపీలో మెరుగైన విద్యుత్ సరఫరా
- ఫీడర్ అంతరాయాలతో పోల్చినా మన దగ్గర సగానికంటే తక్కువ
- 2017-18లో పంపిణీ నష్టాలు 6.70 శాతం ఉంటే ఇప్పుడు 5.31 శాతం

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు దేశ వ్యాప్తంగా ఖ్యాతి గడిస్తున్నాయి. తాజాగా రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ) ప్రకటించిన టాప్ 62 డిస్కంల జాబితాలో ఏపీ డిస్కంలు జాతీయ స్థాయిలో టాప్ 10లో నిలిచి 'ఏ' గ్రేడ్ సాధించాయని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిస్కంల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, కె.సంతోషరావులు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు 'సాక్షి'కి వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ప్రజల అవసరాలకు తగ్గట్టు రోజువారీ విద్యుత్ సరఫరాలో ఎలాంటి కోతల్లేకుండా అందిస్తూ ఏపీ రికార్డులు సృష్టిస్తోంది. దేశ సగటు విద్యుత్ సరఫరాను మించి రాష్ట్రంలో విద్యుత్‌ను అందిస్తోంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించిన వినియోగదారుల సేవా రేటింగ్ 2022-23 నివేదిక ప్రకారం.. జాతీయ సగటు విద్యుత్ సరఫరా పట్టణ ప్రాంతాల్లో 23.59 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 21.26 గంటలుగా ఉంది. కానీ మన రాష్ట్రంలో పట్టణాల్లో 23.85 గంటలు, గ్రామాల్లో 23.49 గంటల పాటు సరఫరా అందిస్తున్నారు. జాతీయ సగటు అంతరాయ సూచికతో పోల్చితే మన డిస్కంలలో సగానికంటే తక్కువగా ఫీడర్ అంతరాయాలు నమోదవుతున్నాయి.


విజయానంద్


ఐ.పృథ్వీతేజ్


కె.సంతోషరావు

**సేవలకు దక్కిన గుర్తింపు**

ఏడాదిలో ఈ జాతీయ సగటు అంతరాయ సూచిక 200.15 కాగా, ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ(ఏపీఎస్పీడీసీఎల్)లో 42, ఏపీ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ(ఏపీఈపీడీసీఎల్)లో 79.68, ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఏపీసీపీడీసీఎల్)లో 103.86 చొప్పున పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఫీడర్‌కు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. అలాగే డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీ) వైఫల్యం రేటు 2.01 శాతం మాత్రమే ఉంది. దీని జాతీయ సగటు 5.81 శాతం కంటే ఎక్కువగా ఉంది. అంతేకాకుండా 2017-18లో డిస్కంల పంపిణీ నష్టాలు 6.70 శాతం ఉంటే అవి 2022-23లో 5.31 శాతానికి తగ్గాయి. కొత్త సర్వీసులకు వంద శాతం మీటరింగ్ పూర్తి చేయడంతో పాటు రిపేర్ వచ్చిన వాటి స్థానంలో త్వరితగతిన కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. మాన్యువల్ జోక్యం లేకుండా ఇన్‌ఫ్రారెడ్(ఐఆర్) పోర్ట్ ద్వారా విద్యుత్ బిల్లులు రీడింగ్ తీస్తున్నారు. అలాగే వినియోగదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు బిల్లింగ్ హెచ్చరికలు పంపిస్తూ ఆలస్య చెల్లింపుల జరిమానాలు పడకుండా వారిని అప్రమత్తం చేయడం వంటి చర్యలను కేంద్రం తన అధ్యయనంలో పరిగణనలోకి తీసుకుంది. ఆపరేషన్, విశ్వసనీయత, రెవెన్యూ కనెక్షన్లలో చేసిన కృషి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి తీసుకున్న చర్యలు, మీటరింగ్, బిల్లింగ్, తప్పులను సరిదిద్దడం, ఫిర్యాదుల పరిష్కారంతో పాటు ఈ క్రమంలో సాధించిన విజయాల ఆధారంగా జాతీయ స్థాయిలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఏపీ డిస్కంలకు టాప్ టెన్‌లో స్థానం కల్పించింది.

## కొవ్వూరు టీడీపీలో ఇరు వర్గాల కొరకొర

- మాజీ మంత్రి జవహర్‌ను పక్కన పెట్టేందుకు రంగం సిద్ధం
- పావులు కదుపుతున్న ద్విసభ్య కమిటీ, మరో వర్గం నేతలు
- ఆయనకు టికెటిస్తే మద్దతు ఇవ్వబోమని అల్టిమేటం
- ముప్పిడి వెంకటేశ్వరరావును బరిలోకి దింపాలని నిర్ణయం
- ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటిస్తున్న ముప్పిడి
- రగిలిపోతున్న జవహర్ వర్గం

సాక్షి, రాజమహేంద్రవరం: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో మాజీ మంత్రి కేఎస్ జవహర్‌పై అసమ్మతి రగులుతోంది. టీడీపీలోని ద్విసభ్య కమిటీ ఒక వర్గం గానూ, నియోజకవర్గాన్ని ప్రభావితం చేయగల మరో ముఖ్యనేత అచ్చిబాబు వర్గం మరోపక్క జవహర్‌కు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నాయి. నియోజకవర్గంలో వారి సానుభూతిపరులను ఏకం చేస్తున్నాయి. రహస్య సమావేశాలు పెట్టి చర్చలు జరుపుతున్నాయి. జవహర్‌కు అసెంబ్లీ స్థానం కేటాయిస్తే మూకుమ్మడిగా వ్యతిరేకిస్తామని, తమ అభిప్రాయాన్ని కాదని అవకాశం కల్పిస్తే సార్వత్రిక ఎన్నికల్లో అడ్రస్ లేకుండా చిత్తుగా ఓడిస్తామని స్పష్టం చేస్తున్నాయి. ఈమేరకు అధిష్టానానికి అల్టిమేటం జారీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొవ్వూరులో ఈ రెండు వర్గాల నాయకులు గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 'జవహర్ వద్దు - టీడీపీ ముద్దు' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. అధిష్టానం కూడా స్పష్టత ఇవ్వకపోవడంతో ప్రస్తుతం ఈ పరిణామం కొవ్వూరు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.


జవహర్‌కు వ్యతిరేకంగా సమావేశమైన నేతలు


జవహర్

**ముప్పిడిని బరిలోకి దింపే యోచన**

కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును బరిలోకి దింపేందుకు ఈ రెండు వర్గాలూ పావులు కదుపుతున్నాయి. పార్టీ అధినేత చంద్రబాబు సైతం ముప్పిడి పోటీని అంగీకరించారన్న ప్రచారం జోరుగా సాగుతున్న నేపథ్యంలో ద్విసభ్య కమిటీ, అచ్చిబాబు భరోసాతో ముప్పిడి రంగంలోకి దిగి నియోజకవర్గంలో పర్యటనలు ముమ్మరం చేశారు. నేతలను కలిసి మద్దతు కోరుతున్నారు. గతంలో జవహర్‌తో ద్విసభ్య కమిటీలోని ఓ సభ్యుడైన జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి సన్నిహితంగా మెలిగారు. ఆ సాన్నిహిత్యంతో ఆయన ఆర్థికంగా ఎదిగినట్లు చెబుతారు. అనంతరం వారి మధ్య తలెత్తిన ఆర్థిక వివాదాలతో చౌదరి సైతం జవహర్‌కు దూరమయ్యారు. జవహర్ మంత్రిగా ఉన్న సమయంలో అచ్చిబాబు వర్గాన్ని వ్యతిరేకించడంతో ఆయన కూడా వ్యతిరేక కూటమి కట్టారు.


ఎం.వెంకటేశ్వరరావు

**ఫ్లెక్సీల వివాదం**

తమ పంతం నెగ్గించుకోడానికి ద్విసభ్య కమిటీ, అచ్చిబాబు వర్గాలు దొరికిన ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోవడం లేదు. ఇటీవల జవహర్ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిలో వ్యక్తుల పేర్లకు బదులు గ్రామ టీడీపీ నేతలు అని పేర్కొన్నారు. ఈ ఫ్లెక్సీల ఏర్పాటు దొమ్మేరు గ్రామంలో వివాదంగా మారింది. ఓ వర్గం నేతలు గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి మరీ జవహర్‌పై విమర్శలు గుప్పించారు.

**జవహర్ వద్దు.. టీడీపీ ముద్దు**

జవహర్‌కు వ్యతిరేకంగా తాజాగా మరో నినాదాన్ని తెర పైకి తీసుకువచ్చారు. 'జవహర్ వద్దు.. టీడీపీ ముద్దు' అని ప్రచారం చేస్తున్నారు. గురువారం ఓచోట ఆత్మీయ సమావేశం పెట్టి మరీ విమర్శలు చేశారు. జవహర్‌ను కొవ్వూరు అభ్యర్థిగా పరిగణనలోకి తీసుకోవద్దని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. 2014 నుంచి సీనియర్ నాయకులను, కార్యకర్తలను పక్కన పెట్టిన ఆయన వర్గ విభేదాలకు కారకుడయ్యారని ఆరోపించారు. నియోజకవర్గ నాయకులు పలుమార్లు హెచ్చరించినా ఆయన తీరు మార్చుకోవడం లేదని అంటున్నారు.

**జవహర్ వైపే అధినేత మొగ్గు**

నియోజకవర్గంలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరుతున్నా టీడీపీ అధినేత చంద్రబాబు వాటికి చక్కదిద్దే ప్రయత్నం చేయడం లేదు. సీటు ఎవరికన్న స్పష్టత ఇవ్వకపోవడంతో ఇరు వర్గాల మధ్య రోజు రోజుకూ విభేదాలు తీవ్రమవుతున్నాయి. జవహర్ వైపే చంద్రబాబు మొగ్గు చూపుతున్నారని ఆయన వర్గం ప్రచారం చేసుకుంటోంది. ఇదే జరిగితే జవహర్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్న రెండు వర్గాలూ టీడీపీకి దూరమయ్యే అవకాశం ఉంది. ఒకవేళ జవహర్‌ను కాదంటే ఆయన వర్గం వ్యతిరేకమయ్యే పరిస్థితి ఎదురవుతుంది. ఈ వర్గ విభేదాలతో టీడీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

**జవహర్ పెత్తనం నామమాత్రం**

టీడీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న జవహర్ కొవ్వూరులో తనకంటూ ఒక బలమైన వర్గాన్ని తయారు చేసుకున్నా ఆయన పెత్తనం మాత్రం చెల్లడం లేదు. కొవ్వూరు టీడీపీ వ్యవహారాల్లో తలదూర్చవద్దని గతంలో అధిష్టానం కూడా హెచ్చరించింది. కొవ్వూరులోనే నివాసం ఉంటున్న జవహర్‌ను నియోజకవర్గ రాజకీయాల్లో వేలు పెట్టనివ్వడం లేదు. ప్రస్తుతం జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమని రామకృష్ణ సారథ్యంలోనే పార్టీ కార్యకలాపాలు నడుస్తున్నాయి. ఈ పరిణామంపై జవహర్ వర్గం గుర్రుగా ఉంది.

## క్లుప్తంగా...

### వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రాభివృద్ధి

**1,222వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు**



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

**తాడికొండ:** వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,222వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. మూడు ప్రాంతాల సమానాభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్న తరువాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు తెలియజేశారనేది గుర్తుంచుకుని కుల వాదులు మాట్లాడితే మంచిదన్నారు. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, వామపక్ష పార్టీలు, కాంగ్రెస్, జనసేన పార్టీలన్నీ ప్యాకేజీలు తీసుకుని ఏకపక్షంగా ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బాబు గెలిస్తే మళ్లీ పెత్తందారీ వ్యవస్థ ప్రారంభమై బ్రిటీష్ వారికంటే ఘోరమైన అరాచకాలు జరుగుతాయని, బహుజనులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని బహుజనులు బలంగా కోరుకుంటున్నారన్నారు. బాబు రాజకీయ చట్రంలో ఇరుక్కున్న షర్మిల మూడు రాజధానులపై మాట్లాడటం మంచిది కాదని హితవు పలికారు. నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

### జై భారత్ పార్టీ మేనిఫెస్టో ఆవిష్కరణ



**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** జై భారత్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఆ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గురువారం ఆవిష్కరించారు. కాకినాడలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీలోని వివిధ రాజకీయ పార్టీలకు భిన్నంగా తమ పార్టీ నిర్మాణం జరిగిందన్నారు. ప్రజల్లో చైతన్యం దిశగా ముందుకు సాగుతున్నానని చెప్పారు. నగరంలోని మేధావులు, సీనియర్ రాజకీయ నాయకులకు తన మేనిఫెస్టోను వివరించడానికి వచ్చానని తెలిపారు. యువత, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నానని వివరించారు.

### జనసేన పార్టీకి రవిదేవా రాజీనామా



**తణుకు:** మాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు తిర్రే రవిదేవా జనసేన పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. జనసేన పార్టీలో దళితులకు సముచిత స్థానం దక్కకపోవడం, గుర్తింపు లేకపోవడం తోనే జనసేనకు రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. జనసేన పార్టీలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై సరైన విధానం లేదని రవిదేవా విమర్శించారు. పవన్ కళ్యాణ్ రాజకీయ నాయకుడిగా విఫలమయ్యారని, ఏదో ఒక పార్టీకి తోకపార్టీగా వెళ్లకపోతే భవిష్యత్తు లేదని తెలిపారు. పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశమే లేదని రవిదేవా పేర్కొన్నారు.

### షర్మిల ఆంధ్రా ద్రోహి

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి**

**సాక్షి, అమరావతి:** ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆంధ్రప్రదేశ్ ద్రోహి అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. మొన్నటివరకు తెలంగాణలో ఉండి ఆంధ్రాకు నీళ్లు ఇవ్వద్దన్న షర్మిల, కాంగ్రెస్ పార్టీ ఐదుకోట్ల మంది ఆంధ్రులకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఆమె రాష్ట్రంలో తిరగాలని డిమాండ్ చేశారు.

### అర్హులైన ఆరోగ్య కార్యకర్తల క్రమబద్ధీకరణకు కృషి

**పూనూరు గౌతమ్‌రెడ్డి**

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర వైద్య శాఖలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న అర్హులైన పురుష ఆరోగ్య కార్యకర్తల క్రమబద్ధీకరణకు కృషి చేయనున్నట్లు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరి గౌతమ్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో పురుష ఆరోగ్య కార్యకర్తల క్రమబద్ధీకరణలో ఏర్పడిన ప్రతిష్టంభన గురించి వైఎస్సార్ టీయూసీ అనుబంధ సంఘం ఏపీ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆదాల వెంగళరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేసా ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.రమణ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఆరోగ్య కార్యకర్తలు గౌతమ్ రెడ్డిని విజయవాడలో గురువారం కలిశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ విషయమై తాను వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కమిషనర్‌లతో మాట్లాడానన్నారు. అధికారుల నుంచి సానుకూల స్పందన వచ్చిందని తెలిపారు.

---

ఈ చిత్రంలో పింఛన్ అందుకుంటున్న వృద్ధురాలి పేరు ఈడిగ లక్ష్మమ్మ. ఈమె డోన్ పట్టణంలోని 93వ పోలింగ్ కేంద్రంలో ఓటరుగా నమోదైంది. ప్రతీ నెల ప్రభుత్వం ఈమెకు ఠంచనుగా ఒకటో తేదీనే పింఛను అందిస్తోంది. ఫిబ్రవరి ఒకటో తేదీన కూడా ఆమెకు వలంటీర్ పింఛను అందజేశారు. కానీ, ఈవిడ మృతి చెందిందంటూ పచ్చ పత్రిక వికృత కథనం ఇచ్చింది. దీనిపై ఆమె కోడలు లక్ష్మీదేవి బతికున్న తమ అత్త చనిపోయిందంటూ ఎలా రాస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు కొండవేగు శాంతిప్రియ. డోన్ పట్టణంలోని చిగురమానుపేటలో కొన్నేళ్లుగా భర్తతో కలిసి జీవిస్తున్నారు. కొన్నేళ్లుగా ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లుతున్నాయని అబద్ధపు కథనాలు అచ్చేస్తున్న పచ్చ పత్రిక రెండేళ్ల కిందటే ఈమె మరణించిందని... అయినా ఓటర్ల జాబితాలో పేరు ఉందని ఓ అబద్ధాన్ని అచ్చేసింది. ఆత్మలకు ఓట్లు అంటూ శివాలెత్తింది. చివరికి ఆమె బతికున్న విషయం తెలిసినా సవరణ కూడా ప్రచురించలేదు.



● రామోజీ... కళ్లు కనిపించడం లేదా?

# మేం బతికే ఉన్నాం

**బతికున్నవారూ చనిపోయినట్టు తప్పుడు రాతలు ● ఓటర్ల నమోదులో అక్రమాలంటూ అడ్డగోలు గగ్గోలు**


**● టీడీపీ నాయకులకు వంతపాడుతూ పచ్చపత్రికల దుష్ప్రచారం ● వారి అక్రమాలను తొక్కిపెట్టేందుకు లెక్కలేనన్ని కుట్రలు**

ఉన్నవి లేనట్టు... లేనివి ఉన్నట్టు పచ్చ పత్రిక అడ్డగోలు రాతలతో భ్రమింపజేస్తోంది. ఓటర్ల జాబితాలో ఉన్నవారు చనిపోయినట్టు చిత్రీకరిస్తోంది. ఓటర్ల జాబితా అంతా తప్పుల తడకలేనని నిర్ధారించేస్తోంది. ఎలాగోలా చంద్రబాబునాయుడును గద్దె నెక్కించడమే తమ లక్ష్యంగా దిగువస్థాయి నుంచి రామోజీ వరకూ అడ్డగోలు రాతలతో జనాన్ని తప్పుదారి పట్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా గతేడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, తప్పులు లేని ఓటర్ జాబితా తయారు చేసింది.

**– సాక్షి, నంద్యాల**

### అక్రమాలకు తెరతీసిన టీడీపీ

ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నాయకులు ఓటర్ల అక్రమాలకు తెరలేపారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ సాయంతో గంపగుత్తంగా ఓటు హక్కు కోసం ఫారం–6లు నమోదు చేశారు. ఓటర్ జాబితాలో అనర్హులను తొలగించాలంటూ పెద్ద ఎత్తున ఫారం–7లను బూత్ స్థాయి అధికారులకు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల కార్యాలయాల్లో అందజేశారు. దురుద్దేశంతో వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే స్వచ్ఛమైన తుది ఓటరు జాబితా రూపొందించారు. అయితే ఈనాడు మాత్రం తప్పుడు రాతలు రాస్తూ ప్రభుత్వంపై బురద జల్లుతూ విషం కక్కుతోంది.



### మృతుల ఓట్లు కోకొల్లలు

డోన్ పట్టణంలోని 93వ పోలింగ్ కేంద్రంలో మొత్తం ఓటర్లు 547 మంది ఉండగా ఇందులో మహిళలు 279 మంది పురుషులు 268 మంది ఉన్నారు. ఈడిగ లక్ష్మమ్మ మృతిచెందినా ఓటరు జాబితాలో మాత్రం ఎక్స్ ఐవై1501444 అలాగే వచ్చింది. 93వ పోలింగ్ కేంద్రలో విశ్వరూపలచారిపే

ఈడిగ లక్ష్మమ్మ మరణించిందంటూ పచ్చ పత్రికలో ప్రచురితమైన కథనం

### పచ్చ పత్రిక పిచ్చి రాతలు

**పాణ్యం:** పచ్చ పత్రిక విషపూరిత రాతలతో జనాన్ని పిచ్చెక్కిస్తోంది. లేనిపోని రాతలతో తప్పుదారి పట్టిస్తోంది. పాణ్యం నియోజకవర్గంలోని 131వ నంబర్ పోలింగ్ బూత్‌లో ఆర్.జయరామ్, అతని భార్య ఆర్.రేణుకలకు ఓటు హక్కు ఉంది. వీరు అద్దె ఇంట్లో ఉండేవారు. ఆ తర్వాత సొంతింట్లోకి మారిన తర్వాత ఆర్.జయరామ్ మరణించారు. 131 బూత్‌లో ఉన్న ఓటు హక్కును రద్దు చేయాలని ఆర్.రేణుక ఫారం–7 ద్వారా అభ్యర్థించారు. పరిశీలించిన బీఎల్‌ఓలు ఆమె ఓటు(ఎన్‌కేడీ నంబర్ 2458899)ను జాబితా నుంచి తొలగించారు. ప్రస్తుతం 130 పోలింగ్ బూత్‌లో ఆమె ఓటు నమోదైంది. అయితే భర్తతో పాటు భార్యకు కూడా 131లో ఓటు హక్కు తొలగించారని రాశారు. వాస్తవానికి ఆమె అభీష్టం మేరకే 131 బూత్‌లో భర్త ఓటు తొలగించి ఆమె ఓటును మార్చడం గమనార్హం.

---

### ముగిసిన ఏపీఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

**సాక్షి, విశాఖపట్నం:** విద్యుత్ సంస్థల ప్రతిపాదనలపై ఏపీఈఆర్సీ సభ్యులు పీవీఆర్ రెడ్డి, ఠాకూర్ రామసింగ్‌తో కలిసి చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి నిర్వహించిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ గురువారం ముగిసింది. 2024–2029 నియంత్రణ కాలానికి సంబంధించిన విద్యుత్ కొనుగోళ్ల ధరల ప్రతిపాదనలను ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర బాబు చదివి వినిపించారు. ఈ నివేదికలపై ఎం.వేణుగోపాలరావు, సీహెచ్ బాబూరావు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్–ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు, విద్యుత్ సంస్థల తరపున ఈపీడీసీఎల్ సీజీఎం సుమన్ కళ్యాణి తదితరులు వ్యక్తం చేసిన అభిప్రాయాలకు చక్రధరబాబు సమాధానమిచ్చారు. అనంతరం ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. గృహ, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో పాటు వివిధ వర్గాలకు చెందిన వినియోగదారులు, ప్రతినిధులు మొత్తం 62 మంది 4 రోజుల పాటు జరిగిన ఈ ప్రజాభిప్రాయ సేకరణకు హాజరయ్యారని చెప్పారు. వారంతా పలు అంశాలపై తమ అభిప్రాయాలను తెలియజేశారని పేర్కొన్నారు. కొందరు కమిషన్ పరిధిలో లేని అంశాలను ప్రస్తావించారని.. వాటిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు. డిస్కంలు టారిఫ్ పెంపుదలను ప్రతిపాదించలేదని స్పష్టం చేశారు. డిస్కంలకు దాదాపు రూ.13 వేల కోట్ల లోటు ఉందని.. దానిని భరిస్తామని జెన్‌కో ద్వారా ప్రభుత్వం తెలియజేసిందని జస్టిస్ నాగార్జునరెడ్డి చెప్పారు.

### అనిల్‌కుమార్ ఎంపిక.. చరిత్రాత్మక నిర్ణయం

● రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు



**సత్తెనపల్లి:** బడుగు, బలహీనవర్గాల రాజకీయ సాధికారత నినాదం కాదు.. విధానమని నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్‌ను ఎంపికచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. అనిల్‌కుమార్ ఎంపిక చరిత్రాత్మకమన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎందరో ప్రముఖులు చరిత్ర కలిగిన నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేశారని చెప్పారు. అలాంటి స్థానాన్ని వైఎస్సార్‌సీపీ బీసీ సామాజికవర్గానికి కేటాయించడం ఆయా వర్గాల్లో నూతన ఉత్సాహాన్ని నింపటమేనని పేర్కొన్నారు. అనిల్‌కుమార్ యాదవ్ తనకంటే ముందు జలవనరులశాఖను సమర్థంగా నిర్వహించారని, సత్తా, ధైర్యం కలిగిన ఆయన జగన్‌కు విశ్వాస పాత్రుడని చెప్పారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు వైఎస్సార్‌సీపీ పార్టీ టికెట్ ఇవ్వనన్నారని ప్రచారం జరుగుతోందని, ఇది సరైనది కాదని తెలిపారు. నరసరావుపేట స్థానాన్ని బీసీలకు కేటాయించాలనుకుంటున్నట్లు శ్రీకృష్ణదేవరాయలకు జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా వివరించారని, గుంటూరు పార్లమెంటుకు పోటీచేయమని సూచించారని, గెలుస్తారని చెప్పారని వివరించారు. అయినా శ్రీకృష్ణదేవరాయలు అవసరమైన సమయంలో పార్టీని వీడి వెళ్లటం దుర్మార్గమన్నారు. ఇలాంటి నిర్ణయాలు సరికాదని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు అర్థం చేసుకోవాలని కోరారు. పార్టీ ఎవరికీ అన్యాయం చేయదని, పార్టీ ఒక నిర్ణయం తీసుకుంటే దానిని అందరూ గౌరవించాలని మంత్రి చెప్పారు.

---

## చంద్రబాబు సీట్లు అమ్ముకుంటారు

- ఎన్నికల తర్వాత రాష్ట్రం వదిలి పారిపోతారు
- చంద్రబాబు ఎప్పుడూ ధనికుల కోసమే పనిచేస్తారు
- పేదల కోసం పనిచేస్తున్న సీఎం జగన్...
- జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం.. ఆయన వెంటే జనం
- విజయవాడ ఎంపీ కేశినేని నాని

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** 'రానున్న ఎన్నికల్లో చంద్రబాబు డబ్బున్నవాళ్లకు సీట్లు అమ్ముకుంటారు. ఎన్నికల తర్వాత ఆ డబ్బుతో మూట, ముల్లె సర్దుకుని రాష్ట్రం నుంచి పారిపోతారు...' అని విజయవాడ లోక్‌సభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, ప్రజలు కూడా తమకు మంచి చేస్తున్న ఆయన పక్షానే ఉన్నారని చెప్పారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా గురువారం విజయవాడ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేశినేని నాని మాట్లాడుతూ పేదల కోసం సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారని, చంద్రబాబు మాత్రం ధనికుల కోసం పని చేస్తారని చెప్పారు. సమాజం బాగుండాలని వైఎస్ జగన్ కృషి చేస్తుంటే... బాబు మాత్రం తన కొడుకు కోసం తపన పడుతున్నారని మండిపడ్డారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం జగన్‌లా పనిచేసే వారు ఈ దేశంలోనే ఎవరూ లేరన్నారు. సంక్షేమ పథకాల ద్వారా నేరుగా పేదల ఖాతాల్లోనే సుమారు రూ.2.50 లక్షల కోట్లు జమచేశారని, ఆ భగవంతుడే సీఎం జగన్ రూపంలో పేదలకు మేలు చేస్తున్నారని ప్రశంసించారు. పేదల కోసం సీఎం జగన్ ఇన్ని చేస్తుంటే రాష్ట్రం దివాలా తీసింది... అంటూ



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని. పక్కన దేవినేని అవినాష్ తదితరులు

బాబు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో చిన్నిచిన్న రోడ్ల ఫొటోలు తీసి పచ్చ పత్రికలో పెద్దగా ప్రచురిస్తున్నారని, తాను విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ బాగానే ఉన్నాయని నాని స్పష్టంచేశారు. వైఎస్సార్ ఆసరా కింద విజయవాడ నగరంలోని పొదుపు సంఘాల మహిళలకు రూ.350 కోట్లు ఇచ్చారంటే పేదలపట్ల సీఎం జగన్‌కు ఉన్న చిత్తశుద్ధి ఎలాంటిదో తెలుస్తుందన్నారు. ప్రతి పేద విద్యార్థి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉన్నత విద్య చదవాలని ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. 'ప్రతిపక్షాలకు దమ్ముంటే రండి. మేం చేసిన అభివృద్ధి చూపిస్తాం. మేం మంచి చేశాం కాబట్టే దమ్ముగా ప్రజల్లోకి వెళ్తున్నాం.' అని అన్నారు. టీడీపీ, జనసేన కుల పార్టీలని, వాటికి ప్రజలకు మేలు చేయాలనే అజెండా లేదన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పొదుపు సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు, నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ అధికారి అవతారమెత్తిన టీడీపీ నేత పుట్టా అనుచరుడు

- ఈజీ మనీ కోసం సీఐడీ పేరిట బెదిరింపులు
- రూ.కోట్లు కొల్లగొట్టేందుకు యత్నం
- హైదరాబాద్‌లో కటకటాల పాలైన మైదుకూరువాసి మహేంద్రకుమార్



పుట్టాతో మహేంద్రకుమార్

**సాక్షి ప్రతినిధి, కడప:** సీఐడీ అధికారులమంటూ హడావుడి చేసిన నకిలీ అధికారుల బండారం బట్టబయలయిన ఘటనలో వైఎస్సార్ జిల్లా టీడీపీ నేత పుట్టా సుధాకర్‌యాదవ్ అనుచరుడితో సహా 8మందిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన న్యాయవాది మహేంద్రకుమార్ (38) టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అనుచరుడు. పుట్టా సుధాకర్‌యాదవ్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన రంజిత్‌కుమార్ (47)తో పరిచయం ఏర్పడింది. అతను గతంలో తాను పనిచేసిన హైదరాబాద్ కేంద్రంగా అమెరికా ఐటీ నియామకాల కార్యకలాపాలు నిర్వహిస్తున్న అజా (ఏజేఏ) సంస్థ వ్యవహారాల గురించి మహేంద్రకుమార్‌కు తెలిపారు. ఆ సంస్థ లొసుగుల కారణంగా డైరెక్టర్ సుగుణాకరను బెదిరిస్తే రూ.కోట్లు కొల్లగొట్టవచ్చని చెప్పాడు. ఈ క్రమంలో కర్నూల్ రేంజ్ కార్యాలయంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సుజన్‌ను సంప్రదించారు. ఎస్ఐ సుజన్ కడప అశోక్‌నగర్‌లో ఉంటున్న ఐటీ నిపుణుడు మహ్మద్ అబ్దుల్ ఖదీర్‌ను పరిచయం చేశారు. టెక్నికల్ ఇష్యూస్ బాగా తెలిసిన మరికొంతమంది సభ్యులతో కలిసి ఓ బృందంగా ఏర్పడ్డారు. ఆ మేరకు అజా సంస్థలోకి ప్రవేశించారు. సీఐడీ అధికారులుగా గుర్తింపు కార్డులు చూపించి తనిఖీలు నిర్వహించి నానా హడావుడి చేశారు.

**రూ.10కోట్లు డిమాండ్**

అమెరికాలోని క్లయింట్ విషయంలో అవకతవకలకు పాల్పడినట్లు ఆ దేశ అధికారులు కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేయడంతో తనిఖీలకు వచ్చినట్లు ఆ సంస్థ డైరెక్టర్‌ను భయపెట్టారు. ఈ వ్యవహారం నుంచి బయటపడాలంటే రూ.10కోట్లు ముట్టచెప్పాలని డిమాండ్ చేశారు. బేరసారాల తర్వాత రూ.2.3కోట్లు అప్పగించేలా అంగీకారం కుదిరింది. కంపెనీ ఖాతాల్లో రూ.71.80 లక్షలున్నాయని బాధితుడు చెప్పారు. నేరుగా తీసుకుంటే దొరికిపోతామని భావించి ఆ సంస్థ ఉద్యోగులు రవి, చేతన్, హరి ఖాతాల్లోకి రూ.26 లక్షలు బదలాయించారు. ఈ మొత్తం వ్యవహారం జనవరి 26న చోటు చేసుకుంది. 27వ తేదీ ఉదయం ఆ ముగ్గురు ఉద్యోగుల్ని మాదాపూర్‌లోని బాల్కనీ హోటల్‌కు తీసుకెళ్లి బంధించారు. ఏటీఎం కార్డులు, బ్యాంకు వివరాలు తీసుకుని రూ.12.5లక్షలు తమ ఖాతాల్లోకి మార్చుకున్నారు. మిగతా సొమ్ముకోసం డైరెక్టర్‌కు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో.. ఉద్యోగుల్ని వదిలేసి పారిపోయారు. విషయం గ్రహించిన సంస్థ డైరెక్టర్ సుగుణాకర పోలీసులకు ఫిర్యాదు చేయగా మొత్తం వ్యవహారం బహిర్గతమైంది. ఈ వ్యవహారంలో సహకరించిన వారితో పాటు, ప్రత్యక్షంగా పాల్గొన్న 10మందిపై కేసు నమోదైంది. మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అనుచరుడు మహేంద్రకుమార్, సుబ్బకృష్ణతో పాటు 8మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ సుజన్, రాజా అనే నిందితుడు పరారీలో ఉన్నారు.

---

## నల్లధనం కేసులో ఎమ్మెల్యే ఏలూరి పరార్

- తనిఖీకి వచ్చిన మైనింగ్, విజిలెన్స్ అధికారులపై దౌర్జన్యం
- ఎమ్మెల్యే ఏలూరితో సహా ఎనిమిది మందిపై కేసు నమోదు
- పచ్చపార్టీ నేతల్లో టెన్షన్

**సాక్షి ప్రతినిధి, బాపట్ల:** మార్టూరులో గ్రానైట్ ఫ్యాక్టరీలను తనిఖీ చేసేందుకు వచ్చిన మైనింగ్, విజిలెన్స్ అధికారులపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు ఆయన అనుచరులు పెద్ద ఎత్తున దౌర్జన్యానికి దిగారు. తనిఖీకి వచ్చిన మైనింగ్ ఏడీలతోపాటు మిగిలిన అధికారులను దుర్భాషలాడారు. అంతేకాకుండా తెగించిన పచ్చ ముఠా మైనింగ్ అధికారులతో వచ్చిన డ్రైవర్ శ్రీనివాసరావుపై దాడికి తెగబడ్డారు. దీంతో పోలీసులు మైనింగ్ అధికారుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే అనుచరులు కామినేని జనార్దన్, చల్లగుండ్ల కృష్ణ, నడింపల్లి హనుమాన్‌ప్రసాద్, ఎస్.ఏ.రజాక్, మిన్నేకంటి రవి, అడుసుమల్లి వెంకట శ్రీనివాసరావు, పత్తిపాటి సురేష్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో చల్లగుండ్ల కృష్ణ, ఎమ్మెల్యే ఏలూరిని మినహా మిగిలిన ఆరుగురిని పోలీసులు అరెస్ట్‌చేసి బుధవారం అద్దంకి కోర్టులో హాజరు పర్చగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఎమ్మెల్యే ఏలూరితోపాటు చల్లగుండ్ల కృష్ణ పోలీసులకు దొరక్కుండా పారిపోయారు. ఏలూరి ఫోన్ స్విచాఫ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన యాంటిసిపేటరీ బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నట్లు అనుచరులు చెబుతున్నారు.

**ఆందోళనలో ఎమ్మెల్యే అనుచరులు**

ఎమ్మెల్యే ఏలూరి అక్రమాలకు దన్నుగా నిలిచిన పుణ్యానికి పోలీసు కేసులు పెట్టించుకొని ఆయన కంపెనీ ఉద్యోగులు, అనుచరులు లబోదిబోమంటున్నారు. నోవా అగ్రిటెక్ మాటున నల్లధనంతో ఎన్నికల్లో దొంగ ఓట్లు, ఓట్ల కొనుగోలు ఇతర



మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీలో అధికారులతో ఏలూరి వాగ్వివాదం (ఫైల్)

అక్రమాలకు పాల్పడ్డారు. గ్రానైట్ అక్రమ రవాణాపై ఫిర్యాదులతో తనిఖీకు వచ్చిన మైనింగ్, విజిలెన్స్ అధికారులపై ఎమ్మెల్యే ఆదేశాలతో దాడులు చేసి కేసులు పెట్టించుకోవాల్సి రావడంతో గ్రానైట్ వ్యాపారులు, అనుచరులు లబోదిబోమంటున్నారు. గొడవ పడింది సాక్షాత్తూ మైనింగ్, విజిలెన్స్ అధికారులతో కావడంతో ఇక నుంచి రాయల్టీ, జీఎస్టీలు లేకుండా గ్రానైట్ రవాణా వ్యాపారం ఎలా చేయాలి? అంటూ ఆందోళన చెందుతున్నారు. చేసేది అక్రమ రవాణా కావడంతో మైనింగ్ అధికారుల కన్ను దాడిచేసిన తమపైనే ఉంటుందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులతో పెట్టుకుని అందరినీ ఇబ్బందులకు గురిచేశారంటూ మిగిలిన గ్రానైట్ వ్యాపారులు ఏలూరికి మద్దతు పలికిన వ్యాపారులను చీవాట్లు పెడుతున్నారు.

**ఏ–1గా ఏలూరి సాంబశివరావు**

ఎమ్మెల్యే ఏలూరి రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో నల్లధనంతో అక్రమాలకు పాల్పడ్డారని ఆధారాలు బయటపడటంతో ఎమ్మెల్యేతో పాటు ఆయన కంపెనీ ఉద్యోగులు పలువురిపై కేసులు నమోదయ్యాయి. గుంటూరులోని నోవా అగ్రిటెక్ కార్యాలయంలో గత నెల 24న జీఎస్టీకి సంబంధించి రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్( ఏపీఎస్ డీఆర్ఐ) అధికారులు జరిపిన తనిఖీల్లో అక్రమాలకు సంబంధించి వివరాలున్న డైరీలు బయటపడ్డాయి. ఏలూరి పెద్దఎత్తున నల్లధనాన్ని వినియోగించి అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైంది. పూర్తిస్థాయి విచారణ జరిగితే మరిన్ని అక్రమాలు వెలుగు చూస్తాయని భావించిన అధికారులు ఎమ్మెల్యే, కంపెనీ ఉద్యోగులపైనా కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఏ–1 గా ఉన్నారు. ఆయనతో పాటు కంపెనీ ఉద్యోగులు పుల్లెల అజయ్‌బాబు, అప్పారావు, బాజిబాబు, సాయిగణేశ్‌లపైనా ఇంకొల్లు పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతరం నోటీసులు ఇచ్చి వీరిని విచారించనున్నారు. తొలుత పట్టుబడ్డ డైరీని స్వాధీనం చేసుకొని దాంట్లో ఉన్న వివరాల ప్రకారం పోలీసులు విచారణలో ముందుకెళ్లనున్నారు.

**బయటపడుతున్న అక్రమాల చిట్టా**

ఎన్నికల వేళ ఏలూరి అక్రమాలు వెలుగు చూడటంపై ముఖ్యంగా టీడీపీ శ్రేణులు తలపట్టుకుంటున్నాయి. ఏలూరి అక్రమాల చిట్టా ఒక్కొక్కటిగా బయటపడటం నష్టం చేకూరుస్తుందని పార్టీవర్గాలు అంచనా వేస్తున్నాయి. అసలే దొంగ ఓట్ల పుణ్యమాని గత రెండు ఎన్నికల్లో అతితక్కువ మెజార్టీతో బయట పడ్డామని, ఈసారి నియోజకవర్గంలో 12 వేలకు పైగా దొంగ ఓట్లు తొలగింపుతో గెలిచే పరిస్థితి లేదని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### రెండు కేసులపైనా విచారణ

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు చెందిన నోవా అగ్రిటెక్ అక్రమాల కేసు వివరాలను విచారణ అధికారుల ద్వారా తీసుకున్నాం. పట్టుబడ్డ డైరీని స్వాధీనం చేసుకున్నాం. అందులో ఉన్న అందరినీ విచారిస్తాం. ఎమ్మెల్యేకు నోటీసులు ఇస్తాం. ఈ కేసులో ఇప్పటికే ఆరుగురిని కోర్టుకు హాజరుపరిచాం. ఎమ్మెల్యేతో పాటు మరొకరిని హాజరు పరచాల్సివుంది.

**– వకుల్‌జిందాల్, ఎస్పీ, బాపట్ల జిల్లా**

## వరదాపురం సూరి ఓవర్ యాక్షన్

**ధర్మవరంలో రహదారి అభివృద్ధి పనులు అడ్డుకునే యత్నం**

- సొంత నిధులతో రోడ్డు వేస్తానంటూ హంగామా
- రోడ్డుపై బైఠాయించి నానాయాగి
- సూరితో పాటు అనుచరుల అరెస్ట్

**ధర్మవరం:** రాజకీయ ఉనికి కోసం మాజీ ఎమ్మెల్యే వరదపురం సూరి ధర్మవరం పట్టణంలో గురువారం హైడ్రామాకు తెరలేపారు. రహదారి అభివృద్ధి పనులకు అడ్డుపడుతూ అనుచరులను రెచ్చగొడుతూ నానా యాగి చేశారు. గత ఎన్నికల్లో వరదాపురం సూరి ధర్మవరం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన తర్వాత టీడీపీని వీడి బీజేపీలో చేరారు. తీరా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ధర్మవరం టీడీపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజాదరణలో అత్యంత బలవంతుడైన కేతిరెడ్డిని ఢీకొట్టే సత్తా తనకు మాత్రమే ఉందని కలరింగ్ ఇచ్చేందుకు ఫీట్లు చేస్తున్నారు.

**టెండర్‌లు పూర్తయిన విషయం తెలుసుకుని డ్రామా**

2019లో అప్పటి ఎమ్మెల్యే సూరి రూ.28 కోట్లతో ధర్మవరం పట్టణంలో రోడ్డు వేశారు. రోడ్డు పనులు అత్యంత నాసిరకంగా చేయడంతో పదినెలలు గడవకముందే శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించి రూ.4 కోట్ల వ్యయంతో నాలుగు వరుసల రహదారిని నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతేడాది డిసెంబర్ 5న జీఓ విడుదల చేశారు. ఈ క్రమంలో అధికారులు జనవరి 18న టెండర్ ప్రక్రియ సైతం పూర్తిచేశారు. గురువారం రోడ్డు పనులు ఎమ్మెల్యే కేతిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అవుతున్నాయి. కానీ వరదాపురం సూరి రాజకీయ లబ్ధి



రోడ్డుపై బైఠాయించి హంగామా సృష్టిస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి, అనుచరులు

కోసం హంగామా చేశారు. తన సొంత నిధులతో రోడ్డు వేస్తానని అనుమతి ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరగా, ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అయినప్పటికీ పలుమార్లు అధికారులను కలుస్తూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ క్రమంలోనే గురువారం రోడ్డు పనులు ప్రారంభించేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి సిద్ధమవుతున్న తరుణంలో వరదాపురం సూరి హైడ్రామాకు తెరలేపారు. ఉదయాన్నే మార్కెట్‌యార్డుకు రెండు టిప్పర్లు తీసుకువచ్చి పనులు చేస్తామంటూ అనుచర గణంతో బైఠాయించారు. డీఎస్పీ టీ. శ్రీనివాసులు, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తదితరులు సూరి వద్దకు వెళ్లి రోడ్డు పనులకు ఆటంకం కల్గించవద్దని ఎంత సర్ది చెప్పినా వినకుండా పోలీసులపైకి దౌర్జన్యం చేశారు. పెద్దపెట్టున నినాదాలు చేస్తూ పట్టణంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు.

**కేసు నమోదు**

అభివృద్ధి పనులకు ఆటంకం కల్గిస్తూ రహదారిపై ధర్నా, పోలీసులపై దౌర్జన్యం తదితర కారణాలతో వరదాపురం సూరితో పాటు అనుచరులు 29 మందిని పోలీసులు అరెస్ట్ చేసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఐపీసీ 143, 145, 188, 341, రెడ్‌విత్ 149 కింద కేసులు పెట్టారు. సూరికి చెందిన రెండు వాహనాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ టీ. శ్రీనివాసులు తెలిపారు.

## వైఎస్సార్ జననేత

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జె.చలమేశ్వర్
- ముగ్గురు సీఎంలపై 'మూడు దారులు' పుస్తక పరిచయ సభ
- ప్రజలను మెప్పించి సీఎం అయిన జగన్: పుస్తక రచయిత అమర్

**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో రాజ్యాంగ విలువలు లోపించాయని, అధికారం వచ్చాక తాము ఏది చేసినా చెల్లుతుందనే ధోరణి కొనసాగుతోందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జె.చలమేశ్వర్ అన్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా గురువారం ప్రముఖ పాత్రికేయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్.. వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు గురించి రచించిన 'మూడు దారులు' పుస్తక పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి జస్టిస్ జె.చలమేశ్వర్ మాట్లాడుతూ, రాజకీయ పరంగా విధివిధానాలు వేరైనా.. ముగ్గురి గమ్యం ఒక్కటేనన్నారు. పాదయాత్ర అనంతరం వైఎస్సార్ వ్యక్తిత్వంలో చాలా మార్పు వచ్చిందన్నారు. నేరుగా ప్రజల చెంతకు వెళ్లి, వారికి నమ్మకం కల్పించిన నాయకుడే అధికారాన్ని పొందగలుగుతాడని, తన పాదయాత్ర ద్వారా ప్రజల్లో ఆ నమ్మకాన్ని కల్పించి జననేతగా నిలిచారని అన్నారు. ఒక పాత్రికేయునిగా తాను చూసిన వాస్తవ సంఘటనలను తన అభిప్రాయాలుగా మూడు దారులుగా తీసుకువచ్చానని రచయిత దేవులపల్లి అమర్ అన్నారు. నాలుగు గోడల మధ్య నుంచి సీఎంగా వచ్చిన వ్యక్తి చంద్రబాబని అభిప్రాయపడ్డారు. పొత్తులతోనే సీఎంగా అయ్యారు కానీ, చంద్రబాబు స్వయంప్రకాశితుడు కారన్నారు. కాగా ప్రస్తుత సీఎం జగన్ తన తండ్రికి భిన్నంగా ప్రయాణం చేశారని, ఓదార్పు యాత్రకు కాంగ్రెస్ నిరాకరిస్తే ఆ పార్టీనే వదిలి ప్రజల చెంతకు చేరారని అన్నారు. కక్షసాధింపుతో ఆ పార్టీ ప్రభుత్వం కేసులు పెట్టినా 16 మాసాలు జైల్లో ఉండి, ప్రజల మెప్పుతో 2019లో సీఎం అయ్యారని ప్రశంసించారు. సీనియర్ పాత్రికేయుడు కల్లూరి భాస్కరం, చక్రధర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విజ్ఞాన్ మహోత్సవ్ ప్రారంభం

**చేబ్రోలు:** విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా యోగా, సంగీతం, ఆటలు, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని చిందు గానం కళాకారుడు గడ్డం సమ్మయ్య (పద్మశ్రీ అవార్డు గ్రహీత-2024) పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు విజ్ఞాన్ 2కే 24 పండుగ జరగనుంది. ముఖ్య అతిథి సమ్మయ్య మాట్లాడుతూ చిందు యక్షగానం కళతో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలైన మద్యపాన నిషేధం, అక్షరాస్యత, కుటుంబ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటివాటిపై వేలాది ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చినట్టు తెలిపారు. ఇండియన్ మ్యూజిక్ కంపోజర్ రఘు కుంచె మాట్లాడుతూ యువత తన సహజ శక్తులను దేశ ప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఫిజికల్‌గా ఫిట్‌గా ఉంటే.. మెంటల్‌గా స్ట్రాంగ్‌గా ఉంటారని తెలిపారు. మొత్తం 75 ఈవెంట్లను ప్రారంభించారు. వీసీ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

## 31 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

**సాక్షి, అమరావతి:** పురపాలక పట్టణాభివృద్ధిశాఖలో పనిచేస్తున్న 31 మంది కమిషనర్ స్థాయి అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీలు చేపట్టినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఇద్దరు ఐపీఎస్ అధికారుల బదిలీ

**సాక్షి, అమరావతి:** ఇద్దరు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్‌ను తిరుపతి జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డిని ప్రకాశం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024






## నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ నిత్యాన్నదానానికి విజయవాడ మధురానగర్‌కు చెందిన మద్దుల కరుణాకర్, ఉషారాణి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.



## రామలింగేశ్వరుడి సన్నిధిలో..

పెనమలూరు: యనమలకుదురులోని రామలింగశ్వరుడి సన్నిధిలో గురువారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శులు దీప్‌పంత్, హరీష్‌రాత్ ప్రత్యేక పూజలు చేశారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 519.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 5,510, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

# సీట్లు.. పాట్లు..

- టీడీపీ నేతల ఫీట్లు
- విజయవాడ 'పశ్చిమ'లో పోటాపోటీగా ర్యాలీలు
- ముస్లింలకే కేటాయించాలని ఆ వర్గ నేతల పట్టు
- బుద్దా వెంకన్న తనకే సీటు కేటాయించాలని ర్యాలీ
- సీట్ల కోసం దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, కేశినేని చిన్ని పూజలు
- దేశం శ్రేణుల్లో నైరాశ్యం



పూజల్లో మాజీ మంత్రులు ఉమా, రవీంద్ర(ఫైల్)




ముస్లింలకు టికెట్ ఇవ్వాలని టీడీపీ శ్రేణుల ర్యాలీ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సార్వత్రిక ఎన్నికల్లో సీట్ల కోసం టీడీపీ నేతలు నానాపాట్లు పడుతున్నారు. ఆ పార్టీ ఉనికి కోసం నేతలు ఫీట్లు చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే టికెట్ల కోసం ఆ పార్టీ నేతలు కొందరు పూజలు చేస్తుంటే, మరికొందరు వివాదాస్పద వ్యాఖ్యలతో చర్చనీయాంశమవుతున్నారు. టీడీపీతో పొత్తులో ఉన్న జనసేన నేతలు కూడా టికెట్ తమకేనంటూ నియోజకవర్గంలో తిరుగుతున్నారు. ప్రతి ఒక్కరూ టికెట్ కోసం పాట్లు పడుతున్నారు.

**పశ్చిమలో మూడు ముక్కలాట**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ నియోజక వర్గంలో సీటు కోసం టీడీపీలో మూడు ముక్కలాట నడుస్తోంది. ఆ పార్టీ ఆవిర్భావ సమయంలో తప్ప ఈ నియోజక వర్గంలో టీడీపీ గెలిచిన దాఖలాలు లేవు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉంది. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థులే విజయబావుటా ఎగరేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నియోజక వర్గ ప్రజల్లో విశేష ఆదరణ పొందాయి. దీంతో పార్టీ నేతలు జోష్‌లో ఉన్నారు. భారీ మెజార్టీతో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' ఇన్‌చార్జి ఆసిఫ్, స్థానిక నేతలను కలుపుకొని ప్రభుత్వ, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ దూసుకుపోతున్నారు.

**టీడీపీలో ఎవరి గోల వారిదే..**

పశ్చిమ నియోజక వర్గంలో పార్టీకి బలం లేదని తెలిసినా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేష్ వద్ద మెప్పు కోసం ఇక్కడ టీడీపీ నాయకులు హడావుడి చేస్తున్నారు. ఎటూ సీటురాదు, వచ్చినా గెలిచే అవకాశం లేదని స్పష్టంగా తెలిసినా పేపరు పులిగా పేరొందిన బుద్దా వెంకన్న తమకు సీటు కేటాయించాలని ర్యాలీ చేసి హడావుడి చేస్తున్నారు. ఇటీవల కొంత మంది ముస్లిం నేతలు, తమ సామాజిక వర్గానికే సీటు కేటాయించాలని హంగామా చేస్తున్నారు. విజయవాడ టికెట్ తనదేనని టీడీపీ నేత జలీల్‌ఖాన్ ప్రకటించుకున్నారు. 'అందరు టికెట్లు అడుగుతారుకానీ గెలిచే స్థోమత ఉండాలి. మంచి విలువలు ఉండాలి. నాకు సీటు ఇవ్వకపోతే ముస్లిం మైనార్టీలు ఉరి వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.' అని జలీల్‌ఖాన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. మరో ముస్లిం మైనార్టీ నేత ఎంఎస్ బేగ్ తనదే టికెట్ అని ప్రచారం చేసుకుంటున్నారు. మరోవైపు జనసేన నేత పోతిన మహేష్ పొత్తులో భాగంగా తమకే టికెట్ కేటాయిస్తారని ధీమాగా నియోజక వర్గంలో తిరుగుతున్నారు. పశ్చిమలో టీడీపీ, జనసేనలో ఎవరికివారే తమదే సీటు అని చెప్పుకొని నాయకులు తిరుగుతుంటే, అరకొరగా ఉన్న పార్టీ నేతలు, క్యాడర్ అయోమయానికి గురవుతున్నారు.

**సీనియర్ నేతలు కూడా..**

టీడీపీలో సీనియర్ నేతలమంటూ గొప్పలు చెప్పుకొనే కొంత మంది, తమ నియోజక వర్గంలో వ్యక్తమవుతున్న తీవ్ర అసంతృప్తికి తోడు, పట్టుకోల్పోయి, టికెట్ మీద ఆశలు సన్నగిల్లి పూజలు చేస్తున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమా ఇటీవల కృష్ణా తీరంలో చేసిన పూజలే నిదర్శనం. ఇది టీడీపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పూజలపై రకరకాల ఊహాగానాలు వినిపించాయి. పేరుకు మాత్రం చంద్రబాబును సీఎం చేయడానికి పూజలు చేస్తున్నామని కలరింగ్ ఇస్తున్నా నియోజకవర్గంలో తమకు సీటుతోపాటు, గెలుస్తామనే నమ్మకం లేకనే, పూజలు చేసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

**మచిలీపట్నంలో..**

కృష్ణా జిల్లాలోని మచిలీపట్నంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పూజలు చేయడం దానికి దేవినేని ఉమా సైతం హాజరయ్యారు. ఇటీవల విజయవాడ గురునానక్ కాలనీ సమీపంలో మూడు రోజులపాటు టీడీపీ నేత కేశినేని చిన్ని సైతం యాగం చేశారు. ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన వీరు, చివరి ప్రయత్నంగా పలు కార్యక్రమాలు చేస్తూ గట్టెక్కాలని తాపత్రయ పడుతున్నారు. పార్టీ శ్రేణులను సమాయత్తం చేసి, నియోజక వర్గంలో తిరుగుతూ కార్యకర్తల్లో ధైర్యం నింపకుండా కాల హరణం చేస్తున్నారని టీడీపీలో కొందరు నేతలు విమర్శిస్తున్నారు.

## తోడుదొంగలను నమ్మితే రాష్ట్రం సర్వనాశనం

మంత్రి జోగి రమేష్



ఆకునూరులో జరిగిన ఆసరా సభలో మాట్లాడుతున్న మంత్రి రమేష్

ఉయ్యూరు: తోడుదొంగలను నమ్మి అడుగేస్తే రాష్ట్రం సర్వనాశనమేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. ఉయ్యూరు మండలంలో గురువారం ఆకునూరులో జరిగిన 'ఆసరా' సభలో మంత్రి రమేష్ మాట్లాడారు. రాష్ట్రంలో పసుపు చొక్కాలు వేసుకుని ఇంటికో బంగారం ఇస్తా, కారు ఇస్తామంటూ మాయ దొంగలు వస్తున్నారని తెలిపారు. దొంగల ముఠాకు నాయకులు తోడుదొంగలు చంద్రబాబు, పవన్‌లు అన్నారు. దొంగల విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏమరుపాటుతో తోడుదొంగలను నమ్మామా రాష్ట్ర భవిష్యత్తు అంధకారమేనని చెప్పారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కుర్చీ లాక్కున్న నీచుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. 175 స్థానాల్లో ఒంటరిగా అభ్యర్థులను నిలబెట్టుకోలేని దౌర్భాగ్య స్థితిలో టీడీపీ ఉందన్నారు. ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేక తోడుదొంగలతో గుంపుగా వచ్చే చంద్రబాబు ప్రజా నాయకుడా అని ప్రశ్నించారు. ప్రజలకు మంచి చేస్తున్న జగనన్నను మళ్లీ సీఎం చేసుకోకపోతే మనల్ని మనం వెన్నుపోటు పొడుచుకున్నట్లేనన్నారు. ప్రజలు వాస్తవాలను గ్రహించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి బాసటగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో పేద పిల్లలు విద్యావంతులు కాకూడదనే దుర్మార్గ ఆలోచన పవన్, చంద్రబాబు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల సంక్షేమానికి అహర్నిశలూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు.

## న్యూస్‌రీల్

### ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారిగా అవులయ్య



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారిగా ఎ.అవులయ్య నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎం.సునీత అనకాపల్లి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారిగా బదిలీ అయ్యారు. అవులయ్య గురువారం కలెక్టర్ రాజాబాబును ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

**మెప్మా పీడీగా వెంకట నారాయణ**

మెప్మా పీడీగా పి.వెంకటనారాయణ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి బాధ్యతలను పశ్చిమగోదావరి జిల్లా మెప్మా పీడీ ఇమ్మాన్యుయేల్ నిర్వహించారు. గుంటూరు జిల్లా మెప్మా పీడీగా పని చేస్తున్న వెంకటనారాయణను ఇక్కడ నియమించారు. ఆయన గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రాజాబాబును మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు.

### విజయవాడ రైల్వేస్టేషన్‌లో ర్యాపిడో సర్వీస్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ఆకాంక్షలకు అనుగుణంగా ర్యాపిడో బైక్ పికప్, డ్రాపింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం విజయవాడ రైల్వేస్టేషన్ తూర్పు ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ర్యాపిడో పాయింట్‌ను డీఆర్‌ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూ ఇనోవేటివ్ నాన్-ఫేర్ రెవెన్యూ ఐడియా స్కీంలో భాగంగా విజయవాడ డివిజన్, ర్యాపిడో భాగస్వామ్యంతో ప్రయాణికులకు సేవలు అందించనున్నట్లు తెలిపారు. దీనికి స్టేషన్ బయట 300 చదరపు అడుగుల స్థలాన్ని తాత్కాలిక పద్ధతిలో ర్యాపిడోకు లీజుకు ఇచ్చామన్నారు. ఈ సేవలు ఇప్పటికే రాజమండ్రిలో ఉండగా తాజాగా విజయవాడలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒంగోలు, కాకినాడ టౌన్, ఏలూరు స్టేషన్లలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, ర్యాపిడో ప్రతినిధులు పాల్గొన్నారు.

### 5 నుంచి స్వర్ణభారత్‌లో ఫొటోగ్రఫీ కోర్సు

ఉంగుటూరు: ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి ఉచిత శిక్షణ కేంద్రంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్వశక్తి డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన 18 నుంచి 45 ఏళ్ల వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ పొందే వారికి ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నామని తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తి ఉన్నవారు ఆధార్, రేషన్ కార్డుతో ట్రస్ట్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 63042 54730, 94407 72382 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### పండుగలా పింఛన్ల పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక 80.60 శాతం పంపిణీ పూర్తైంది. జిల్లాలో మొత్తం 2,39,078 మందికి 1,92,688 మంది పింఛన్ అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా జి.కొండూరు మండలంలో 91.03 శాతం, నందిగామ (అర్బన్)లో 88.21 శాతం, విజయవాడ అర్బన్‌లో 88.07 శాతం, కంచికచర్లలో 86.5 శాతం, విస్సన్నపేటలో 86.33 శాతం పంపిణీ పూర్తైంది

## బీసీలకు పెద్దపీట వేసిన ఏకైక సీఎం జగన్

భవానీపురం (విజయవాడపశ్చిమ): బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో సైతం చేయని విధంగా ఏపీలో బీసీలకు చట్ట సభల్లో 65 శాతం స్థానం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఏపీ స్టేట్ బీసీ కమిషన్ మెంబర్ డాక్టర్ ఎస్.మారేష్ స్పష్టం చేశారు. ఏపీ బీసీ కమిషన్ మెంబర్‌గా నియమితులైన ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ మారేష్‌ను ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్న వెంకట నారాయణ ఆధ్వర్యాన గురువారం విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో సత్కరించారు. మారేష్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం నినాదంతో ముందుకెళ్తున్న సీఎం జగనన్నకు వెనుకబడిన తరగతి వారుఅండగా ఉంటారని చెప్పారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉల్లిబోయిన రాజు, యూత్ అధ్యక్షుడు కోలా ఏడుకొండలు, కార్యదర్శులు సాంబశివరావు, జక్కా రాంబాబు, ఉపాధ్యక్షులు పడిగి బాలు, కృష్ణాజిల్లా అధ్యక్షుడు తుమ్మా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మారేష్‌ను సత్కరిస్తున్న కొర్న నారాయణ తదితరులు

## ఏపీలో గరిష్టస్థాయిలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధి

డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఏపీకి రైల్వే బడ్జెట్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 9,138 కోట్లు కేటాయింపులు జరగడంపై విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులపై రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వర్చువల్‌గా నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. రైల్వే మంత్రి రెండు తెలుగు రాష్ట్రాలకు కేటాయించిన బడ్జెట్ వివరాలను వెల్లడించారు. అనంతరం డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ ఏపీతో పాటు విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై మాట్లాడారు. ఏపీకి బడ్జెట్‌లో రూ. 9,138 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 2009-14లో ఏపీ, తెలంగాణకు ఉమ్మడిగా కేటాయించిన బడ్జెట్ కేవలం సగటున రూ. 886 కోట్లు మాత్రమే అన్నారు. అప్పటి కేటాయింపులతో పోల్చుకుంటే ప్రస్తుతం రాష్ట్రానికి సుమారు పదిరెట్లు పెరిగిందని వెల్లడించారు. ఇప్పటి వరకు ఏపీలో రైల్వేల అభివృద్ధికి రూ.68,059 కోట్లు కేటాయింపులు జరిగాయని తెలిపారు. రాష్ట్రంలో 97శాతం విద్యుదీకరణ పూర్తైందని చెప్పారు.



రైల్వే బడ్జెట్ కేటాయింపులపై మాట్లాడుతున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

ప్రస్తుత సంవత్సరం 246 కిలోమీటర్లు ట్రాక్ వేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం 709 ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు నిర్మించినట్లు తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో రాష్ట్రంలో 72 స్టేషన్లను ఎంపిక చేయగా విజయవాడ డివిజన్‌లోనే 20 స్టేషన్ల పునరాభివృద్ధి జరుగుతున్నాయన్నారు. విజయవాడ-గూడూరు సెక్షన్‌ల మధ్యలో విద్యుదీకరణతో మూడవ లైన్ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. విజయవాడ-దువ్వాడ సెక్షన్‌ల మధ్యలో మూడో లైన్ పూర్తికావటంతో నాలుగో లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు శ్రీనివాస్, ఎం.శ్రీకాంత్, సీనియర్ డీసీఎం వి.రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

## కళారూపాలతోనే మనో వికాసం



నాన్నా నేనే గెలిచా నాటికలో ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: కళారూపాలతోనే మనో వికాసం కలుగుతుందని సుమధుర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరసరాజు అన్నారు. సుమధుర కళానికేతన్ సంస్థ 50 వార్షికోత్సవం, నాలుగు రోజులపాటు నిర్వహించే 26 వ జాతీయ హాస్యనాటికల పోటీలను మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాలలో గురువారం నిర్వహించారు. నరసరాజు మాట్లాడుతూ కళల ముఖ్య లక్ష్యం సామాజిక చైతన్యమని ఆ దిశగా పని చేయాలని సూచించారు. సుమధుర పరిషత్ చైర్మన్ డాక్టర్ ఎస్ మురళీకృష్ణ మాట్లాడుతూ సుమధుర కళానికేతన్ సున్నితమైన హాస్యానికి చిరునామాగా మారిందన్నారు. కళానికేతన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎంసీ దాసు మాట్లాడుతూ నాటికల పోటీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహక సంఘ సభ్యుడు పిండిప్రోలు సూర్యనారాయణ మూర్తి సంస్థ లక్ష్యాలను వివరించారు. కళానికేతన్ ప్రధాన కార్యదర్శి భాస్కర శర్మ, సిద్ధార్థ కళాపీఠం సభ్యులు ఎస్.లలిత్ ప్రసాద్ సుమధుర కళానికేతన్ సేవలను వివరించారు. 2024 సంవత్సరానికి సినీ నట దంపతులు రావి కొండలరావు, రాధాకుమారి స్మారక పురస్కారాన్ని రంగస్థల నటి దర్శకురాలు జి.లహరికి అందజేశారు.

**సామాజిక సందేశంతో నాటికలు**

సామాజిక సందేశంతోపాటు నవ్వులు పూయించిన నాటికలు తొలి రోజు తొలి ప్రదర్శనగా శ్రీ కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ వారి 'నాన్నా నేనే గెలిచా' నాటికను ప్రదర్శించారు. రచన దర్శకత్వం పెద్దిబోయిన కృష్ణ హితేష్, రెండవ నాటికగా బ్రహ్మానందరావు రచించిన కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వం వహించిన ట్రీట్‌మెంట్ నాటికలను ప్రదర్శించారు.

## ఉప్పొంగిన ఉత్సాహం



రంగుల ఉత్సవానికి బయలుదేరిన విగ్రహాలతో ఆలయ ఈఓ రమేష్‌నాయుడు, చైర్మన్ శ్రీనివాసరావు, విమలాభాను, తదితరులు

- వైభవంగా శ్రీతిరుపతమ్మ రంగుల మహోత్సవం
- రంగుల మండపానికి చేరుకున్న విగ్రహాలు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ వారి రంగుల మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. దీనిలో భక్త జనం ఉప్పొంగిన ఉత్సాహంతో పాల్గొన్నారు. రెండేళ్లకొకసారి ఉత్సవం నిర్వహిస్తారు. ఉదయం 5.54 గంటలకు వేద పండితులు, ఆలయ అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య మహా నివేదన అనంతరం శ్రీతిరుపతమ్మ గోపయ్యస్వాముల ఉత్సవమూర్తులు సహదేవతలు మల్లమ్మ, చంద్రయ్యలు, శ్రీఅంకమ్మ, పెద్దమ్మలు, మద్దిరావమ్మ, వున్నవూరు అంకమ్మ, గుర్రం వాహనాలను ఆలయం నుంచి తీసుకొచ్చారు. ఈవో కె. రమేష్‌నాయుడు, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సతీమణి, ఫౌండేషన్ చైర్‌పర్సన్ విమలాభాను, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, తహసీల్దార్ కె.లక్ష్మీ కల్యాణి, ఎంపీడీవో సాయిహర్ష, , పాలక వర్గ సభ్యులు, అధికారుల సమక్షంలో ఆలయం నుంచి వెలుపలకు తీసుకువచ్చారు. అనంతరం విగ్రహాలను సేవకులు(రజకులు)తలపై పెట్టుకొని మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్ఐ సీహెచ్ కె.దుర్గాప్రసాద్, అభిమన్యు అమ్మవార్ల విగ్రహాలకు స్వాగతం పలికి నీళ్ల వారు పోసి విగ్రహాలను తలపై పెట్టుకొని మోసి అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు విగ్రహాలు రంగుల మండపం వద్దకు చేరుకున్నాయి. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో పి.సాయిబాబు, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఉమాపతి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మాస్టర్స్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు వరప్రసాద్



విజయవాడ స్పోర్ట్స్: మాస్టర్స్ టెన్నిస్ ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు ప్రాతినిధ్యం వహించే భారత జట్టులో విజయవాడ క్రీడాకారుడు సీబీఎస్ వరప్రసాద్ చోటు దక్కించుకున్నారు. 75 ఏళ్ల విభాగంలో ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన పలు పోటీల్లో అత్యధిక ర్యాంకు సాధించి ప్రపంచ పోటీలకు అర్హత సాధించారు. ఈ ఏడాది మార్చి 10 నుంచి 15వ తేదీ వరకు టర్కీలోని మనవ్‌గట్‌లో జరిగే పోటీల సింగిల్స్, డబుల్స్‌ల్లో పాల్గొననున్నారు.

## ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి చర్యలు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కృష్ణా కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో రీ-సర్వే పనుల పురోగతి, అసైన్డ్ భూములు, వైద్య, ఆరోగ్యశాఖ, ఉపాధి హామీ పథకం, గ్రామాల్లో తాగునీరు, పది, ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణ అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ రాజాబాబు ఆయా అంశాలపై జిల్లాలోని పురోగతిని సీఎస్‌కు వివరించారు. జిల్లాలో మూడో దశ రీ-సర్వేలో 125 గ్రామాల్లో ఫైనల్ ఆర్‌వోఆర్ పూర్తైందని, స్టోన్ ప్లాంటేషన్ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్.. అధికారులకు పలు సూచనలు చేశారు.



## 90's టాయ్.. ఎంజాయ్

టప టపాల బండి.. 1990 దశకం నాటి బాలలకు బాగా ఇష్టమైన ఆట వస్తువు. 1990 నుంచి 2005 మధ్య కాలంలో గ్రామాల్లో ఈ బండ్లకు విశేష ఆదరణ ఉండేది. ఈ తరం పిల్లలకు సెల్‌ఫోన్ అంటే ఎంత ఆసక్తో.. ఆ తరం చిన్నారులకు అంతకు మించి ఇష్టమైనది ఇది. ఈ బండికి తాడు కట్టి లాక్కొని వెళ్తుంటే టప టపమంటూ వచ్చే శబ్దం పిల్లల్లో ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని నింపేది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కళాకారుడు ఈ బండ్లను తయారు చేసి, బెజవాడ బందరు రోడ్డులో విక్రయిస్తున్న దృశ్యం బాల్య స్మృతులను జ్ఞప్తికి తెచ్చింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## నేటి నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

గన్నవరం: ఆడుదాం ఆంధ్ర జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలకు స్థానిక కేవీఆర్ ఇండోర్ స్టేడియం సిద్ధమైంది. కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాలకు చెందిన పురుషులు, మహిళల జట్లకు ఇక్కడ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు హాజరైన క్రీడాకారులకు, ప్రతినిధులకు భోజన సదుపాయం కల్పించామని ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ తెలిపారు.

## భర్త మరణానికి కారణమైన భార్యకు జైలు

పెనమలూరు: భర్తను వేధింపులకు గురి చేసి అతని మరణానికి కారణమైన భార్యకు జైలు శిక్ష విధిస్తూ విజయవాడ 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి డి.శేషయ్య గురువారం తీర్పు చెప్పారు. వణుకూరు గ్రామానికి చెందిన కంచర్ల అమర్‌నాథ్‌కు 2013లో బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన బిందుతో వివాహమైంది. బిందు తరచుగా భర్తను వేధిస్తూ, మానసికంగా ఇబ్బందులకు గురిచేసింది. భర్తపై బాపులపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. ఈ వేధింపులు తాళలేక అమర్‌నాథ్ 2017 మే ఐదో తేదీన ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడి సోదరుడు సంజయ్ ఫిర్యాదు మేరకు బిందుతో పాటు ఆమె కుటుంబ సభ్యులు ముగ్గురి పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పీపీ వై.పుల్లారెడ్డి ఆధ్వర్యంలో 15 మంది సాక్షులను విచారించారు. నేరారోపణ రుజువు కావటంతో కంచర్ల బిందుకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

## ఆరోగ్య శ్రీ అమలుపై ప్రత్యేక దృష్టి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్య శ్రీ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి మూడో దశ రీసర్వే, ఈనామ్–అసైన్డ్ భూములు, స్త్రీ–శిశు సంక్షేమం – ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్, ఆరోగ్యం, వైద్యం– కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ వంటి అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశా తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వైద్య ఆరోగ్యం, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ అధికారులతో కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన పథకాలు జిల్లాలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా అధికారులు కృషిచేయాలన్నారు. ఆరోగ్య శ్రీ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విజయవాడ ఆర్డీఓ భవానీశంకర్, డ్వామా పీడీ కె.సునీత, డీఎంహెచ్ఓ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ జె.సుమన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ వ్యవస్థతో మెరుగైన ఫలితాలు

- ముస్సోరి ఫ్యాకల్టీ సుబరాన్స్‌త్రిపాఠి
- కల్వపూడి ఆగ్రహారంలో స్వామిత్వ సర్వే పరిశీలన



ప్రభుత్వ సంక్షేమ పథకాలను సుబరాన్స్ త్రిపాఠికి వివరిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు ఏలేటి ఆంజనేయులు

గుడివాడరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో మెరుగైన ఫలితాలు లభిస్తున్నాయని ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, బీఎస్ యుగంధర్ సెంటర్ ఆఫ్ రూరల్ స్టడీస్ ఫ్యాకల్టీ సుబరాన్స్ త్రిపాఠి పేర్కొన్నారు. గుడివాడ మండలంలోని కల్వపూడి అగ్రహారంలో స్వామిత్వ సర్వే జరుగుతున్న తీరు, సిబ్బంది విధులను పరిశీలించి తెలుసుకునేందుకు ఆయన గురువారం సచివాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన స్వామిత్వ సర్వే రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడు ఏలేటి ఆంజనేయులు(ఆగస్టిన్) రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం సుబరాన్స్ త్రిపాఠి మాట్లాడుతూ.. పేదవర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల చాలా ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కరోనా సమయంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. స్వామిత్వ సర్వే వల్ల చాలా ఉపయోగాలు ఉంటాయని, దీనిని తమ రాష్ట్రంలో ఎలా అమలు చేయాలో తెలుసుకునేందుకు ఇక్కడికి వచ్చానని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పేదప్రజలకు అందిస్తున్న సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్, సర్పంచ్ పోటూరి వెంకటేశ్వరమ్మ, ఈఓపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, డెప్యూటీ తహసీల్దార్ కిషోర్, పంచాయతీ కార్యదర్శి హరి కృష్ణ, పలువురు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## రక్షణ ప్రణాళికలో మరియమాత పాత్ర విశిష్టం



సమష్టి దివ్యబలిపూజ సమర్పిస్తున్న ఫాదర్ యుగల్ కుమార్

గుణదల (విజయవాడ తూర్పు): దేవుని రక్షణ ప్రణాళికలో మరియ మాత పాత్ర విశిష్టమైనదని విశాఖపట్నం మేత్రాసన గురువు ఫాదర్ యుగల్ కుమార్ అన్నారు. గుణదల మేరిమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న నవదిన ప్రార్థనల రెండో రోజైన గురువారం నాటి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు సందేశమిచ్చారు. సర్వమానవాళిని దేవుడి రక్షణ ప్రణాళికలో నడిపించేందుకు లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ఈ లోకానికి అరుదెంచారని తెలిపారు. తన అద్వితీయ కుమారుడి ద్వారా మరియ మాత లోకాన్ని రక్షిస్తోందన్నారు. మరియమాతను ఆశ్రయించిన వారి జీవితాల్లో శాంతి, సమాధానాలు వెల్లివిరుస్తాయన్నారు. ఆమె ఆశీర్వాదంతో ఈ ఏడాది గుణదల పుణ్యక్షేత్రంలో శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. అంతకు ముందు పలు విచారణల నుంచి వచ్చిన మఠకన్యలు, భక్తులు కొవ్వొత్తులు చేతబట్టి దివ్య సత్ప్రసాద ఆరాధనతో కొండపైకి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డయాసిస్ గురువులు ఫాదర్ మరియన్న, ఫాదర్ ప్రవీణ్, ఫాదర్ ఫ్రాన్సిస్, ఫాదర్ రత్న కిషోర్, ఫాదర్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక దాడికి యత్నం కేసులో ఐదేళ్లు జైలు

విజయవాడస్పోర్ట్స్: వృద్ధురాలిపై లైంగిక దాడికి యత్నించిన యువకుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ కం ఐదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజదేవి గురువారం తీర్పు చెప్పారు. గత ఏడాది మే 14న కొండపల్లిలో నివసించే ఓ వృద్ధురాలి ఇంట్లోకి రాత్రి ఒంటి గంట సమయంలో అదే ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల మార్కపూడి జాషువా ప్రవేశించాడు. నిద్రిస్తున్న ఆమెపై లైంగికదాడికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు రావడంతో జాషువా అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కేసును తీవ్రంగా పరిగణించిన పోలీస్ కమిషనర్ టి.కె. రాణా ట్రయిల్ త్వరగా పూర్తి చేయాలని కోర్టు మానటరింగ్ సెల్ అధికారులను ఆదేశించారు. బాధితురాలి తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రగిరి విష్ణువర్ధన్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నిందితుడు జాషువాకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు.





## రేపు హాకీ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: హాకీ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలుర, జూనియర్ బాలికల పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఎన్టీఆర్ జిల్లా జట్లను ఈ నెల మూడో తేదీన ఎంపిక చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి కె.రాజశేఖర్ గురువారం తెలిపారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఆ రోజు ఉదయం ఏడు గంటలకు క్రీడా జట్ల ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 2008 జనవరి ఒకటో తేదీ తరువాత పుట్టిన వారు మాత్రమే ఈ ఎంపిక పోటీలకు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో ఎంపిక ప్రాంగణంలో అదే రోజు సంప్రదించాలని సూచించారు. ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జిల్లా జట్టు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు కర్నూలులోని డీఎస్ఏ స్టేడియంలో జరిగే రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో, జూనియర్ బాలికల జట్టు తొమ్మిది నుంచి 14వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని వివరించారు.

## ఆర్టీసీ బస్సు ఢీ.. యువకుడి దుర్మరణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జక్కంపూడి వైఎస్సార్ కాలనీ 113 బ్లాక్‌లో నీలపు శ్రీనివాసరావు కుటుంబం నివసిస్తోంది. అతనికి ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు నీలపు సతీష్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. బుధవారం రాత్రి 9.45 గంటల సమయంలో సరుకులు తెచ్చేందుకు సతీష్ బైక్‌పై బయటకు వెళ్లాడు. కాలనీ మెయిన్‌రోడ్డు మీదుగా అతను ప్రయాణిస్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ సిటీ బస్సు ఢీకొట్టింది. సతీష్ తీవ్రంగా గాయపడటంతో స్థానికులు అతని తండ్రి శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. శ్రీనివాసరావు ఘటనాస్థలానికి చేరుకుని సతీష్‌ను హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరి స్థితి విషమించి గురువారం తెల్లవారుజామున సతీష్ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పీఎంఎస్ ప్రసాద్‌కు తెలుగు భాషారత్న అవార్డు



పామర్రు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపీ తెలుగు అధికార భాషా సంఘం, తెలుగు భాషా అభివృద్ధి సాధికార సంస్థలు పామర్రుకు చెందిన రచ యిత, సామాజిక సేవా కార్యకర్త పి.ఎం.ఎస్.ప్రసాద్‌ను తెలుగు భాషారత్న అవార్డుకు ఎంపిక చేస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చాయి. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు ఈ ఉత్తర్వులను అందజేశారని తెలిపారు. ఈ నెల ఐదో తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే సదస్సులో ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకుంటానని ప్రసాద్ వెల్లడించారు. పత్రికా రంగం ద్వారా తెలుగు అభ్యున్నతికి చేసిన కృషికి ఫలితంగా ఈ అవార్డు లభించిందని పేర్కొన్నారు. ప్రసాద్‌ను పామర్రు కళా పరిషత్, లయన్స్ క్లబ్, మానవత సేవసంస్థ, రెడ్‌క్రాస్, విశ్వ హిందూ పరిషత్, చాంబర్ ఆఫ్ కామర్స్, సమరసత ప్రతినిధులు అభినందించారు.

## మున్సిపల్ శాఖలో బదిలీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ లక్ష్మీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా బి.రమ్యకీర్తన నియమితులయ్యారు. సీఆర్‌డీఏ ఎస్టేట్స్ అసిస్టెంట్ మేనేజర్‌గా గ్రేడ్–2 మున్సిపల్ కమిషనర్ బి.వినీషా నియమితులయ్యారు. నందిగామ మున్సిపల్ కమిషనర్ జయరామ్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని నియమితులు కాగా.. గుడివాడ మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న టి.వి.రంగారావు ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు.

## బంగారం తరలిస్తున్న ఐదుగురు అరెస్టు

3,681 గ్రాముల బంగారం స్వాధీనం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సరైన బిల్లులు లేకుండా బంగారం తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను విజయవాడ సత్యనారాయణపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3,681 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. రైలులో బంగారం అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సత్యనారాయణపురం ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐలు షరీఫ్, దుర్గాభవానీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలోని పార్శిల్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం ఐదు గంటల సమయంలో అనుమానాస్పదంగా ఉన్న చెలువాది శ్రీనివాసరావు, చెలువాది నాగ పవన్, సంబ్రాబు మహిమ, పంచుమర్తి వెంకట భాస్కర్, మర్రి బాలకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను సోదా చేయగా సరైన బిల్లులు, ఆధారాలు లేని 3,681 గ్రాముల బంగారం ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి బంగారాన్ని ఇన్‌కం టాక్స్ అధికారులకు అప్పగించారు.

## రైలు ఢీకొని వివాహిత దుర్మరణం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): రైలు ఢీకొని వివాహిత మృతి చెందిన ఘటన గ్రామ సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జగ్గయ్యపేట పట్టణానికి చెందిన షేక్ షాహినా (30) వివాహిత మధ్యాహ్నం సమయంలో ద్విచక్ర వాహనంతో రైల్వే ట్రాక్‌పైకి వెళ్లింది. ఈ క్రమంలో గూడ్సు రైలు వేగంగా వచ్చి ఆమెను ఢీ కొట్టింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన సమీపంలోని గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## క్లుప్తంగా

### చేతుల పరిశుభ్రతతో వ్యాధుల నివారణ



పటమట(విజయవాడతూర్పు): చేతుల పరిశుభ్రతతో ప్రజల ఆరోగ్యానికి భద్రత కలుగుతుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. రాజీవ్‌గాంధీ పార్కులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, యూనిసెఫ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కాంటాక్ట్‌లెస్ హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఒకరు వాడిన హ్యాండ్ వాష్‌ను ఇంకొకరు వాడకుండా ఉండేందుకు కాంటాక్ట్ లెస్ హ్యాండ్ వాష్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. పార్కుకు వచ్చే ప్రజలు తప్పనిసరిగా ఈ కాంటాక్ట్ లెస్ హ్యాండ్ వాష్ స్టేషన్ వినియోగించుకోవాలని కోరారు. చేతుల పరిశుభ్రత ద్వారా 70 శాతం వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని వెల్లడించారు. కోవిడ్, ఇతర వైరస్‌లను జయించడానికి చేతుల పరిశుభ్రత ఆవశ్యకతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్ ) శకుంతల, ఉద్యానవన విభాగం అధికారి చొప్పర శ్రీనివాసులు, మెప్మా, పట్టణ సామాజికాభివృద్ధి విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఏఆర్ ఏడీసీపీగా కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఏఆర్ అడిషనల్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏడీసీపీ)గా కుంభా కోటేశ్వరరావు గురువారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు ఏఆర్ ఏఎస్పీగా పని చేస్తున్న ఆయన ఎన్టీఆర్ కమిషనరేట్‌కు నియమితులయ్యారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం పోలీస్ కమిషనర్ టి.కె.రాణాను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు.

### 500 మందికి అన్నదానం



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మాగాంధీరోడ్డులోని కళానికేతన్ పక్కన ఉన్న సాయి బాబా మందిరం వద్ద మొగల్రాజపురానికి చెందిన పాలా భాగ్యరాజ్ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. మందిరానికి వచ్చే భక్తులతో పాటు, సమీప ప్రాంతాల్లో షాపుల్లో పనిచేసే వారు సైతం సుమారు 500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పాల భాగ్యరాజ్ మాట్లాడుతూ ఏడాదిగా ప్రతి గురువారం మందిరం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ



ఆటోనగర్ (విజయవాడ తూర్పు): లయన్స్ క్లబ్ ఆటోనగర్ జెమ్స్ ఆధ్వర్యంలో 14 మంది పేద మహిళలకు మాజీ జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ శ్రీశాంతి కుట్టుమిషన్‌లు గురువారం పంపిణీ చేశారు. బెవర ఇందిర, నాగేశ్వరరావు, కాంతారావుల ఆర్థిక సహకారంతో వీటిని పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా బెవర నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆటోనగర్ జెమ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా పేదవారికి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు.

### అలరించిన భక్తి రంజని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో చెన్నైకి చెందిన ఆర్ పద్మా చక్రవర్తి, ఎస్. నాగలక్ష్మిల బృందం ఆలపించిన భక్తిరంజని భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలు కీర్తనలు ఆలపించారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలు అందజేశారు.

# మహిళల జీవితాల్లో వెలుగులు

**మహిళల అభివృద్ధికి ఆసరా**

- తూర్పులో 3183 గ్రూపులకు రూ.31.55 కోట్లు అందజేత
- నాలుగో విడత నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- మాకు సీఎం జగన్ పెద్ద సాయం చేస్తున్నాడంటూ మహిళల హర్షం
- అండగా ఉంటామంటున్న మహిళలు



మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న అవినాష్, ఎంపీ కేశినేని నాని తదితరులు



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మా కోసం ఎన్నో చేస్తున్నాడు.. మేము జగనన్న కోసం పనిచేస్తామంటూ మహిళలు అంటున్నారు. ఇప్పటి వరకూ ఎన్నో ప్రభుత్వాలను చూసాం. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలన్నీ విస్మరించేవారు. చంద్రబాబు సైతం డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి, రూపాయి కూడా చేయలేదు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను ఎన్నికల్లో ఓట్లు కోసం, రాజకీయాల కోసం కాకుండా అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది నుంచే అమలు చేస్తున్నాడు. అందులో భాగంగానే నేడు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత అందుకున్నామంటూ మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మా కోసం ఎన్నో చేశారు. ప్రతి పథకాన్ని మహిళలకు అందచేస్తున్నారు. దళారుల ప్రమేయం లేకుండా ఇంటి వద్దకే వచ్చి అర్హులను వలంటీర్లు గుర్తిస్తున్నారంటూ పలువురు మహిళలు పేర్కొన్నారు.

**తూర్పులో రూ.31.55 కోట్లు విడుదల..**

వైఎస్సార్ ఆసరా నాలుగో విడత ప్రభుత్వం విడుదల చేసింది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 3183 గ్రూపులకు గాను, రూ.31.55 కోట్లు విడుదల చేసింది. ఇప్పటి వరకూ చెప్పిన విధంగా నాలుగు విడతలుగా డ్వాక్రా రుణమాఫీని ఇచ్చారు. కాగా గురువారం బృందావనకాలనీలోని పండుగ వాతావరణంలో డ్వాక్రా మహిళల రుణమాఫీ డబ్బులు విడుదల కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మహిళలు వేలాది మంది చిరునవ్వుతో హాజరై మా జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని అంటున్నారు.

**స్వయం ఉపాధికి బాసట..**

ప్రభుత్వం ఇచ్చే ప్రతి సంక్షేమ పథకాన్ని నగరంలోని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. స్వయం ఉపాధి పొందేందుకు చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎక్కువ మంది టిఫిన్ బళ్లు, కూరగాయల వ్యాపారం, బడ్డీకొట్టు వంటి వాటితో పాటు పూల వ్యాపారం ఇలా తమకు తోచిన వ్యాపారం చేస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. గతంలో పెట్టుబడి కోసం అప్పులు చేసేవాళ్లమని, ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న పథకాలతో –అప్పులు చేయాల్సిన అవసరం లేదని వారు అంటున్నారు.

**మా కోసం ఎంతో చేస్తున్నారు**



మహిళల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో చేస్తున్నారు. మేము కూడా ఆయనకు అండగా నిలుస్తాం. నాకు నాలుగు విడతలుగా ఆసరా వచ్చింది. ఒక్కో విడతలో రూ.23,600 చొప్పున ఇచ్చారు. అంతేకాదు చేయూత కూడా వస్తుంది. ఇలా మహిళలను ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం దోహదం చేస్తుంది. మహిళలు అంతా జగన్‌కు అండగా నిలుస్తారు. –అరుణ, కృష్ణలంక

**చాలా ఆనందంగా ఉంది**



మాది జ్యోతి సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు. మేము నాలుగు విడతలుగా డ్వాకా రుణమాఫీ ఆసరా తీసుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది. ఇప్పటి వరకూ మహిళలకు అది చేస్తాం. ఇది చేస్తామని హామీలు ఇచ్చిన వారే కానీ, వాటిని అమలు చేయలేదు. ఇప్పుడు నాకు ఆసరా కింద రూ.20 వేలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. –సత్యవతి, కృష్ణలంక

**మహిళలకు అనేక పథకాలు**



నాకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా వచ్చింది. నాలుగు విడతలుగా నాకు ఉన్న రుణాన్ని బట్టి మాఫీ మొత్తాన్ని విడుదల చేయడం సంతోషంగా ఉంది. గత ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా డ్వాక్రా మహిళల కోసం ఆసరా పథకాన్ని అమలు చేశారు. అంతేకాదు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని మహిళలకే ఇవ్వడం సంతోషంగా ఉంది. –సుజాత, రామలింగేశ్వరనగర్

## చురుకుగా రక్షణ గోడ నిర్మాణ పనులు

- చివర దశకు చేరుకున్న రక్షణ ఫేజ్–3 నిర్మాణ పనులు
- వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు గోడ
- రూ.135కోట్లతో 1.05 కి.మీ పొడవున నిర్మాణం
- 90 శాతం పైగా పూర్తయిన పనులు
- తీరనున్న రణదీవెనగర్ ప్రాంత వాసుల కష్టాలు





పూర్తయిన రక్షణ గోడ మూడో దశ నిర్మాణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానది పరివాహక ప్రాంతంలో కృష్ణలంకలోని రణదీవెనగర్ నివాసులకు వరద ముంపు నుంచి శాశ్వత ఉపశమనం కలగనుంది. రాష్ట్ర ప్రభుత్వం కనకదుర్గ వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు 1.05 కిలోమీటర్ల పొడవున చేపట్టిన రక్షణ గోడ మూడో దశ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. సంవత్సరం క్రితం ప్రారంభమైన గోడ నిర్మాణ పనులు చురుకుగా సాగుతూ తుది దశకు చేరుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణానది, వరద ముంపు ప్రాంతమైన రణదీవెనగర్ కరకట్ట వాసులకు రక్షణగా వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు 1.05 కిలోమీటర్లు పొడవున సుమారు రూ.135 కోట్ల వ్యయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవంబర్ 2022లో రక్షణ గోడ రెండో దశ నిర్మాణ పనులు ప్రారంభించింది. ఎగువ నుంచి 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన ముంపు నుంచి తట్టుకునేలా రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే దాదాపు 90 శాతానికి పైగా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడల్లా కృష్ణలంక కరకట్ట ప్రాంతాలైన భూపేష్‌గుప్తానగర్, తారకరామనగర్, రణదీవెనగర్ ప్రాంతాలు వరద ముంపుకు గురై తరచూ తట్టాబుట్టా సర్దుకుని పునరావాస కేంద్రాలకు తరలి వెళ్తుండేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా రక్షణ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.123 కోట్ల వ్యయంతో తారకరామనగర్, భూపేష్‌గుప్తానగర్ వాసులకు రక్షణగా కోటినగర్ నుంచి వారధి వరకు 1.5 కిలోమీటర్ల పొడవున రక్షణ గోడ రెండో దశ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. ప్రస్తుతం వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు రణదీవెనగర్ వాసులకు రక్షణగా నిర్మిస్తున్న రక్షణ గోడ మూడో దశ నిర్మాణ పనులు చివర దశకు చేరుకున్నాయి. గోడ నిర్మాణం పూర్తయితే వరదల ముంపు నుంచి కృష్ణలంక ప్రాంత వాసులకు శాశ్వత రక్షణ కలుగనుంది.

## ప్రభుత్వ పథకాలపై లబ్బీపేటలో విస్తృత ప్రచారం



లబ్బీపేటలో పర్యటిస్తున్న వై. సిద్ధార్థ

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పార్టీ నేతలు ఇంటింటికీ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా 19వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ బావ వై.సిద్ధార్థ పార్టీ నేతలతో కలిసి గురువారం లబ్బీపేటలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వం చేసిన పనుల గురించి వివరించారు. ఆయన వెంట క్లస్టర్ 1 మండల అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్‌రావు, డివిజన్ కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, పార్టీ జిల్లా కార్యదర్శి చింతగుంట విజయ్‌తో పాటు పెద్ద సంఖ్యలో నేతలు కార్యకర్తలు ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ సైన్యం కదిలింది. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్తూ మళ్లీ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేస్తున్నారు.

## వివాహితకు అత్తింటి వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు కొత్తపేట పోలీసులను ఆశ్రయించింది. అత్తింటి వారిపై గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టైలర్‌పేట పెనుమాక దేవదాసు వీధికి చెందిన శివజ్యోతి 2021లో పెడనకు చెందిన వీణం సాయి ప్రవీణ్ పవన్‌కుమార్‌ను ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. శివజ్యోతి ప్రస్తుతం 49వ డివిజన్ 167వ సచివాలయ పరిధిలో వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తోంది. పెడనలో కాపురం ఉన్న సమయంలో అత్తింటి వారు శివజ్యోతిని వేధింపులకు గురి చేశారు. దీంతో పుట్టింటి నుంచి రూ. 7 లక్షల భర్త, అత్త పార్వతి ఆడపడుచు విష్ణుమహంతి సరితకు ఇచ్చారు. గత ఏడాది విజయవాడకు బదిలీపై వచ్చిన శివజ్యోతికి ఇక్కడ కూడా వేధింపులు ఎక్కువ కావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## యువతలో ఉద్యోగాల జోష్

**ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొరివి చైతన్య**

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన గ్రూప్ 1, గ్రూప్ 2 నోటిఫికేషన్లతో పాటు , 6100 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో యువతలో ఉద్యోగాల జోష్ నెలకొందని ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య (వర) అన్నారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు మేలు జరిగేలా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నారని చెప్పారు. అందులో భాగంగానే మెగా డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల చెంతకే పాలన ద్వారా గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి, లక్షన్నర మందికి ఉద్యోగాలు కల్పించారని, అదే విధంగా వైద్య ఆరోగ్యశాఖలో 70 వేల ఉద్యోగులు భర్తీ చేసినట్లు తెలిపారు. ఎన్నడూ లేని విధంగా వైద్యశాఖలో కొత్త పోస్టులను క్రియేట్ చేసి, వాటిని భర్తీ చేయడమే కాకుండా, ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకుండా ఎప్పుడు పోస్టు అప్పుడే భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు యువతను మోసం చేసాయని ధ్వజమెత్తారు. అంతేకాకుండా గ్రూప్1, గ్రూప్ 2 నోటిఫికేషన్‌లు విడుదల చేయడంతో యువతకు వరంలా మారిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని చెప్పారు.

## చంద్రబాబు భవిష్యత్తుకు గ్యారంటీ హాస్యాస్పదం

**గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమంలో దేవినేని అవినాష్**



మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న దేవినేని అవినాష్, మాధురి

లబ్బీపేట(విజయవాడతూర్పు): చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇవ్వలేని గ్యారంటీ ఇప్పుడు అధికారంలోకి వస్తే ఇస్తాననడం హాస్యాస్పదమని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఎద్దేవా చేశారు. అసలు వాళ్ల పార్టీకే గ్యారంటీ ఉందా అని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో చేపట్టిన గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం గురువారం బాడవపేట, ఉడ్‌పేట ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా నాలుగున్నరేళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాంతంలో చేయబోయే పనులతో ముద్రించిన మీ అవినాష్ అన్నహామీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజల్లో రోజు రోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి, ప్రతిపక్ష టీడీపీకి, దాని తోక పార్టీలకు ముచ్చెమటలు పడుతున్నాయని తెలిపారు. వాళ్ల పార్టీ కార్యకర్తల్లో ధైర్యం చెప్పడానికి మాత్రమే అనుకూల మీడియాలో, సోషల్ మీడియాలో అధికారంలోకి వస్తున్నాం అని పిచ్చి ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం కల అన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే ప్రజలు అండగా నిలుస్తున్నారని చెప్పారు. మంచి చేస్తున్నాం కాబట్టే ప్రజల్లో ధైర్యంగా వస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ విజయం సాధించడం ఖాయమని అవినాష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, ఇతర నేతలు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## నగరాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి




స్థాయీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

**స్థాయీ సంఘం సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి**

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో గురువారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. అజెండాలో మొత్తం 25 అంశాలు ప్రతిపాదింగా అందులో 18 ఆమోదిస్తూ సభ్యులు తీర్మానం చేశారు. రెండు అంశాలు వాయిదా వేయగా మూడు ర్యాటిఫై చేశారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా, మరో అంశాన్ని ధ్రువీకరిస్తూ తీర్మానించారు. ఆయా విభాగం అధికారులు, స్థాయీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**ప్రధానాంశాలు**

- సర్కిల్–1 పరిధిలోని 44వ డివిజన్ ఆర్ఆర్ నగర్ వాటర్ ట్యాంక్ రిటైనింగ్ వాల్ సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన రూ.47.41 లక్షలు వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రామరాజ్యనగర్, రాజీవ్‌నగర్, కృష్ణలంకలోని మెటర్నిటీ హాస్పటల్స్‌లో వైద్య సేవలు అందిస్తున్న డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్టాఫ్‌నర్స్, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆయాలు, ల్యాబ్ అటెండెంట్స్ మొత్తం 14 మంది వైద్య సిబ్బంది కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఈ ఏడాది మార్చిలో గడువు ముగుస్తున్నందున వారికి గడువు పొడిగించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు వాయిదా వేస్తూ తీర్మానించారు.
- సర్కిల్–2 పరిధిలోని భగత్‌సింగ్ రోడ్డు, బీఆర్‌టీఎస్‌రోడ్డు, ఫుడ్ జంక్షన్ నుంచి అజిత్‌సింగ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులకు గురైనందున ఈ రోడ్డులో బీటీరోడ్డు లేయర్ వేయటానికి అవసరమయ్యే రూ.45.51 లక్షలు వీఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి విడుదల చేయాలని వచ్చిన ప్రతిపాదను సభ్యులు ఆమోదించారు.

## విజయవాడ ఆర్డీవోగా భవానీ శంకర్

**కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీఓ**



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఆర్డీఓగా బీహెచ్ భవానీ శంకర్ గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. భవానీ శంకర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆర్డీవో భవానీ శంకర్ మాట్లాడుతూ చాలా కీలకమైన విజయవాడ డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందించి.. వాటి లక్ష్యాలు నెరవేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించండి

**కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

పటమట(విజయవాడతూర్పు): నగరవాసులు ఎదుర్కొనే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. రాణిగారితోట ప్రాంతంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోపం ఉండకూడదనే ఉద్దేశంతో డ్రెయిన్లు, రోడ్లు నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికంగా విధులు నిర్వహిస్తున్న ప్రజారోగ్య కార్మికులకు డ్రెయిన్లలో పూడిక తీయాలని కోరారు. ఇంజినీరింగ్ సిబ్బందికి గ్రంథాలయం దగ్గర సీసీ రోడ్ వేయాలని, బాలాజీనగర్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ వద్ద ఉన్న రోడ్డు పాడైనందున ప్యాచ్ వర్క్ వేయాలని తారక రామారావు నగర్‌లో డ్రెయిన్ సరిగ్గా లేకపోవడం గమనించి, వర్క్‌ను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. ప్రజలకు స్ట్రీట్ లైటింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు స్థానిక కార్పొరేటర్ కోరగా ఆయన వెంటనే డెప్యూటీ ఇంజినీర్ (ఎలక్ట్రికల్) కు జంక్షన్ల వద్ద హైమాస్ట్ స్ట్రీట్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. టౌన్ ప్లానింగ్ సిబ్బందికి కాంపౌండ్ వాల్ ఆక్రమణలు తొలగించి క్లియర్ మార్కింగ్‌లో ఇవ్వాలన్నారు. ఈ పర్యటనలో 17 వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, సీఈ ఎం. ప్రభాకర్ రావు, ఇంజినీరింగ్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### రిటైర్డ్ పోలీసు అధికారులు, సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తూ జనవరి 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సిబ్బందికి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు ఆత్మీయ వీడ్కోలు పలికారు. విజయవాడలోని కమిషనరేట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ అయిన ఎస్సీ, ఎస్టీ సెల్ ఎస్ఐ సత్యనారాయణ, సింగ్‌నగర్ స్టేషన్ ఏఎస్ఐ హేమచందర్, పటమట స్టేషన్ ఏఎస్ఐ దుర్గారావు, ఏఆర్ ఏఎస్ఐలు రామబ్రహ్మారావు, సాంబశివరావు, సీటీసీ హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్‌మాలిక్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణలను శాలువాలతో సత్కరించారు. సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు సేవలందించిన వీరిని అభినందించారు.

### రద్దీ సమయంలో ఇబ్బందులకు గురి కావద్దు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి రద్దీగా ఉండే సమయంలో విచ్చేసి ఇబ్బందులకు గురి కావద్దని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు వృద్ధులు, వికలాంగులకు సూచించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో వాటిని గురువారం చైర్మన్ పరిశీలించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి మహా నివేదన సమర్పించే తరుణంలోనూ, ఆ తర్వాత గంట వరకు క్యూలైన్లు రద్దీగా ఉంటున్న నేపథ్యంలో వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక దర్శన సమయాన్ని కేటాయించినట్లు రాంబాబు పేర్కొన్నారు. రద్దీ సమయంలో విచ్చేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని, ఉదయం 11 గంటల లోపు, మధ్యాహ్నం 2 గంటల తర్వాతే దర్శనానికి విచ్చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేకంగా దర్శనం కల్పించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

### పేటకు తరలిన స్వామివార్ల విగ్రహాలు

పెనుగంచిప్రోలు: రంగుల మహోత్సవంలో భాగంగా శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారితోపాటు సహదేవతల విగ్రహాలు గురువారం జగ్గయ్యపేటకు రంగులకు తరలివెళ్లాయి. ముందుగా అమ్మవారికి మొదటి బోనం సమర్పించేందుకు ఆలయ అర్చకులు, పాపమాంబ వంశీకులు మునేరు నుంచి నీళ్లు, తీర్థపు బిందె తీసుకు వచ్చారు. విగ్రహాలను రజకులు తలపై పెట్టుకొని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, రంగుల మండపం వద్దకు చేర్చారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండ్లపై స్వామివార్ల విగ్రహాలు జగ్గయ్యపేటకు తరలివెళ్లాయి. ఎడ్లబండ్ల వద్ద ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి తదితరులున్నారు.



## ఫెరారీకి హామిల్టన్!

ఏడుసార్లు ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్, బ్రిటన్ దిగ్గజ రేసర్ లూయిస్ హామిల్టన్ మెర్సిడెస్ జట్టును వీడనున్నాడు. 2013 నుంచి మెర్సిడెస్ తరఫున పోటీపడ్డ హామిల్టన్ ఈ ఏడాది తర్వాత ఆ జట్టుతో బంధం తెంచుకోనున్నాడు. 39 ఏళ్ల హామిల్టన్ 2025 సీజన్‌లో ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం దాదాపు ఖరారైంది. హామిల్టన్ 2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020లలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాడు. 2021లో సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి తర్వాత హామిల్టన్ మరో రేసులో విజేతగా నిలువలేకపోయాడు.

## సెమీస్‌లో వైదేహి-రష్మిక జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6-2, 6-1తో మూడో సీడ్ కరోల్ మొనెట్ (ఫ్రాన్స్)-యసీనా (రష్యా) జంటపై నెగ్గింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

## క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-15, 24-22తో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మిథున్ 21-9, 13-21, 21-17తో కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అష్మిత 21-12, 15-21, 21-17తో యు పో పాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... మాళవిక 22-24, 7-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది.

## భారత్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌పై పాకిస్తాన్‌లో అనాసక్తి



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైదానంలో పోటీ అంటేనే ఓ సమరాన్ని తలపిస్తుంది. పెద్ద హడావుడి, హంగు, ఆర్భాటం అంతా కనిపిస్తుంది. అయితే ఇదంతా క్రికెట్‌కే పరిమితం. టెన్నిస్ అంటే ఆసక్తి అంతంతమాత్రమే! ఇప్పుడు కూడా ఆరు దశాబ్దాల తర్వాత ఇరు జట్ల మధ్య పాక్ గడ్డపై ప్రతిష్టాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 పోటీలు జరగాల్సి ఉంటే... దేశంలో, రాష్ట్రంలో కాదుకదా... కనీసం వేదికైన ఇస్లామాబాద్‌లో కూడా చడీచప్పుడు లేనేలేదు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేవలం మీడియా, పాకిస్తాన్ టెన్నిస్ సమాఖ్య (పీటీఎఫ్) నిర్వాహకులు తప్ప ఇంకెవరి అడుగులు, చూపులు అటువైపు పడటం లేదు. మ్యాచ్‌ల కోసం పాస్‌లు, వీవీఐపీ పాస్‌లు కావాలనే ప్రతిపాదనలు కూడా రావట్లేదు. రేపు, ఎల్లుండి డేవిస్ కప్ మ్యాచ్ ఆడేందుకు పాకిస్తాన్‌కు వచ్చిన భారత టెన్నిస్ జట్టు సభ్యులకు అక్కడి భారత హైకమిషనర్ గీతిక శ్రీవాస్తవ విందు ఏర్పాటు చేసి ఆటగాళ్లకు బెస్టాఫ్ లక్ చెప్పారు.

# మన గెలుపు హోరు వినిపించేనా!

## విశాఖపట్నంలో నేటి నుంచి రెండో టెస్టు

| సమరానికి సిద్ధమైన భారత్, ఇంగ్లండ్ | తీవ్ర ఒత్తిడిలో టీమిండియా | ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం |
|---|---|---|

**కోహ్లి లేడు... కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా దూరమయ్యారు. గిల్, శ్రేయస్ బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టు ఆత్మవిశ్వాసాన్ని కాస్త దెబ్బ తీసిన పరిస్థితి. స్పిన్ మన బలం అనుకుంటే గత మ్యాచ్‌లో అరంగేట్ర స్పిన్నర్‌కే ఆటను అర్పించేశాం. ప్రత్యర్థిని చూస్తే దేనికైనా సిద్ధం అన్నట్లుగా దూకుడుతో 'సై' అంటోంది. రెండో టెస్టుకు ముందు భారత్ పరిస్థితి ఇది. ఇలాంటి సమయంలో విశాఖ తీరాన మన జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. 'బజ్‌బాల్'కు చెక్ పెట్టి 'భారత్ బాల్'తో సత్తా చాటాల్సి ఉంది.**

**2016లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యం ప్రదర్శించగా మ్యాచ్ 'డ్రా' అయింది. తర్వాతి నాలుగు టెస్టులు గెలిచి భారత్ చివరకు సిరీస్‌ను 4-0తో గెలుచుకుంది. 2021లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో భారత్ ఓటమి. తర్వాతి మూడు టెస్టులు గెలిచి భారత్ 3-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. గత రెండు సిరీస్‌ల తరహాలోనే టీమిండియా ఈసారీ కోలుకొని తగిన రీతిలో సమాధానమిస్తూ ముందంజ వేస్తుందా!**

సాక్షి, విశాఖపట్నం: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 0-1తో వెనుకబడిన భారత జట్టు పోరును సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా రోహిత్ శర్మ నేతృత్వంలో ప్రతీకారానికి సిద్ధమైంది. మరోవైపు తమ జోరును కొనసాగిస్తూ సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో నేటి నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్‌తో పోలిస్తే ఇరు జట్లలోనూ మార్పులు ఖాయమయ్యాయి.

### పటిదార్ అరంగేట్రం!

తొలి టెస్టు ఓటమి తర్వాతి ఇప్పుడు రెండో టెస్టుకు తుది జట్టు ఎంపిక కూడా భారత్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్ష పెడుతోంది. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో రెండు మార్పులు తప్పనిసరి. రాహుల్ స్థానంలో ఒక బ్యాటర్ స్థానం కోసం రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. గురువారం టీమ్ ప్రాక్టీస్, ఇతర అంశాలను బట్టి చూస్తే రజత్ వైపే ఎక్కువగా మొగ్గు ఉంది. భారత్ తరఫున పటిదార్ ఒకే ఒక వన్డే ఆడాడు. అశ్విన్, అక్షర్ మళ్లీ కీలకం కానుండగా జడేజా స్థానంలో మరో మాటకు తావు లేకుండా కుల్దీప్ మైదానంలోకి దిగుతాడు. అయితే కుల్దీప్ వస్తే బ్యాటింగ్ బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలో ఇంగ్లండ్ తరహాలో ఒకే ఒక పేసర్‌ను ఆడించి బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. అలా చేస్తే సిరాజ్ స్థానంలో సర్ఫరాజ్ అరంగేట్రం చేయవచ్చు. అయితే వీటన్నింటికంటే టాప్-4 బ్యాటింగ్ కీలకం కానుంది. ఓపెనర్లు రోహిత్, యశస్వి కాస్త ఓపిగ్గా ఆడితే భారీ స్కోరుకు కావాల్సిన శుభారంభం లభిస్తుంది. గిల్, అయ్యర్ ఇప్పటికైనా తమకు లభిస్తున్న వరుస అవకాశాలకు న్యాయం చేయాల్సి ఉంది.



హార్ట్‌లీ, స్టోక్స్

### పిచ్, వాతావరణం

మంచి బ్యాటింగ్ వికెట్. కాస్త బౌన్స్‌తో పాటు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన భారత్ రెండు మ్యాచ్‌లూ (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలపై) గెలుచుకుంది. వర్ష సూచన లేదు.

### తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, పటిదార్, భరత్, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్. ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, రేహాన్, బషీర్, అండర్సన్.

### అండర్సన్@184



41 ఏళ్లు దాటిన పేసర్ అండర్సన్ తన కెరీర్‌లో 184వ టెస్టులో బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో 22వ ఏడాది కానుండడం విశేషం. తను అరంగేట్రం చేసినప్పుడు ఇంకా పుట్టని రేహాన్, బషీర్‌లతో కలిసి అండర్సన్ బౌలింగ్ చేయబోతున్నాడు.



ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ తొలిసారి తన సొంత గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వైజాగ్‌కే చెందిన వికెట్‌కీపర్ భరత్‌కు 6 టెస్టుల స్వల్ప కెరీర్ తర్వాతే ఈ అవకాశం దక్కడం విశేషం. ఈ టెస్టులో జట్టు అవకాశాల గురించి భరత్ మాట్లాడుతూ... 'అన్ని ప్రణాళికలతో మేము సిద్ధంగా ఉన్నాం. తొలి టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన తప్పులపై చర్చించాం. స్వీప్ షాట్‌లపై సాధన చేశాం. మేం అలాంటి షాట్లన్నీ ఆడగలం. అయితే పరిస్థితిని బట్టే బ్యాటర్లు దానిని అమలు చేస్తారు. గత ఓటమి తర్వాత మేమేం ఆందోళనకు గురి కాలేదు. జట్టులో అంతా బాగుంది. సుదీర్ఘ సిరీస్ కాబట్టి కోలుకునే అవకాశం ఉందని మాకు తెలుసు' అని అన్నాడు.

### బరిలోకి బషీర్...

ఇంగ్లండ్ తమ తుది జట్టును గురువారమే ప్రకటించింది. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెడుతున్నాడు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్‌లీ మళ్లీ చెలరేగేందుకు సిద్ధంగా ఉండగా... అన్నింటికి మించి ఏకైక పేసర్ గా సీనియర్ బౌలర్ అండర్సన్ పునరాగమనం చేస్తుండటం విశేషం. వుడ్ స్థానంలో అతడిని ఇంగ్లండ్ ఎంపిక చేసింది. తొలి టెస్టులో ఎప్పటిలాగే తమ దూకుడైన బ్యాటింగే ఇంగ్లండ్‌ను గెలిపించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ ధాటిగా ఆడుతుండగా పోప్ ఆట ఎలాంటిదో గత మ్యాచ్ చూపించింది. స్టార్ బ్యాటర్ రూట్ అటు బౌలింగ్‌లోనూ ప్రధానపాత్ర పోషించడం జట్టు బలాన్ని పెంచింది. అటు బ్యాటింగ్‌తో, ఇటు కెప్టెన్సీతో స్టోక్స్ విలువైన ఆటగాడు. ఇంగ్లండ్ ముగ్గురు స్పిన్నర్లు ఈసారి భారత్‌ను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరం.



రోహిత్

## బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442 కోట్లు

**గతేడాది కంటే రూ.45.36 కోట్లు ఎక్కువ**

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడల కోసం రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ. 3,396.96 కోట్లు క్రీడలకు వెచ్చిస్తే ఈసారి రూ.45.36 కోట్లు పెంచారు. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం రూ. 900 కోట్లు (రూ.20 కోట్లు పెరుగుదల), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు రూ. 822.60 కోట్లు (రూ.26.83 కోట్లు పెంపు) కేటాయించారు. మౌలిక వసతుల కల్పన, అథ్లెట్లకు ఆధునిక క్రీడా సామాగ్రి, కోచ్‌ల నియామకం కోసం ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ 340 కోట్లు (రూ.15 కోట్లు పెంచారు) ఇవ్వనున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బలోపేతానికి రూ. 22.30 కోట్లు కేటాయించారు. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూ. 91.90 కోట్లు (రూ.8.69 కోట్లు హెచ్చింపు) కేటాయించారు.

## ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని పీకేఎల్ నిర్వాహకులైన మషాల్ స్పోర్ట్స్ తెలిపింది. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. మిగతా నాలుగు జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఫిబ్రవరి 26న ఎలిమినేటర్-1లో ఆరో స్థానం పొందిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... ఎలిమినేటర్-2లో ఐదో స్థానంలో నిలిచిన జట్టుతో నాలుగో స్థానం పొందిన జట్టు ఆడతాయి. ఫిబ్రవరి 28న ఎలిమినేటర్-1 విజేత తొలి సెమీఫైనల్లో లీగ్ 'టాపర్'తో... ఎలిమినేటర్-2 విజేత లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడతాయి. ఫైనల్ మార్చి 1న జరుగుతుంది.

# సినిమా

## గెటింగ్ రెడీ



● చిరంజీవి

'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు హీరో చిరంజీవి. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్నారు. 'గెటింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అంటూ తన వర్కౌట్స్ వీడియోను షేర్ చేశారు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. అయితే ముందు చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్స్‌లో ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: చోటా కే నాయుడు.

## చలో రష్యా



● కమల్‌హాసన్

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' రష్యాలో ఆరంభం కానుందట. 1987లో వచ్చిన 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో నటిస్తున్నారు కమల్‌హాసన్. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైంది. కమల్‌హాసన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్ట్స్ షెడ్యూల్ చిత్రీకరణను రష్యాలో ప్లాన్ చేశారట మణిరత్నం. ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

## మహేశ్ సినిమాలో?



● నాగార్జున

సూపర్ స్టార్ మహేశ్‌బాబు-కింగ్ నాగార్జున స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఈ కాంబినేషన్ ఏ సినిమాకీ? అంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందనున్న చిత్రానికి అంటున్నారు. 'గుంటూరు కారం' సినిమా హిట్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న మహేశ్‌బాబు తన తర్వాతి చిత్రాన్ని ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ మూవీగా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ చిత్రానికి రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఇటీవలే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట రాజమౌళి. ఈ సినిమాలో సౌత్ ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించనున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే నాగార్జున కూడా కీలక పాత్రలో నటించనున్నారని టాక్. సినిమాలో చాలా ప్రాధాన్యం ఉన్న ఓ పాత్రకి నాగార్జునని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. నాగార్జునకి దక్షిణాదితో పాటు ప్రత్యేకించి బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. అందుకే జాతీయ స్థాయిలో పేరున్న నాగార్జునను 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కోసం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భోగట్టా. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది. మరి మహేశ్‌బాబు-నాగార్జున కాంబో తెరపై కనిపిస్తుందా? అంటే ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్న.

## సరికొత్త కథతో శ్రీకారం



● అమర్‌దీప్, సుప్రీత

'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. ఈ చిత్రానికి మాల్యాద్రి రెడ్డి దర్శకుడు. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ కొట్టగా, వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ- ''ఇండియన్ సినిమాలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని కొత్త కథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మాలాంటి కొత్త వాళ్లకి ఎం3 మీడియా చాన్స్ ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు మాల్యాద్రి రెడ్డి. ''బిగ్ బాస్'కి వెళ్లకముందే ఈ సినిమా ఒప్పుకున్నాను'' అన్నారు అమర్‌దీప్ చౌదరి. సుప్రీత, నటీనటులు సురేఖా వాణి, తేజస్వి, గౌతమ్ కృష్ణ, రఘు, నటుడు, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: దాస్ కడియాల, కెమెరా: బాల సరస్వతి.

## తెలుగు, నేపాలీ భాషల్లో...



● బ్రహ్మానందం

ప్రముఖ నటుడు బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న తొలి తెలుగు, నేపాలీ చిత్రం 'హ్రాశ్వ దీర్ఘ'. చంద్ర పంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరిహర్ అధికారి, నీతా దుంగన లీడ్ రోల్స్ చేస్తున్నారు. నీతా ఫిలిమ్స్ ప్రొడక్షన్స్‌పై నీతా దుంగన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హ్రాశ్వదీర్ఘ'లోని ఆయన పాత్రకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

## వేసవిలో మ్యాచ్



● సిద్ధార్థ్, నయనతార, మాధవన్

'ది టెస్ట్'ను పూర్తి చేశారు నయనతార. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నయనతారతో పాటు మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. మీరా జాస్మిన్ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సింగర్ శక్తి శ్రీగోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు, ఈ వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాను గత ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు వేసవికి వాయిదా వేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

## పల్లెటూరి ప్రేమకథ



● శ్రీకాంత్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ- ''రాధా మాధవం' ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమకథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది.. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''అందమైన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. మా సినిమా సెన్సార్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు దాసరి ఇస్సాకు. ''ఈ నెలలోనే మా సినిమా రిలీజ్ అవుతుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమకథతో సహజత్వం ఉట్టి పడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దాసరి ఇస్సాకు. మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన శ్రీకాంత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

## విన్నర్‌గా ఎలా మారాడు?



● గీతానంద్

''గేమ్ ఆన్' యునిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా వైవిధ్యంగా చేయాలని ప్రయత్నించాం. ఈ చిత్రంలో హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇందులో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని గీతానంద్ అన్నారు. దయానంద్ దర్శకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో గీతానంద్ మాట్లాడుతూ- ''దయానంద్ నా తమ్ముడు కావడంతో 'గేమ్ ఆన్' స్క్రిప్ట్ విషయంలో బాగా చర్చించుకునే వాళ్లం. రవి కస్తూరి కూడా నా ఫ్రెండ్ కావడంతో ముగ్గురం చర్చించుకుని నిర్ణయాలు తీసుకునేవాళ్లం. ఈ మూవీకి సీక్వెల్ ప్లాన్ ఉంది'' అన్నారు.

## మ్యూజిక్ కూడా కథ చెబుతుంది

*- దేవ్ జాంద్*



రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాంద్ మాట్లాడుతూ- ''నా పదో తరగతి నుంచే మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశాను. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రొగ్రామింగ్ నేర్చుకున్నాను. కొన్ని వీడియో గేమ్స్‌కి మ్యూజిక్ ఇచ్చాను. సంగీత దర్శకుడిగా 'ఈగల్' నాకు తొలి చిత్రం. కాలేజీలో నేను, హీరో శ్రీవిష్ణు క్లాస్ మేట్స్. అలా కార్తీక్ నాకు పరిచయం అయ్యాడు. ఇప్పుడు తనతో నా జర్నీ మొదలైంది. రవితేజగారితో సినిమా ఫిక్స్ అయ్యాక ఆయన ఓకే చెబితే, మ్యూజిక్ డైరెక్టర్‌గా నాకు చాన్స్ ఇస్తానన్నాడు కార్తీక్. రవితేజగారు నా మ్యూజిక్ ట్రాక్స్ విని, నచ్చి ఓకే చేశారు. రవితేజగారి సినిమాకు మ్యూజిక్ చేయడం నా లక్. ఈ సినిమాలో మ్యూజిక్, ఆర్ఆర్‌లకు మంచి స్కోప్ ఉంది. మ్యూజిక్ కూడా కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. ఇక కార్తీక్ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా చేస్తున్న ఓ సినిమాకు, దర్శకుడు నక్కిన త్రినాథరావుగారి ప్రొడక్షన్‌లోని ఓ మూవీకి మ్యూజిక్ ఇస్తున్నాను. మరో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.